


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083


# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 29 మంగళవారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 314
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatnam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## పహల్గామ్ ఉగ్రవాదుల ఎన్ కౌంటర్!

- జమ్మూ కాశ్మీర్‌లో కొనసాగుతోన్న భీకర ఎన్‌కౌంటర్
- దచిగామ్ పార్కు సమీపంలో ఎదురుకాల్పులు..ఉద్రిక్తత
- ఆపరేషన్ మహాదేవ్ పేరుతో సైన్యం భారీ గాలింపు
- పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరులన్న అనుమానం
- లష్కరే తోయిబా ఉగ్రవాది సులేమాన్ షా మృతి
- సంఘటనా స్థలానికి అదనపు బలగాల రాక
- శ్రీనగర్ శివార్లలో హెూరాహెూరీ కాల్పుల తూటాలు
- ఆపరేషన్ సిందూర్ తరువాత మరో కీలక దాడి
- భద్రతా బలగాలపై ముష్కరుల కాల్పులతో ప్రారంభం

ఆపరేషన్ 'మహాదేవ్'.


2

**జమ్మూకశ్మీర్-నవభూమి ప్రతినిధి**

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీనగర్ నగర శివార్లలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దచిగామ్ నేషనల్ పార్కు సమీపంలోని హర్వాన్ ప్రాంతంలో.. ముఖ్యంగా ముల్నార్ ఏరియాలో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య సోమవారం నుంచి హెూరా హెూరీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ ఆపరేషన్‌కు "ఆపరేషన్ మహాదేవ్" అని పేరు పెట్టారు.సమగ్ర నిఘా సమాచారం ఆధారంగా భద్రతా దళాలు యాంటీ-మిలిటెన్సీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. నిర్దిష్ట ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న పక్కా సమాచారంతో.. జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సైన్యం సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరపడంతో ఎదురు కాల్పులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సుమారు ఇద్దరు నుంచి ముగ్గురు ఉగ్రవాదులు చిక్కుకున్నట్లు భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. అంతేకాకుండా వీరు పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరులుగా భావిస్తున్నారు. పహల్గామ్ దాడిలో పాల్గొన్న లష్కరే తొయిబా ఉగ్రవాది సులేమాన్ షాను మట్టుబెట్టినట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

**ఆపరేషన్ 'మహాదేవ్'.. ఉగ్రవాదులు మట్టి గలిసినట్టేనా..?**

ఎదురుకాల్పుల ధ్వనులు ఎప్పటికప్పుడు వినిపిస్తున్నాయని, ఇది ఒక తీవ్రమైన ఆపరేషన్ అని అధికారులు తెలిపారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని.. సంఘటనా స్థలానికి అదనపు బలగాలను పంపారు. ఉగ్రవాదులను పట్టుకోవడానికి లేదా మట్టుబెట్టడానికి బలగాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశాయి. శ్రీనగర్‌లో ఉన్న ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ తమ అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) హ్యాండిల్ ద్వారా ఈ ఎన్‌కౌంటర్ గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తోంది. మొత్తం ఆపరేషన్ పూర్తయిన తర్వాతే ఉగ్రవాదులను చంపారా లేదా అనేది తెలిసే అవకాశం

## బనకచర్లపై కేంద్రం కీలక ప్రకటన

- గోదావరి మిగులు జలాలకు రాయలసీమ దిశగా ప్రణాళిక
- బనకచర్ల ప్రాజెక్టుకు రూ.81,900 కోట్ల అంచనా
- ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు కేంద్ర జలసంఘానికి అందజేత
- తెలంగాణ అభ్యంతరాలతో కేంద్రం అప్రమత్తం
- అఖిలపక్షం తీర్మానంతో తెలంగాణ వ్యతిరేకత
- మంత్రి పాటిల్‌ను కలిసిన తెలంగాణ మంత్రుల బృందం
- ప్రాజెక్ట్ ఫైల్‌ను పక్కన పెట్టిన జలశక్తి శాఖ
- పాటిల్ అధ్యక్షతన సీఎంల భేటీ
- నిపుణుల కమిటీ ఏర్పాటు తీర్మానం



2


**న్యూఢిల్లీ-నవభూమి ప్రతినిధి**

బనకచర్ల ప్రాజక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజక్ట్ సాంకేతిక - ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ. 81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు.అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన దస్త్రాన్ని కేంద్రం జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది.ఆ తర్వాత.. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి

## ఏపీలోని ఆటో డ్రైవర్లకు రూ.10,000

- రూ.10,000 ఆర్థిక సాయం
- ఉచిత బస్సు ప్రయాణానికి లేడీలకు జీరో ఫేర్ టికెట్లు
- అన్నదాతలకు 'సుఖీభవ'-'పీఎం కిసాన్' కలిపి రూ.20,000
- పెట్టుబడులతో పరవళ్లు -పది లక్షల కోట్లు రాబడి
- జిల్లాలకే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు పథకం
- టీడీపీ కూటమి హామీల అమలుపై దృష్టి

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఏపీలోని ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం తీపికబురు వినిపించింది. రాష్ట్రంలోని ఆటోడ్రైవర్లకు రూ.10000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు, శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి.. అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత నిధులను త్వరలోనే రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో పీఎం కిసాన్ యోజనతో కలిపి ఏడాదికి రూ.20000 అందించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి ఆటో డ్రైవర్‌కు కూడా త్వరలోనే పది వేల రూపాయలు అందిస్తామని అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఏపీకి పెట్టుబడులు తరలివస్తున్నాయన్న కొల్లు రవీంద్ర.. ఇప్పటి వరకూ పది లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని వివరించారు.మరోవైపు మహిళల కోసం ఆగస్ట్ 15 నుంచి ఏపీ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. సూపర్ సిక్స్ హామీలలో మాట ఇచ్చిన విధంగా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించనుంది. తొలుత జిల్లాల వరకే ఈ పథకాన్ని పరిమితం చేయాలని భావించినప్పటికీ.. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత

## ఖమ్మం జిల్లాలో ఎకో టూరిజం


- పాలేరు వద్ద జలక్రీడలు
- పుణ్యక్షేత్రంగా భద్రాచలం
- కిన్నెరసానిలో ప్రకృతి శోభ
- ఖమ్మం ఖిల్లా రోప్‌వే
- సీఎం పర్యటనకు ఏర్పాట్లు
- 500 ఎకరాల్లో ఎకో టూరిజం
- మంత్రుల సమీక్ష సమావేశం
- అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



2

## మహాలక్ష్మి, చేయూతకు దరఖాస్తుల ఆహ్వానం

- కొత్త కార్డులకు కొత్త లాభాలు
- దరఖాస్తుల్లో అయోమయం
- ప్రత్యేక డ్రైవ్ ప్లాన్
- ఇంటికే వస్తారు..అధికారులు
- మహాలక్ష్మి పథకం లబ్ధి
- చేయూతకు కొత్త దారులు
- ఇందిరమ్మ ఇండ్లకు అవకాశాలు
- పేద, మధ్యతరగతికి ఆర్థిక భరోసా
- ఆరోగ్యశ్రీకి కార్డు తప్పనిసరి



2

## ఏపీని అభివృద్ధి చేయండి సింగపూర్ మంత్రిని కోరిన సీఎం చంద్రబాబు

- సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్‌తో సీఎం భేటీ
- గత ఇబ్బందులపై చర్చ.. విశ్వాసం పెంపు
- గ్రీన్ ఎనర్జీ-పోర్టుల్లో పెట్టుబడుల పిలుపు
- నవంబర్‌లో వైజాగ్ సదస్సుకు ఆహ్వానం
- అమరావతి మాస్టర్ ప్లాన్‌కు సింగపూర్ తోడ్పాటు
- గృహ నిర్మాణంలో అనుభవాన్ని అభినందన
- డేటా సెంటర్లు, లాజిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విభాగాల్లో అభివృద్ధి చేయడానికి సింగపూర్ సహకారం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. సింగపూర్ పర్యటనలో ఉన్న చంద్రబాబు ఆ దేశ వాణిజ్య, పరిశ్రమ శాఖ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్‌తో సోమవారం భేటీ అయ్యారు. గత ప్రభుత్వ హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులపై చర్చించినా ఆయన.. ఆ రికార్డులు సరిచేసేందుకే తాను సింగపూర్ వచ్చినట్లు స్పష్టం చేశారు.గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్ కారిడార్లు, పోర్టులు ఇలా అన్ని రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం కావాలంటూ టాన్ సీ లెంగ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. సింగపూర్‌పై అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ నిర్మించినట్లు ఆయన తెలిపారు. సింగపూర్‌ని చూసే హైదరాబాద్‌లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు గుర్తు చేశారు. మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం మరీ మరీ చెప్పారు. అందుకోసమే నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలంటూ టాన్ సీ లెంగ్‌ను ఆహ్వానించారు. నాలెడ్జ్ ఎకానమీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో పనిచేస్తున్నారని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు. డేటా సెంటర్ల

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ యూటర్న్

- సిట్ విచారణకు హాజరైన ప్రవీణ్
- బీఆర్ఎస్ హ్యాకింగ్ ఆరోపణలు
- స్టేట్‌మెంట్‌తో కలకలం
- కేసీఆర్‌పై గతంలో ఫిర్యాదు
- రేవంత్‌పై తాజా ఆరోపణ
- రెండు సార్లు నోటీసులు పంపిన సిట్

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు మాజీ పోలీస్ ఉన్నతాధికారి, బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ (సోమవారం జులై 28) హాజరయ్యారు. విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ప్రవీణ్ కుమార్‌కి సిట్ అధికారులు రెండు సార్లు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. తన ఫోన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాక్ చేస్తోందని, ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడుతోందని గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హెూదాలో ప్రవీణ్ కుమార్ ఈసీ, డీజీపీకి ఫిర్యాదు చేశారు.ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు ఆధారంగానే సిట్ అధికారులు

## షటిల్ ఆడుతూ యువకుడి మృతి

- నాగోల్ స్టేడియంలో విషాదం
- గుండెపోటుతో కుప్పకూలిన రాకేశ్
- కాపాడలేకపోయిన సహచరులు
- ఆసుపత్రి చేరుకునేలోపే మృతి
- ఖమ్మం జిల్లాకు చెందిన యువకుడు
- తల్లిదండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు
- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు



2

**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

ఆటలాడితే, ఆరోగ్యంగా ఉంటామని అందరం అనుకుంటున్నాం. కానీ రెగ్యులర్‌గా షటిల్ ఆడుతున్న 25 ఏళ్ల యువకుడు మృత్యువు నుంచి తనను తాను కాపాడుకోలేకపోయాడు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నాగోల్‌లో ఈ విషాద ఘటన జరిగింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో గుండ్ల రాకేశ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతడికి రోజూ షటిల్ ఆడే అలవాటు ఉంది. అలవాటు ప్రకారం, నాగోల్ స్టేడియంలో ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి షటిల్ ఆడుతుండగా గుండెపోటు వచ్చింది. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.ఏం జరిగిందో తెలియక సహచరులు దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చి లేపే ప్రయత్నం చేశారు. కానీ, కళ్లు తెరవకపోవడంతో వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. రాకేశ్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడు రాకేశ్‌ది ఖమ్మం జిల్లా తల్లాడ. చేతికి వచ్చిన కుమారుడు ఇలా మృతి చెందడంతో తల్లిదండ్రులు, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

హైదరాబాద్ నాగోల్‌లో విషాదకర ఘటన చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఇండోర్ స్టేడియంలో ఓ యువకుడు షటిల్ ఆడుతుండగా

## తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జిలు

- కేంద్రం ఆమోదంతో 4 కొత్త నియామకాలు
- గాడి ప్రవీణ్‌కుమార్ తదితరులు త్వరలో ప్రమాణం
- కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఏకే సింగ్ బాధ్యతల స్వీకారం
- హైకోర్టులో ఇప్పటికీ 12 ఖాళీలు ఉన్నవే
- జడ్జిల కొరత వల్ల న్యాయ వ్యవస్థపై పని భారం
- సత్వర న్యాయం కోసం ఖాళీల భర్తీ అత్యవసరం



2

**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులను కేంద్రం ఆమోదించడంతో.. రాష్ట్రపతి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలతో తెలంగాణ న్యాయవ్యవస్థకు మరింత బలం చేకూరనుంది. కొత్త న్యాయమూర్తులుగా గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్‌లు త్వరలో ప్రమాణం చేయనున్నారు.

కొత్త ప్రధాన న్యాయమూర్తి..ఇటీవలే తెలంగాణ హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నియమితులైన విషయం తెలిసిందే. ఆయన జులై 19వ తేదీన రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డీజీపీ జితేందర్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు హాజరయ్యారు. జస్టిస్ ఏకే సింగ్ త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి, బదిలీపై తెలంగాణకు వచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన తెలంగాణ హైకోర్టుకు ఏడో ప్రధాన న్యాయమూర్తి. గతంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సుజోయ్ పాల్ బదిలీల్లో కలకత్తా హైకోర్టుకు వెళ్లారు. జస్టిస్ సింగ్ 1965లో జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి

## తెలంగాణలో కాంగ్రెస్ మరో పాదయాత్ర

- కాంగ్రెస్ మరోసారి ప్రజల్లోకి పాదయాత్రకు సిద్ధం
- 6 నియోజకవర్గాల్లో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర
- జులై 31 నుంచి 7 రోజుల పాటు పాదయాత్ర
- ప్రజల సమస్యలపై ప్రత్యక్ష సమాచారం సేకరణ
- స్థానిక ఎన్నికల దృష్ట్యా నేతల సమన్వయ కృషి
- జై భీమ్, జై బాపూ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం
- ప్రతి జిల్లాలో ఒక్క నియోజకవర్గంలో రాత్రి బస

2



**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ మరోసారి పాదయాత్ర చేసేందుకు సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పేరుతో తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి పార్టీని గెలిపించుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర తర్వాత కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు.మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు సంబంధించి రూట్ మ్యాప్ కూడా సిద్ధమైంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే ఈ పాదయాత్ర ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రజలతో మమేకం అవుతూ శ్రమదానం కూడా ఆమె చేయనున్నారు. కాంగ్రెస్ పారీ

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా దేవానంద్

- పదవీకాలం 2028 ఏప్రిల్ 13 వరకు
- న్యాయమూర్తుల సంఖ్య 29కి పెరిగింది
- గుడివాడలో జన్మించిన జస్టిస్ దేవానంద్
- ఆంధ్రా యూనివర్సిటీ నుంచి విద్య పూర్తి
- విద్యార్థి నేతగా ఆరంభం
- 2006లో బార్ కౌన్సిల్ సభ్యుడిగా సేవ
- న్యాయరంగంలో విశేష అనుభవం



**అమరావతి-నవభూమి ప్రతినిది**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఉదయం హైకోర్టులో ఆయనతో ప్రమాణం చేయించారు. జస్టిస్ దేవానంద్ హైకోర్టులో నాలుగవ స్థానంలో కొనసాగుతారు. ఆయన పదవీకాలం 2028 ఏప్రిల్ 13 వరకు ఉంది. కాగా, జస్టిస్ బట్టు దేవానంద్ రాకతో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 29 కి చేరింది.జస్టిస్ బట్టు దేవానంద్ ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లా గుడివాడ టౌన్ లో 1966 లో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఏ, లా కాలేజీ నుంచి న్యాయవాద పట్టా అందుకున్నారు. విద్యార్థుల సంఘం నాయకుడిగానూ వ్యవహరించారు. 2006 లో బార్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలందించారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

2

## బాలాపూర్‌లో భారీ అగ్నిప్రమాదం



హైదరాబాద్-నవభూమి:రాచకొండ కమిషనరేట్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి బాబానగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం జరగడంతో మంటలు దట్టంగా వ్యాపించాయి. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక అధికారులు చేరుకొని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. స్థానికులని సంఘటన స్థలం నుంచి దూరంగా పంపించి వేస్తున్నారు.
అయితే ఈ ప్రమాదంలో ఏలాంటి ప్రాణనష్టం జరగలేదని.. కానీ ఆస్తి నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎంతవరకు ఆస్తి నష్టం జరిగిందనేది తెలియాల్సి ఉంది. ప్లాస్టిక్ కంపెనీ కావడంతో మంటలు త్వరగా వ్యాపించినట్లు తెలుస్తోంది. ఈ కంపెనీలో ఉన్న ప్లాస్టిక్ దానా మంటల్లో కాలి బుడిదైంది. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉంటుందా..? లేదంటే ఇంకా ఏదైనా కారణాలు ఉన్నాయా..? అనే పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇటీవల వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

## తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జిలు

**(1వపేజీ తరువాయి)**ఎల్‌ఎల్‌బీ పట్టా పొంది, 1990 నుంచి 2000 వరకు ఉత్తరప్రదేశ్ హైకోర్టులో, ఆ తర్వాత 2001 నుంచి జార?ండ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. 2012లో జార?ండ్ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులై, 2022 నుంచి 2023 వరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023 ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీలు..
ఈ కొత్త నియామకాలతో తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య కొంత పెరుగుతుంది. అయితే.. ఇప్పటికీ తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీలు గణనీయంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టుకు మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా.. కొత్త నియామకాలతో సహా ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరుకుంటుంది. దీని అర్థం.. ఇంకా 12 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
ఈ ఖాళీల కారణంగా కోర్టులో కేసుల విచారణ ఆలస్యం అవుతోంది. ఇది న్యాయం కోరే పౌరులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. న్యాయమూర్తుల కొరత వల్ల ఉన్న న్యాయమూర్తులపై పని భారం విపరీతంగా పెరిగిపోతుంది. ఈ కొత్త నియామకాలు కొంతవరకు పని భారాన్ని తగ్గించినా.. మిగిలిన ఖాళీలను త్వరగా భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా న్యాయవ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసి.. ప్రజలకు సత్వర న్యాయం లభిస్తుంది.

## తెలంగాణలో కాంగ్రెస్ మరో పాదయాత్ర

**(1వపేజీ తరువాయి)** ప్రారంభించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికల నగారా కూడా త్వరలోనే మోగనుండటంతో.. పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా మీనాక్షి నటరాజన్ ప్రణాళికలు రచిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు ఆమె కృషి చేయనున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ఆమె స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. రాష్ట్రంలో 15 రోజులు పాటు ఉండనున్న ఆమె.. జూలై 29న పీసీసీ చీఫ్‌తో సమావేశం కానున్నారు.ఈ నెల 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో ఆమె పాదయాత్ర మొదలవ్వనుంది. పరిగి సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్న ఆమె తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్రతో పాటు రాత్రి బస కూడా ఏర్పాటు చేయాలని ఆమె భావిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలలో పాదయాత్ర చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.ఒకవైపు పాదయాత్రలు చేస్తూనే మరోవైపు జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీటింగ్ కూడా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగానే ముందుగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో రేపు సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించి.. రాష్ట్రంలోని పాలన, గ్రూపు రాజకీయాలపై సమాచారం తెలుసుకోనున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ యూటర్న్

**(1వపేజీ తరువాయి)** విచారణకు పిలిపించారు. ప్రవీణ్ కుమార్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు సిట్ అధికారులు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ స్టేట్‌మెంట్ ఆసక్తికరంగా మారింది. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా లేదా అనుకూలంగా ప్రవీణ్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడా అనేది చర్చనీయాంశంగా మారింది.ప్రవీణ్ కుమార్ యూటర్న్..ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ యూటర్న్ తీసుకున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తోందని, కేసీఆర్ తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్టలో ఎఫ్ఐఆర్ నమోదైంది. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌పై ప్రవీణ్ కుమార్ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు సిట్ అధికారులు. యాపిల్ మొబైల్‌కి అలర్ట్ మెసేజ్ రావడంతో గతంలో ఫిర్యాదు చేశానని తెలిపారు ప్రవీణ్ కుమార్. అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు ప్రవీణ్ కుమార్.ఫోన్ ట్యాపింగ్‌ను బీఆర్‌ఎస్ రాజకీయంగా వాడుకోలేదని ఇప్పుడు మాట మార్చారు ప్రవీణ్ కుమార్. బీఆర్‌ఎస్‌కి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. అప్పటి ఫిర్యాదుపై వాంగ్మూలం ఇవ్వమంటే , సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు సిట్‌కి ఫిర్యాదు చేశారు. డార్క్ వెబ్‌సైట్‌లో టూల్స్ ఉపయోగించి ప్రైవేటు వ్యక్తులతో ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌ను పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రవీణ్ కుమార్ విమర్శలు చేశారు.

## ఏపీలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**(1వపేజీ తరువాయి)అమరావతి:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 3 ఎంపీటీసీ 2 జడ్పీటీసీ, 2 సర్పంచ్ స్థానాల ఎన్నికలకు ఇవాళ (జులై 28)నోటిఫికేషన్ జారీ అయింది. దీంతో రామకుప్పం, కారంపూడి, విడవలూరు ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయి. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇక, ఇదే క్రమంలో కొండపూడి, కడియపులంక గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు కూడా జరుగుతాయి.ఇక, జూలై 30 నుండి ఆగష్టు 1 వరకూ నామినేషన్ల స్వీకరణకు అనుమతిస్తారు. ఆగస్టు 12న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనుండగా, ఆగస్టు 14న ఏపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వస్తాయి. ఆగస్టు 10న సర్పంచ్ ఎన్నికలు .. ఉండగా, అదే రోజున ఫలితాలు విడుదల చేస్తారు.

## ఆ నిధులు పక్కదారి పట్టించారు.. కేసీఆర్‌పై మంత్రి సీతక్క ఫైర్

హైదరాబాద్-నవభూమి: గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో ఇవాళ(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు.ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు.

# ఖమ్మం జిల్లాలో ఎకో టూరిజం



**ఖమ్మం-నవభూమి:** ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాలేరు రిజర్వాయర్ వద్ద జలక్రీడలు, పర్ణశాల, భద్రాచలం రామాలయం ప్రాంతాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు పరిధిలో ప్రకృతిని ఆస్వాదించేలా, కనిగిరి హిల్స్ వద్ద సాహస క్రీడలకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే ఏర్పాటుతో పాటు నూతన హరిత హోటల్ నిర్మాణం చేపట్టనున్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉండటంతో ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రులు ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో ఎకో, టూరిజం.. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త కళను తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. జిల్లాలో ఎకో టూరిజం , టెంపుల్ టూరిజంలను విస్తృతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్ రెడ్డిలతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు కీలక పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై చర్చించారు.అభివృద్ధి చేయదగిన ప్రదేశాలు వివరాల్లోకి వెళ్తే.. పాలేరు రిజర్వాయర్ పరిధిలో.. జల క్రీడలు, విశ్రాంతి కేంద్రాల ఏర్పాటు.. నేలకొండపల్లి బౌద్ధ స్థూపం వద్దు.. చారిత్రక ప్రాధాన్యతను చాటేలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయనున్నారు. ఇక వీటితో పాటు.. పర్ణశాల, భద్రాచలం రామాలయం ఆధ్వర్యంలో.. ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం, భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం... కిన్నెరసాని ప్రాజెక్టు పరిధిలో.. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేలా అభివృద్ధి చేయడం.. కొత్తగూడెం హరిత హోటల్ పరిధిలో.. పర్యాటకులకు బస సౌకర్యాలు కల్పించడం.నేనేం పిచ్చిదాన్ని కాదు.. హోస్ట్ కిచ్చా సుదీప్ వెలుగుమట్ల అర్బన్ పార్కు: పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడం.. ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే: పర్యాటకులను ఆకర్షించడానికి ఆధునిక సౌకర్యాలు... ఖమ్మంలో కొత్త హరిత హోటల్: జిల్లా కేంద్రంలో పర్యాటకుల కోసం వసతులు కల్పించనున్నారు.ఈ ప్రదేశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనువైన వాతావరణం, ఎన్నో చారిత్రక కట్టడాలు, ఆలయాలు ఉన్నాయని, వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని మంత్రులు అభిప్రాయ పడ్డారు. దేశంలో ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయంను మరింత అభివృద్ధి పరచి, భక్తులకు అత్యుత్తమ వసతులు కల్పించాలని మంత్రులు స్పష్టం చేశారు. అందుకు కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లేదా ప్రైవేట్ భాగస్వామ్యంతో వెంటనే మంజూరు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో టూరిజం డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి, తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు.
సీఎం రేవంత్ రెడ్డి పర్యటన.. ఏకో టూరిజం అభివృద్ధి..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే నెలలో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని, ఈ పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉన్నందున, తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు ఆదేశించారు. ఖమ్మం పట్టణానికి సమీపంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రదేశంలో ఏకో టూరిజం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం పట్టణంలో కొత్త హరిత హోటల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కొత్తగూడెంలో ఉన్న హరిత హోటల్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

# మహాలక్ష్మి, చేయూతకు దరఖాస్తుల ఆహ్వానం



తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన వేలాది కుటుంబాలు ప్రస్తుతం ఒక సందిగ్ధంలో ఉన్నాయి. తమకు కొత్తగా కార్డులు వచ్చినా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో.. ఎవరికి దరఖాస్తులు సమర్పించాలో తెలియక సతమతం అవుతున్నాయి. గతంలో రేషన్ కార్డులు లేని కారణంగా ఎన్నో ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండిపోయిన వారికి.. ఇప్పుడు ఈ కొత్త కార్డులు రావడంతో ఎంతో ఉపశమనం లభించింది.ముఖ్యంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. దాదాపు ప్రతీ పథకానికి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటుండటంతో.. కొత్తగా కార్డులు పొందిన వారు వాటికి దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే.. ఈ ప్రక్రియ వారికి గందరగోళంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం.. కొత్త రేషన్ కార్డుదారుల కోసం ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని వల్ల వారికి సంక్షేమ పథకాలను మరింత సులభతరం చేయనుంది.
ప్రత్యేక డ్రైవ్ ద్వారా దరఖాస్తులు..
రాష్ట్రంలో కొత్తగా జారీ చేస్తున్న రేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సర్కార్ సిద్ధమైంది. ప్రతి పథకంతో పాటు.. ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలకు కూడా రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో.. కొత్తగా కార్డులు పొందుతున్న వారికి ప్రభుత్వ పథకాలు అందేలా ఒక సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం.. కొత్తగా దాదాపు 7 లక్షల వరకు రేషన్ కార్డులు మంజూరయ్యాని తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న వివిధ గ్యారంటీ పథకాలను కొత్త రేషన్ కార్డుదారులకు కూడా అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), ఇందిరమ్మ ఇళ్లు (గృహనిర్మాణ పథకం), మహాలక్ష్మి (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2500 ఆర్థిక సాయం), చేయూత (వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లు) తదితర పథకాల కోసం ఈ కొత్త లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది.దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఈ డ్రైవ్‌లో భాగంగా.. అధికారులే నేరుగా లబ్ధిదారుల నివాసాల వద్దకు వెళ్లి, వారి వివరాలను నమోదు చేసుకుని.. అవసరమైన అనుసంధాన ప్రక్రియను పూర్తి చేస్తారు. దీనివల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే.. తమకు అర్హత ఉన్న పథకాల సేవలను పొందగలుగుతారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటించనుంది.
లబ్ధిదారుల సంఖ్య పెరుగుదల..గతంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 90.10 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉండగా.. 2.84 కోట్ల మంది వివిధ పథకాల కింద లబ్ధిదారులుగా ఉన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇప్పటివరకు కొత్తగా 3.50 లక్షలకు పైగా రేషన్ కార్డులను మంజూరు చేసింది. మొత్తంగా 7 లక్షల కుటుంబాలకు కొత్తగా కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త కార్డుల కింద 30 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉంటారని అంచనా. ఈ లబ్ధిదారులందరినీ ప్రభుత్వ సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం పక్కాగా ప్రణాళికలు రచిస్తోంది. ఈ కీలక నిర్ణయం వల్ల రేషన్ కార్డులు లేని కారణంగా ఇంతకాలం ప్రభుత్వ పథకాలు అందని లక్షలాది మందికి ఇప్పుడు ఆర్థిక భరోసా లభిస్తుంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ఒక పెద్ద ఊరట అని చెప్పవచ్చు.

# షటిల్ ఆడుతూ యువకుడి మృతి

**(1వపేజీ తరువాయి)**గుండెపోటుకు గురయ్యాడు. అప్పటి వరకు ఉత్సాహంగా షటిల్ ఆడిన 25 ఏళ్ల యువకుడు గుండ్ల రాకేష్ ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన ఆదివారం (జూలై 27) సాయంత్రం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు కుమారుడైన రాకేష్.. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. నాగోల్ పరిధిలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం షటిల్ ఆడేందుకు ఇండోర్ స్టేడియం వెళ్లాడు. స్నేహితులతో షటిల్ ఆడుతూనే.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో అక్కడున్న వారు వెంటనే అతడికి సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలించారు. అయితే.. అప్పటికే రాకేష్ మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషాదకర ఘటన స్టేడియంలోని సీసీ కెమెరాల్లో రికార్డయింది.ఇటీవలి కాలంలో ముఖ్యంగా యువతలో ఆకస్మిక గుండెపోటు మరణాలు గణనీయంగా పెరిగాయి. కొవిడ్-19 మహమ్మారి తర్వాత ఈ తరహా ఘటనలు మరింత ఆందోళనకరంగా మారాయి. కొవిడ్ వైరస్ గుండె, రక్తనాళాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపగలదని కొందరు వైద్య నిపుణులు చెబుతున్నారు. కొవిడ్ నుంచి కోలుకున్న వారిలో కొందరికి మయోకార్డిటిస్ (గుండె కండరాల వాపు), రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు. ఇది గుండెపోటుకు దారితీయవచ్చునని చెబుతున్నారు .దాంతో పాటుగా.. ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, నిద్రలేమి గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని చెబుతున్నారు. అనారోగ్యకరమైన ఆహారం అధిక కొవ్వు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి రక్తనాళాలు పూడుకుపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి నేటి యువతలో సర్వసాధారణ అయిపోయాయని.. దీర్ఘకాలిక ఒత్తిడి రక్తపోటును పెంచి గుండెపోటుకు కారణమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. గుండెపోటు బారిన పడకుండా ఉండాలంటే.. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, కాసేపైనా వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. పొగతాగడం, అధికంగా మద్యం సేవించడం గుండె కండరాలను దెబ్బతీసి, గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయని వాటికి దూరంగా ఉండాలని చెబుతున్నారు.

## ఏపీకి భారీగా పెట్టుబడులు.. ఏకంగా రూ. వేల కోట్లు

**అమరావతి-నవభూమి ప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు వచ్చాయి.. ఆయా జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. ఫార్మా, సోలార్ ప్యానళ్ల తయారీ, లైట్ బ్రిక్స్ ఇలా పలు కంపెనీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం భూముల్ని కేటాయించింది. ఏపీ ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో లారస్ ఫార్మా జోన్ అభివృద్ధికి భూమిని కేటాయించింది. రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫేజ్-2లో 531.77 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమికి సంబంధించి.. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున లారస్ సంస్థ సంస్థ చెల్లించనుంది. ఆ సంస్థ వివిధ దశల్లో రూ.5,600 కోట్ల పెట్టుబడులు.. 6,350 మందికి ఉపాధి కల్పించనుందని డీపీఆర్‌లో పేర్కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది.మరోవైపు అనకాపల్లిలో జిల్లాలోనే మరో పరిశ్రమ ఏర్పాటుకానుంది. రాంబిల్లిలో ఆర్ఈ న్యూ సంస్థ 6 గిగావాట్ల సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు వారికి ఆ సంస్థకు 135.96 ఎకరాలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ యూనిట్ ఏర్పాటుతో రూ.3,700 కోట్ల పెట్టుబడులు.. 1,200 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. ఇటు శ్రీకాకుళం జిల్లాలో కూడా మరో కంపెనీ ఏర్పాటు చేయనున్నారు. ఏపీసీ లైట్ బ్రిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు వీఎస్ఆర్ సర్కన్ ఇండస్ట్రీస్ సంస్థ వచ్చింది. రణస్థలం మండలం సాంచంలో ఈ సంస్థకు ఎకరానికి రూ.11.62 లక్షల చొప్పున 22.45 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు కర్నూలు జిల్లాకు మరో సోలార్ ప్యానళ్ల తయారీ యూనిట్ ఏర్పాటుకానుంది. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.6,933 కోట్ల పెట్టుబడితో 5 గిగావాట్ల సోలార్ సెల్, 5 గిగావాట్ల సోలార్ మాడ్యూళ్ల తయారీ యూనిట్‌ను అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ఏర్పాటుతో మొత్తం 2,138 మందికి ఉపాధి కల్పించే ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అనుమతించింది ప్రభుత్వం. మల్లవల్లి మెగా ఫుడ్ పార్క్‌లో అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 13.85 ఎకరాలు, మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో 115.65 ఎకరాలను ఎకరం రూ.16.5 లక్షల చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వుల జారీ చేశారు.చిత్తూరు జిల్లా లింగాపురం దిన్నె దగ్గర ఏపీఈ ఇంటర్నేషనల్‌కు గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ డెయిరీ ఉత్పత్తుల న్యూట్రిషన్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 75.63 ఎకరాలను కేటాయించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.1,000 కోట్ల పెట్టుబడులు.. 2 వేల మందికి ఉపాధి దక్కుతుందని చెబుతున్నారు.

## పహల్గామ్ ఉగ్రవాదుల ఎన్ కౌంటర్!

**(1వపేజీ తరువాయి)**ఉంది.
**ఏప్రిల్ 22వ తేదీన 26 మంది అమాయక ప్రాణాలు తీసిన ముష్కరులు..**
జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం బైసరన్ లోయలో ఏప్రిల్ 22వ తేదీ జరిగిన ఉగ్రదాడి గురించి అందరికీ తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. ముస్లిం కాని పురుషులనే లక్ష్యంగా చేసుకుని చేసిన దాడులకు పాల్పడ్డారు. మొత్తంగా 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు తీశారు. అయితే ఇదంతా చేసింది నలుగురు ఉగ్రవాదులే కాగా.. భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసింది. కానీ ఇప్పటి వరకు పహల్గాం దాడికి పాల్పడిన ముష్కరులు మాత్రం పట్టుబడలేదు. కానీ తాజాగా వారిపైనే భద్రతా బలగాలు కాల్పులు చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో ప్రజలంతా తెగ సంబుర పడిపోతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతోందనేది.
కశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో పహల్గామ్ మాస్టర్‌మైండ్ హతం. ఎవరీ సులేమాన్ షా?:ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చర్చ ప్రారంభించిన సమయంలోనే.. జమ్మూ కశ్మీర్‌లో భద్రతా దళాలకు భారీ విజయం దక్కింది. పహల్గామ్‌లో 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షా అలియాస్ హషీమ్ మూసా సహా ముగ్గురు ముష్కరులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఆపరేషన్ మహాదేవ్ పేరుతో భద్రతా బలగాలు సోమవారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. లష్కరే తొయిబా ఉగ్రవాది సులేమాన్ షాను పహల్గామ్ దాడికి ప్రధాన సూత్రధారిగా గుర్తించినట్లు భద్రతా వర్గాలు ధ్రువీకరించాయి. శ్రీనగర్ సమీపంలో దచిగామ్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో సులేమాన్‌ను హతమార్చారు. సులేమాన్‌తో పాటు హతమైన ఇద్దరు ఉగ్రవాదులను అబూ హమ్జా, యాసిర్‌గా గుర్తించారు. ఇండియన్ ఆర్మీ , సీఆర్పీఎఫ్, జమ్మూ-కశ్మీర్ పోలీసు బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే.ఎవరీ సులేమాన్ అలియాస్ హసీమ్ మూసా ?
పహల్గామ్ ఉగ్రదాడికి ప్రధాన సూత్రధారి అయిన సులేమాన్ షా.. పాకిస్థాన్ ఆర్మీలో పనిచేసినట్టు గుర్తించారు. పాకిస్తాన్ ఆర్మీ ప్రత్యేక దళాల్లో పారా కమాండర్‌గా శిక్షణ తీసుకున్న ఇతడి మరో పేరు హషీమ్ మూసా . పహల్గామ్‌లోని బైసరన్ లోయలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి అనంతరం జమ్మూ-కశ్మీర్ పోలీసులు షా గురించి సమాచారం ఇస్తే రూ. 20 లక్షల బహుమతిగా అందజేస్తామని ప్రకటించారు. గతంలో కశ్మీర్‌లో జరిగిన మూడు కీలక ఉగ్రదాడుల్లో కూడా హషీమ్ మూసా సూత్రధారిగా ఉన్నాడని నిఘా వర్గాలు గుర్తించాయి. దాడి తర్వాత ఉగ్రవాదులు తప్పించుకున్న తీరు పరిశీలిస్తే వారికి అత్యున్నతస్థాయి శిక్షణ, నైపుణ్యాలు ఉన్నాయని భద్రతా బలగాలు అనుమానించాయి.పహల్గామ్ దాడిలో పాల్గొన్న ముష్కరులు అత్యాధునిక ఎం 4 రైఫిల్స్‌ను ఉపయోగించడంతో వారికి హషీమ్ మూసా శిక్షణ ఇచ్చినట్టు భావిస్తున్నారు. హషీమ్ మూసా ప్రస్తుతం లష్కరే ఉగ్రవాద సంస్థతో కలిసి పనిచేస్తోన్న కరుడుగట్టిన ఉగ్రవాది. భారత్‌లోని భద్రతా బలగాలు, పౌరులపై దాడులకు లష్కరే తోయిబా అతడ్ని కశ్మీర్‌కు పంపించినట్టు పలు నివేదికలు బట్టబయలు చేశాయి. అతడి వ్యూహాత్మక ఆలోచనలు, ఆయుధ శిక్షణ అతడిని అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదిగా మార్చాయి. పహల్గామ్ దాడికి పాకిస్థాన్ అగ్రనేతల నుంచి ఆదేశాలు అందినట్టు నిఘా నివేదికలు వెల్లడించాయి.

## బనకచర్లపై కేంద్రం కీలక ప్రకటన

**(1వపేజీ తరువాయి)**చర్చించారు. అనంతరం ఈ అంశంపై నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలంటూ ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల భారీ నీటి పారుదల శాఖ మంత్రులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఏపీలోని ఆటోడ్రైవర్లకు రూ.10,000

**(1వపేజీ తరువాయి)**బస్సు పథకం అమలు చేయనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ప్రకటించారు. నారా లోకేష్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.ఇక ఉచిత బస్సు పథకం అమల్లో భాగంగా మహిళలకు జీరో ఫేర్ టికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ టికెట్ల మీద ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణిస్తున్నారు.. ఉచిత బస్సు పథకం వలన వారికి ఎంత మేరకు డబ్బులు ఆదా అయ్యాయనే వివరాలను ముద్రించనున్నారు. దీంతో ఈ పథకం వలన ఎంత మేరకు ప్రయోజనం పొందామో మహిళలకు తెలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఏపీని అభివృద్ధి చేయండి సీఎం చంద్రబాబు వినతి

**(1వపేజీ తరువాయి**ఏర్పాటులోనూ సింగపూర్ భాగస్వామ్యం కావాలని కోరారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని, ఏపీఓ పోర్టుల నిర్మాణంలోనూ సహకరించాలన్నారు. అనంతరం సింగపూర్ మంత్రి టాన్ సీ లెంగ్ మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ వచ్చినప్పుడు చంద్రబాబును కలిశానని, ఏపీతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ రంగంలోనూ ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.సిటీ ఇన్ ఏ గార్డెన్ పేరుతో సింగపూర్‌లో పది వేల కుటుంబాలు నివసించే బిడదారి ఎస్టేట్‌లో రెండు గంటల పాటు సీఎం పర్యటించారు. పట్టణ, నగర ప్రాంతాల్లో అందుబాటు ధరల్లో నాణ్యమైన నివాస గృహాల నిర్మాణంపై చంద్రబాబు సింగపూర్ అధికారులతో చర్చించారు. 250 ఎకరాల్లో విస్తరించిన సింగపూర్ ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టును పూర్తిగా సందర్శించారు. అనంతరం ప్రపంచ బ్యాంక్ అధికారులతో సీఎం బృందం సమావేశమయ్యారు. అమరావతి విషయంలో సింగపూర్ ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, వరల్డ్ బ్యాంక్ కూడా భాగస్వామి అవుతోందని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో నారా లోకేశ్‌తో పాటు మంత్రులు నారాయణ, టీజీ భరత్ పాల్గొన్నారు.

### బీటెక్ బయో టెక్నాలజీలో మరిన్ని సీట్లకు అనుమతి

హైదరాబాద్-నవభూమి: బీటెక్‌లో బయో టెక్నాలజీ కోర్సులో మరిన్ని సీట్లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ కోర్సులో రాష్ట్రవ్యాప్తంగా 330 సీట్లే ఉన్నాయి. ఇందులో 273 సీట్లను కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. సీట్ల సంఖ్య పెంచాలని ఇప్పటికే చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటెక్‌లో బయో టెక్నాలజీ సీట్లు ఎక్కువగా ఉన్నాయని, బీటెక్‌లో మాత్రం తక్కువగా ఉన్నాయని తెలిపారు.


నవభూమి

www.navabhoomi.in

www.epaper.navabhoomi.in

3 | హైదరాబాద్ | మంగళవారం | 29 । జులై । 2025


# ఉత్తరప్రదేశ్ లాంగెస్ట్ సీఎంగా యోగీ ఆదిత్యనాథ్‌కు గుర్తింపు





**ముంబై- నవభూమి:**ఉత్తరప్రదేశ్ కు వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా యోగీ ఆదిత్యనాథ్ గుర్తింపు పొందారు. యూపీకి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఇప్పటివరకు మాజీ సీఎం గోవింద్ వల్లభ్ పంత్ ఉన్నారు. : ఉత్తరప్రదేశ్ కు వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా యోగీ ఆదిత్యనాథ్ గుర్తింపు పొందారు. యూపీకి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఇప్పటివరకు మాజీ సీఎం గోవింద్ వల్లభ్ పంత్ ఉన్నారు. ఇప్పుడు ఆయన రికార్డును యోగీ ఆదిత్యనాథ్ బద్దలుకొట్టారు.గోవింద్ వల్లభ్ పంత్ వరుసగా 8 సంవత్సరాల 127 రోజులు ముఖ్యమంత్రిగా కొనసాగి, రాష్ట్రానికి వరుసగా అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. సోమవారంతో కలిపి యోగీ ఆదిత్యనాథ్ వరుసగా 8 సంవత్సరాల 4 నెలల 10 రోజులు యూపీ సీఎంగా కొనసాగారు. దాంతో గోవింద్ వల్లభ్ పంత్ రికార్డు బద్దలైంది. ఈ విషయాన్ని యూపీ సీఎంవో వెల్లడించింది.

## పది వేలు అప్పుగా ఇవ్వనందుకు.. వ్యక్తిని హత్య చేసిన సహోద్యోగి




**న్యూఢిల్లీ-నవభూమి:** పది వేలు అప్పుగా ఇవ్వనందుకు ఒక వ్యక్తిని సహోద్యోగి హత్య చేశాడు. ఫామ్‌హౌస్‌లోని ట్యాంకులో మృతదేహాన్ని పడేశాడు. ఆ వ్యక్తి మిస్సింగ్‌పై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరకు నిందితుడైన సహోద్యోగిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 42 ఏళ్ల సీతా రామ్ గత పదేళ్లుగా ఢిల్లీలోని ఛత్తర్‌పూర్‌లో ఉన్న ప్రైవేట్ ఫామ్‌హౌస్‌లో పని చేస్తున్నాడు. అతడు ఒంటరిగా అక్కడ నివసిస్తున్నాడు.

కాగా, 47 ఏళ్ల చంద్ర ప్రకాష్ అదే ఫామ్‌హౌస్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సీతా రామ్‌ను అతడు పది వేలు అప్పు అడిగాడు. ఇవ్వకపోవడంతో వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో చంద్ర ప్రకాష్ ఆగ్రహించాడు. బండరాయితో మోది సీతా రామ్‌ను హత్య చేశాడు. ఆ ఫామ్‌హౌస్‌లోని ట్యాంకులో మృతదేహాన్ని పడేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు.మరోవైపు జూలై 26న ఫామ్‌హౌస్ మెయిన్ గేట్ తెరిచి ఉండటాన్ని మిగతా పనివాళ్లు గమనించారు. సీతా రామ్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫామ్‌హౌస్‌లోని ట్యాంకులో అతడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి మొబైల్ ఫోన్ డాటా, సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు.అయితే, చంద్ర ప్రకాష్ కూడా కనిపించకపోవడంతో అతడిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పాలం ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతడ్ని ప్రశ్నించగా పది వేలు అప్పు ఇవ్వనందుకు జరిగిన ఘర్షణలో సీతా రామ్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బీహార్‌లో కుక్కకు నివాస ధృవీకరణ పత్రం.. బీజేపీకి అది ఓటు వేస్తుందని విపక్షాల విమర్శ




**పాట్నా-నవభూమి:**త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణపై వివాదం నెలకొన్నది. రాష్ట్ర గుర్తింపు రిజిస్ట్రీ (ఎస్ఐఆర్)లో పౌరుల రికార్డుల అప్‌డేట్ కసరత్తు జరుగుతున్నది. ఈ తరుణంలో ఒక కుక్కకు నివాస ధృవీకరణ పత్రం జారీ అయ్యింది. దీంతో ఆ కుక్క బీజేపీకి ఓటు వేస్తుందని విపక్షాలు విమర్శించాయి. రాజధాని పాట్నా సమీపంలోని మసౌర్హి పట్టణంలోని ప్రజా సేవల హక్కు (ఆర్టీపీఎస్) పోర్టల్‌లో 'డాగ్ బాబు' పేరుతో రెసిడెంట్ సర్టిఫికెట్‌ను అధికారులు జారీ చేశారు. ఇందులో తండ్రి పేరు 'కుట్ట బాబు' అని, తల్లి పేరు 'కుట్టియా దేవి' అని ఉన్నది. కౌలిచాక్, వార్డ్ నంబర్ 15, నగర్ పరిషత్ మసౌర్హిని చిరునామాగా పేర్కొన్నారు. దరఖాస్తుదారుడి ఫొటో స్థానంలో కుక్క బొమ్మ ఉన్నది. రెవెన్యూ అధికారి మురారి చౌహాన్ డిజిటల్ సంతకంతో జూలై 24న ఈ నివాస ధృవీకరణ పత్రం జారీ అయ్యింది.కాగా, 'కుక్క బాబు'కు జారీ చేసిన ఈ రెసిడెంట్ సర్టిఫికెట్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆ కుక్క ప్రత్యక్షమై బీజేపీకి ఓటు వేస్తుందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. 'బహుశా వారు 'డాగ్ బాబు'ను అభ్యర్థిగా కూడా చేస్తారేమో. బీజేపీ కార్యకర్తలందరూ ఆయనకు ఓటు వేస్తారు. ఇది ఎన్నికల వ్యవస్థను బీజేపీ నగ్నంగా తారుమారు చేయడం,ద్వారా క్రిమినల్ సిండికేట్‌గా పనిచేస్తున్న నేరస్థుల పని ఇది. కోర్టులు పక్కదారి పట్టాయి. ప్రజాస్వామ్య మారణహోమాన్ని నిశ్శబ్దంతో ఆశీర్వదిస్తున్నాయి' మండిపడింది.ఆధార్, రేషన్ కార్డులు నకిలీవి అని పిలుస్తున్నప్పుడు, ఓట్ల సవరణ కోసం పరిగణించే సర్టిఫికేట్ ఇదేనని స్వరాజ్ ఇండియా సభ్యుడు యోగేంద్ర యాదవ్ ఎద్దేవా చేశారు. మరోవైపు అధికారులు దీనిపై స్పందించారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే ఆ సర్టిఫికెట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. దరఖాసుదారుడు, కంప్యూటర్ ఆపరేటర్, సర్టిఫికేట్ జారీ చేసిన అధికారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరుపుతామని, దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

## భక్తులకు గుడ్‌న్యూస్.. తిరుపతి-షిర్డీ మధ్య 18 స్పెషల్ రైళ్లు

**షిర్డీ -నవభూమి:**భక్తులకు ఐఆర్‌సీటీసీ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, షిర్డీ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడిపించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ రెండు సిటీల మధ్య 18 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 3వ తేదీ నుంచి సెప్టెంబర్ 29 వరకు ఈ రైల్వే సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ప్రతి ఆదివారం ఉదయం 4 గంటలకు తిరుపతి నుంచి తిరుపతి-సాయినగర్ షిర్డీ రైలు (07637) బయల్దేరి, మరుసటి రోజు ఉదయం10.45 గంటలకు షిర్డీ చేరుకోనుంది. ప్రతి సోమవారం రాత్రి 7.35 గంటలకు షిర్డీ-తిరుపతి రైలు (07638) బయల్దేరి, మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటలకు తిరుపతి చేరుకోనుంది. ఆగస్టు 3వ తేదీ నుంచి సెప్టెంబర్ 29 వరకు ప్రతి వారం ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి.రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, బాల్కి, ఉద్గిర్, లాతూర్ రోడ్డు, పర్లి, గంగఖేర్, పర్భని, సేలు, జాల్నా, ఔరంగాబాద్, నాగర్‌సోల్, మన్‌మడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో ఆగనుంది.

## మోదీ మన్ కీ బాత్ ప్రసారం సందర్భంగా.. బీజేపీ, మిత్రపక్షం పార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణ

**అగర్తలా-నవభూమి:** ప్రధాని మోదీ మన్ కీ బాత్ ప్రసారం సందర్భంగా బీజేపీ, మిత్రపక్షం పార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పలు బైకులు, కార్లు ధ్వంసమయ్యాయి. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని నియంత్రించారు. బీజేపీ పాలిత త్రిపురలోని ఖోవాయి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెలవారీ రేడియో ప్రసారం మన్ కీ బాత్ వినేందుకు ఆశారాంబరి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక ఇంట్లో సుమారు 30 మంది బీజేపీ కార్యకర్తలు సమావేశమయ్యారు.కాగా, త్రిపురలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతిచ్చిన మిత్రపక్షం తిప్రా మోథా పార్టీ (టీఎంపీ) కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఎనిమిది బైకులు, రెండు కార్లు దెబ్బతిన్నాయి.

## అసలైన అమ్మ ప్రేమ..: విమాన ప్రమాదంలో కాలిపోయిన పసికందును తన చర్మంతో బతికించిన తల్లి!



**న్యూఢిల్లీ-నవభూమి:** అహ్మదాబాద్‌లో జూన్ 12వ తేదీన జరిగిన ఏఐ-171 విమాన ప్రమాదం అనేక మంది జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఈ భయానక ఘటనలో ప్రాణాలతో బయటపడిన వారిలో 30 ఏళ్ల మనీషా, ఆమె ఎనిమిది నెలల కుమారుడు ధ్యాంష్‌లు కూడా ఉన్నారు. అయితే ప్రస్తుతం వీరి కథ దేశ ప్రజలందరి చేత కన్నీళ్లు పెట్టిస్తోంది. ముఖ్యంగా ఈ దుర్ఘటనలో ధ్యాంష్ శరీరం 36 శాతానికి పైగా కాలిపోయింది. అయితే తల్లి మనీషాకు 25 శాతం గాయాలు అయ్యాయి. అయినా అవేమీ పట్టించుకోని ఆమె.. తన ప్రాణాలకు తెగించి అగ్నికీలల నుంచి బిడ్డను కాపాడుకోవాలనే ఆరాటంతో మంటల్లోంచి బయటకు పరుగులు తీసింది. ఆ నిస్వార్థ ప్రేమకు నిదర్శనంగానే బాబు రెండు సార్లు ప్రాణాలతో బయట పడి.. తల్లి ఒడిలో హాయిగా ఆడుకుంటున్నాడు.బీజే మెడికల్ కాలేజ్ హాస్టల్ పక్కనే ఉన్న ఇంట్లో మనీషా కుటుంబం నివసిస్తోంది. అయితే ప్రమాద సమయంలో కుమారుడు ధ్యాంష్‌తో పాటే ఆమె కూడా ఇంట్లోనే ఉంది. అయితే విమానం కుప్పకూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో చుట్టు పక్కల ఇళ్లన్నీ పొగతో నిండిపోయాయి. అయినా సరే మనీషా ఏమాత్రం భయపడలేదు. తన ఒళ్లంతా కాలిపోతున్నా పట్టించుకోకుండా తన బాబు ఎక్కడున్నాడో వెతికింది. అతడు కళ్లకు కనిపించిన వెంటనే తన చేతుల్లోకి తీసుకుని బయటకు పరుగు పెట్టడం ప్రారంభించింది. అప్పటికే బిడ్డకు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి.

అయినా అవేమీ పట్టించుకోకుండా తన బిడ్డను కాపాడాలన్న ధైర్యంతో మనీషా మంటల్లోంచి బయటకు వచ్చింది. విషయం గుర్తించిన రెస్క్యూ సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు 25 శాతం ఆమె శరీరం కాలిందని, అలాగే బాబుకు 36 శాతం గాయాలు అయ్యాయని చెప్పారు. వెంటనే ఇద్దరినీ వేర్వేరు ఐసీయుల్లోకి తరలించి చికిత్స ఇవ్వడం ప్రారంభించారు. ఈక్రమంలోనే బాబు చర్మం మొత్తం కాలిపోగా.. అతడికి ఇతరుల చర్మం పెట్టాల్సిన అవసరం ఏర్పడిందని వైద్యులు చెప్పారు. ఈ చికిత్స చేయకపోతే బిడ్డ ప్రాణానికే ప్రమాదం అన్నారు. ఈ విషయం తెలుసుకున్న మనీషా వెంటనే తన చర్మాన్నే బాబుకు పెట్టమని చెప్పింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులు సైతం మనీషా చర్మాన్ని తీసుకుని బాబుకు అంటుకట్టు విధానం ద్వారా అతికించారు.ఇలా దాదాపు ఐదు వారాలుగా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్న వీరిద్దరూ ఎట్టకేలకు విడుదల అయ్యారు. విడుదల అయిన తర్వాతే మనీషా మీడియాతో మాట్లాడుతూ.. తన బిడ్డను ఎలా కాపాడుకోగల్గిందో చెప్పింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్త ప్రతీ ఒక్కరి హృదయాలను తాకుతోంది. ఓ యుద్ధంలో పోరాడిన సైనికురాలిలా ప్రాణాలకు తెగించి మరీ ఆమె తన కుమారుడిని కాపాడుకోవడం చూసిన ప్రతీ ఒక్కరూ ఆమెను ప్రశంసిస్తున్నారు. పెద్ద ఎత్తున

## బీఎస్ఎఫ్ జవాన్ల కోసం 5 వేల బాడీ కెమెరాలు..
# ఇక బంగ్లాదేశ్‌కు చుక్కలే!



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత సరిహద్దుల భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా.. భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఒక కీలకమైన ముందడుగు వేసింది. దేశంలోని అత్యంత సున్నితమైన భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సైనికులకు 5,000కు పైగా అత్యాధునిక బాడీ-వోర్న్ కెమెరాలు, బయోమెట్రిక్ డేటాను సేకరించే పరికరాలను అందజేసింది. ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానం సరిహద్దుల్లో అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడంలో, మరింత పారదర్శకతతో కూడిన నిఘాను నిర్వహించడంలో బీఎస్ఎఫ్‌కు గణనీయంగా తోడ్పడుతుంది.ఈ బాడీ కెమెరాల ప్రధాన ఉద్దేశ్యం సరిహద్దుల్లో జరిగే ప్రతి సంఘటనను వీడియో రూపంలో రికార్డు చేయడం. ఈమధ్య కాలంలో బంగ్లాదేశీయుల దేశంలోకి అక్రమంగా చొరబడుతున్నారు. అంతేకాకుండా భారత సైన్యంపైనే దాడులు చేస్తున్నారు. వీటిని అందరి కళ్లకు కట్టినట్లు చూపించాలనే ఉద్దేశంతోనే బీఎస్ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా చొరబాటును గుర్తించినప్పుడు.. వారిని వెనక్కి పంపే ప్రక్రియకు సంబంధించి దృశ్య ఆధారాలను సేకరించడంలో ఇవి కీలక పాత్ర పోషించబోతున్నాయి. అంతేకాకుండా అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా వంటి సరిహద్దు నేరాలకు సంబంధించిన సాక్ష్యాలను నమోదు చేయడంలో, నేరగాళ్లు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన సందర్భాలను డాక్యుమెంట్ చేయడంలో ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడనున్నాయి.

అయితే ఈ బాడీ కెమెరాలు.. రాత్రిపూట కూడా స్పష్టంగా రికార్డు చేసే నైట్-విజన్ సామర్థ్యాన్ని కల్గి ఉన్నాయి. అంతేకాకుండా 12 నుండి 14 గంటల పాటు నిరంతరంగా వీడియోలను రికార్డు చేసే బ్యాటరీ సామర్థ్యం కూడా ఉన్నట్లు అధికారులు వివరిస్తున్నారు. బీఎస్ఎఫ్ అతిగా బలప్రయోగం చేసిందన్న ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని ఎదుర్కోవడానికి కూడా ఈ వీడియో ఆధారాలు ఉపయోగ పడనున్నాయి. బాడీ కెమెరాలతో పాటు బయోమెట్రిక్ డేటాను సేకరించే పరికరాలను కూడా కొన్ని సరిహద్దు పోస్టులలో ఏర్పాటు చేశారు. ఈ పరికరాలు అక్రమంగా సరిహద్దు దాటి వస్తున్న బంగ్లాదేశీయుల వేలి ముద్రలు, ఐరిస్ స్కాన్‌లను నమోదు చేస్తాయి. ఈ డేటాను ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ తో పంచుకోవడం ద్వారా.. ఒక బలమైన ఆధారిత డేటాబేస్ రూపొందించబడుతుంది. ఇది అక్రమ వలసదారులను గుర్తించడంలో, వారిపై తదుపరి చర్యలు తీసుకోవడంలో సహాయ పడుతుంది.

దేవభూమిలో మృత్యుఘోష

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తరువాత (ఆగస్టు 2024) సరిహద్దు భద్రతపై జరిపిన సమగ్ర సమీక్ష అనంతరం ఈ విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కూడా తమ అధికార పరిధిలోని అక్రమ బంగ్లాదేశీయులను గుర్తించి, వారిని వెనక్కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బీఎస్ఎఫ్ సరిహద్దులను మరింత సమర్థవంతంగా కాపాడుకోగలదని, అక్రమ చొరబాట్లను సమర్థంగా నిరోధించగలదని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## క్రిప్టో అలర్ట్: ఐటీ రిటర్న్స్ ఫైల్ చేస్తున్నారా? పన్నుల వివరాలివే..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుతం భారతదేశంలో ఆదాయపు పన్ను శాఖ క్రిప్టో పెట్టుబడులు, ట్రేడింగ్ మీద దృష్టి పెట్టింది. అనుమతించబడిన పెట్టుబడి సాధనంగా క్రిప్టో అసెట్ క్లాస్ మారటంతో పెట్టుబడి దారులు దీనిపై ట్యాక్స్ రూల్స్ తెలుసుకోవాల్సిఉంది. 2022లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తొలిసారిగా 'వర్చువల్ డిజిటల్ అసెట్స్ అనే క్లాస్' అనే మాట ఉదహరించారు. అంతేకాదు, ఆదాయపు పన్ను చట్టంలో సెక్షన్ 115 బీబీహెచ్ కింద వీటిని చేర్చారు.

దీంతో, క్రిప్టో పెట్టుబడుల నుండి వచ్చే లాభాలు ఆదాయపు పన్ను రిటర్న్స్ లో చూపించాలి. భారత ప్రభుత్వం క్రిప్టో కరెన్సీ లావాదేవీలను వర్చువల్ డిజిటల్ ఆస్తుల గా వర్గీకరిస్తుంది. దీనిపై 2022 నుండి స్పష్టమైన పన్ను నిబంధనలు అమలులో ఉన్నాయి. క్రిప్టోకరెన్సీ లావాదేవీల నుండి వచ్చే లాభాలు క్యాపిటల్ గెయిన్స్ లేదా ఇతర ఆదాయ వనరులు కింద పరిగణిస్తున్నారు. ఇవి, స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్ (36 నెలల కంటే తక్కువ కాలంలో వచ్చిన లాభాలు), దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ (36 నెలల కంటే ఎక్కువ కాలంలో వచ్చిన లాభాలు)గా పరిగణిస్తారు. ఇందులో మొదటి దానికి వ్యక్తిగత ఆదాయ స్లాబ్ రేట్ల ప్రకారం పన్ను విధిస్తారు. రెండవ కోవలోకి వచ్చిన వాటికి 20% రేటుతో ఇండెక్సేషన్ ప్రయోజనంతో పన్ను విధిస్తున్నారు.క్రిప్టో లాభాలపై అత్యధికంగా 30 శాతం ఫ్లాట్ రేటు పన్నుతో పాటు దానిపై 4 శాతం సెస్, సర్ చార్జ్ కూడా విధిస్తారు. అయితే క్రిప్టో పెట్టుబడి నష్టాలను ఆఫ్ సెట్ చేసుకునేందుకు భారత ప్రభుత్వం ఎలాంటి అవకాశం కల్పించలేదు. చట్ట ప్రకారం రూ.10వేలకు మించిన క్రిప్టో ట్రాన్సాక్షన్లపై 1 శాతం టీడీఎస్ ను జూలై 1, 2022 నుంచి అమలులోకి తీసుకొచ్చారు. క్రిప్టో కాయిన్లను వస్తుసేవల చెల్లింపులకు వినియోగించినా ఇవే పన్నులు వర్తిస్తాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి షెడ్యూల్ చేయబడిన క్రిప్టో ఆస్తులను కూడా ఆదాయపు పన్నులో ఫైల్ చేయాల్సి ఉంటుందని ఇన్ కం టాక్స్ డిపార్ట్మెంట్ వెల్లడించింది. ఈ క్రమంలో క్రిప్టో పన్ను నిబంధనలు సంక్లిష్టంగా ఉంటాయి. కావున టాక్స్ ప్రొఫెషనల్ లేదా చార్టర్డ్ అకౌంటెంట్‌తో సంప్రదించి, మీ లావాదేవీల ఆధారంగా సరైన ఐటీఆర్ ఫైలింగ్ చేయడం బెటర్.

## మహిళల స్కీమ్ లబ్దిదారులుగా పురుషులు... మగాళ్లకు మంచిరోజులొచ్చాయి!




**న్యూఢిల్లీ-నవభూమి:**మహిళల ఆర్థిక స్వావలంబన కోసం తీసుకొచ్చిన పథకంలో లొసుగులను కొందరు అక్రమార్కులు ఆసరాగా తీసుకుని మోసాలకు తెరతీశారు. ఒకటి రెండు కాదు ఏకంగా రూ.1,640 కోట్లు కాజేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం లాడ్లీ బెహన్ యోజన పథకం ప్రారంభించింది. ఈ పథకం కింద 14,298 మంది పురుషులు మోసపూరితగా పేర్లు నమోదు చేసుకొని రూ.21.44 కోట్లు కాజేసినట్టు ప్రభుత్వం నిర్వహించిన ఆడిట్‌లో వెల్లడయ్యింది. గతేడాది మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి సర్కారు ఈ పథకాన్ని ప్రారంభించింది. వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల లోపల ఉన్న కుటుంబాలకు చెందిన 21 నుంచి 65 ఏళ్ల మహిళలకు నెలకు 1,500 చొప్పున ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో పథకం తీసుకొచ్చింది.నిందితులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని మహిళలుగా పేరు నమోదు చేసుకున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ పథకం ప్రారంభమైన 10 నెలల తరువాత మోసం బయటపడటం గమనార్హం. "నిరుపేద కుటుంబాల మహిళలకు ఆర్థిక సాయం చేయాలనే ఉద్దేశంతో లాడ్లీ బెహన్ యోజన పథకాన్ని ప్రారంభించాం.. పురుషులకు ఈ పథకంతో లబ్ది పొందకూడదు ఈ మొత్తాన్ని తిరిగి వారి నుంచి వసూలు చేస్తాం..అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ అన్నారు.కుటుంబంలో ఇద్దరు మహిళలకు మాత్రమే ఈ పథకం పరిమితం కానీ, ఇద్దరకు మించి 7.97 లక్షల మంది, 65 ఏళ్ల దాటిన 2.87 లక్షల మంది మోసపూరితంగా పేరు నమోదుచేసుకుని లబ్ది పొందడం గమనార్హం. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ. 1,640 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇక, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహిళలకు నెలకు రూ.2 వేల చొప్పున మహిళలకు ఆర్థిక సాయం అందజేస్తోంది.కాగా, దీనిపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. మహిళల పథకంలో పురుషులు ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని శరద్ పవార్ కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే ప్రశ్నించారు. "ఎలా నమోదు చేసుకున్నారు? వారికి సహాయం చేసిన వాళ్లెవరు? రిజిస్ట్రేషన్లకు కాంట్రాక్ట్ ఇచ్చిన కంపెనీపై దర్యాప్తు చేపట్టాలి.. ఇది పెద్ద కుట్ర. ఈ వ్యవహారాన్ని సిట్ లేదా ఈడీతో దర్యాప్తు చేయాలి" అని ఆమె డిమాండ్ చేశారు. అయితే, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గతేడాది డిసెంబరులో ఈ పథకంపై సమగ్ర సమీక్షకు ఆదేశించారు. దీంతో అధికారులు మొత్తం 5 లక్షల మంది అనర్హులను ఫిబ్రవరి 2025లో గుర్తించి, వారిని తొలగించారు. అలాగే, గత జూన్ నుంచి 26.34 లక్షల మంది అనర్హుల ఖాతాలకు నిధులను తాత్కాలికంగా నిలిపివేశారు.

## సాంకేతిక లోపంతో తగ్గిన ఆక్సిజన్ సరఫరా.. ముగ్గురు రోగులు మృతి



**చండీగఢ్-నవభూమి:** సాంకేతిక లోపం వల్ల కొంతసేపు ఆక్సిజన్ సరఫరా తగ్గింది. దీంతో ఐసీయూలో ఉన్న ముగ్గురు రోగులు మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో జలంధర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా మార్చేటప్పుడు సాంకేతిక లోపం తలెత్తింది. ఆక్సిజన్ ప్రెజర్ పడిపోవడంతో సరఫరా తగ్గింది. దీంతో ఐసీయూలోని వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులు మరణించారు. ఈ నేపథ్యంలో ఆ హాస్పిటల్‌లో భయాందోళన వాతావరణం ఏర్పడి గందరగోళానికి దారి తీసింది.కాగా, సాంకేతిక సమస్య వల్ల ఆక్సిజన్ సరఫరా కొద్దిగా తగ్గిందని చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. వెంటనే బ్యాకప్ ఆక్సిజన్ సిలిండర్లను ప్రారంభించడంతోపాటు సాంకేతిక లోపాన్ని కూడా సరిదిద్దినట్లు చెప్పారు. ఇదంతా కేవలం ఐదు నుంచి పది నిమిషాల్లోనే జరిగిందని అన్నారు. మరణించిన ముగ్గురు రోగుల పరిస్థితి ముందు నుంచే విషమంగా ఉన్నదని తెలిపారు. వేర్వేరు కారణాల వల్ల వారు చనిపోయినట్లు వివరించారు.మరోవైపు ఈ సంఘటన నేపథ్యంలో పంజాబ్ ఆరోగ్య మంత్రి బల్బీర్ సింగ్ ఆ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. సాంకేతిక లోపం వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గిన అంశంపై కమిటీతో దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## వీధికుక్కలతో రేబిస్ వ్యాధి.. పత్రిక కథనాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశరాజధాని ఢిల్లీలో రేబిస్ వ్యాధి కేసులు ఎక్కువవుతున్నాయి. వీధికుక్కలు కరవడం వల్ల పిల్లలు, వృద్ధుల్లో ఈ వైరస్ సోకుతోంది. కుక్క కాటు వల్ల ప్రాణాంతక పరిస్థితులు ఎదురవుతున్నాయి. తాజాగా టైమ్స్ ఆఫ్ ఇండియా ఆంగ్ల దినపత్రికకు చెందిన ఢిల్లీ ఎడిషన్‌లో వీధికుక్కల గురించి ఓ కథనాన్ని ప్రచురించారు. ఆ కథనం ఆధారంగా ఇవాళ సుప్రీంకోర్టు సుమోటో కేసును స్వీకరించింది.జస్టిస్ జేబీ పర్దివాలా, ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆ పత్రిక కథనం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. వీధి కుక్కలు కరవడం వల్ల ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందిపడుతున్నారని, వాళ్లకు రేబిస్ వ్యాధి సోకుతున్నట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. ఆ కథనం చాలా డిస్టర్బింగ్‌గా ఉందని, ఆ కథనంలో ఉన్న వివరాలు చాలా ఆందోళన కలిగిస్తున్నట్లు కోర్టు తెలిపింది.నగరంలో వందల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నాయని, వీటి వల్ల రేబిస్ ఇన్‌ఫెక్షన్ అవుతున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల చిన్నారులు, సీనియర్ సిటిజన్లు ఆ వ్యాధికి బలి అవుతున్నారని కోర్టు చెప్పింది. సుమోటోగా స్వీకరించిన ఈ అంశాన్ని.. సీజేఐ బీఆర్ గవాయ్ ముందు ఉంచనున్నట్లు ధర్మాసనం తెలిపింది.

## పార్లమెంట్‌లో కొనసాగుతున్న వాయిదాల పర్వం..

### లోక్‌సభ ఒంటిగంట వరకు, రాజ్యసభ 2 గంటల వరకు వాయిదా



**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. వర్షాకాల సమావేశాలు ప్రారంభమై ఆరు రోజులు అవుతున్నా ఎలాంటి చర్చలు లేకుండానే లోక్‌సభ రాజ్యసభ వాయిదాలు పడుతూ వస్తున్నాయి. ఇవాళ (సోమవారం) లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్ పై చర్చ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయినా ప్రతిపక్ష సభ్యులు ఆందోళన కొనసాగిస్తున్నారు.దాంతో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పార్లమెంట్ ఉభయ సభలు ముందుగా మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదాపడ్డాయి. సభలు తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా సేమ్ సీన్ రిపీట్ కావడంతో లోక్‌సభను మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రాజ్యసభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. వాయిదాకు ముందు విపక్ష సభ్యుల తీరుపై స్పీకర్ ఓంబిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు ఒప్పుకుని, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

## సెల్ఫీ పిచ్చి.. నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన కుటుంబం



**న్యూఢిల్లీ-నవభూమి:**సెల్ఫీ పిచ్చి ఓ కుటుంబాన్ని ప్రమాదంలోకి నెట్టింది. సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయింది. అప్రమత్తమైన స్థానికులు, మత్స్యకారులు వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. జారండ్ లోని ధన్‌బాద్ సమీపంలో గల ప్రసిద్ధ భటిండా జలపాతం వద్ద నిన్న జరిగిందీ ఘటన.

వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం భటిండా జలపాతం సందర్శనకు వెళ్లింది. అక్కడ జలపాతం వద్ద సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ మహిళ ప్రమాదవశాత్తూ జారి నీటిలో పడిపోయింది. అప్రమత్తమైన భర్త, పిల్లలు ఆమెను రక్షించేందుకు వెంటనే నీటిలోకి దూకేశారు. జలపాతం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నలుగురూ మునిగిపోయి కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న జాలర్లు వారిని గమనించి నీటిలోకి దూకి వారిని రక్షించడంతో ఆ ఫ్యామిలీ ప్రాణాలతో బయటపడింది. వారంతా ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

## మాకు అంతా ఇక మంచే... మాతోశ్రీకి రాజ్ రాకపై ఉద్ధవ్



**ముంబై-నవభూమి:** మాతోశ్రీనివాసానికి తన సోదరుడు రాజ్ ఠాక్రే వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడం చాలా ఆనందంగా ఉందని శివసేన సుప్రీం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. తమ సోదరులిద్దరికీ భవిష్యత్తు బాగుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్ధవ్ 65వ పుట్టినరోజు సందర్భంగా ఆయన నివాసమైన మాతోశ్రీకి రాజ్ ఠాక్రే ఆదివారంనాడు వచ్చారు. ఆరేళ్ల తర్వాత మాతోశ్రీకి రాజ్ ఠాక్రే రావడం ఇదే మొదటిసారి. సోదరుల ఇద్దరూ ఎంతో ఆత్మీయంగా పలకరించుకుంటూ పండుగ వాతావరణాన్ని తలపించారు.
అనంతరం మీడియాతో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, చాలాకాలం తర్వాత తాము కలుకున్నామని, ఇద్దరూ ఎక్కడైతే పెరిగి పెద్దవాళ్లమయ్యామో అక్కడ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఇక మంచి భవిష్యత్తు ఉంటుందని తాము అశిస్తున్నట్టు పేర్కొన్నారు.
ఉద్ధవ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం సోదరులిద్దరూ దివంగత బాల్‌ఠాక్రే చిత్తరువు బ్యాక్‌గ్రౌండ్‌లో ఫోటోలు దిగారు. ఆ ఫోటను రాజ్ ఆ తర్వాత సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'నా పెద్ద సోదరుడు, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు బాల్ ఠాక్రే నివాసమైన మాతోశ్రీకి వెళ్లాను' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్ట సవరణ ప్రతిపాదనలో భాగంగా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆర్డినెన్స్ ప్రవేశపెట్టిన అంశం రాజకీయ, న్యాయపరంగా అనేక సంక్లిష్టతలను కలిగించింది. మొదటిది, ఈ ప్రతిపాదన ఆచరణ సాధ్యమా? రెండవది, గత అనుభవాల కీళ్ళను మనం మర్చిపోతున్నామా? మూడవది, బీసీల హక్కుల సాధన ఓటు రాజకీయాల బలిదానంగా మారిపోతుందా? ఈ ప్రతిపాదన చట్టబద్ధతను విశ్లేషించడానికి ముందుగా 2018లో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలి. అప్పట్లో జీవో నెం.396 ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించగా, హైకోర్టు ఈ జీవోను రద్దు చేసింది. కారణం, 2010లో సుప్రీంకోర్టు ఇచ్చిన కృష్ణమూర్తి తీర్పు. ఈ తీర్పులో 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌ను స్పష్టంగా పేర్కొంది. ఈ పరిమితిని ఉల్లంఘించడమైతే రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. అదే తీర్పును ధ్రువీకరిస్తూ బిహార్‌లోనూ కుల గణన ఆధారంగా రిజర్వేషన్ పెంచిన గవర్నమెంట్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు చేసిన ప్రతిపాదనలో '285ఎ' సెక్షన్‌ను తొలగించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తాత్కాలిక జీవోలను ఆధారంగా చేసుకోవడంలో సమస్యలెన్నో ఉన్నాయి. తాత్కాలిక జీవోలకు శాశ్వత చట్టబద్ధత లేనంత మాత్రాన, వాటి అమలులో కోర్టులు జోక్యం చేసుకోకుండా ఎన్నికలు జరిగిపోయే పరిస్థితిని సృష్టించాలన్న ఆశయంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. అయితే ఇది అత్యంత ప్రమాదకరం. ఎందుకంటే ఒకసారి కోర్టుల్లో ఈ జీవోలు నిలవలేవు అన్న నమ్మకం వున్నప్పుడు, వాటిని న్యాయబద్ధ మార్గంలో స్థిరపరచని ప్రయత్నం చేయడం అనైతికం. ఈ వ్యవహారంలో మరో కీలకమైన అంశం %-% రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్. బీసీలకు రిజర్వేషన్లను శాశ్వతంగా చట్టబద్ధంగా అమలుచేయాలంటే, సంబంధిత చట్టాలను 9వ షెడ్యూల్లో చేర్చాల్సిన అవసరం ఉంది. తమిళనాడు ప్రభుత్వ మాదిరిగానే, తెలంగాణ ప్రభుత్వం కూడా విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఒక బిల్లుగా తయారుచేసి, కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో రాజ్యాంగ 9వ షెడ్యూల్లో చేర్చాలి. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు చట్టంగా నిలవడానికి ఇదే మార్గం ఉపయోగపడింది. కేవలం జీవోలు, ఆర్డినెన్సులు కాకుండా, పార్లమెంటులో చర్చ, రాష్ట్రపతి ఆమోదం ద్వారా చట్టబద్ధత సాధించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. రాజ్యాంగ ఆర్టికల్స్ 243డి(6), 243టి(6) ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవచ్చు అని మాత్రమే ఉంది. కానీ ఈ "మాత్రమే" అనే పదం పైనే చాలా వివాదాలుంటాయి. రాష్ట్రాలు అధికారికంగా కమిషన్ ఏర్పాటు చేసి, బీసీల వెనుకబాటుతనంపై విశ్లేషణాత్మక అధ్యయనం చేసి, తగిన డేటా సమర్పించి రిజర్వేషన్లను చట్టబద్ధంగా తీసుకురావాలి. ఇక్కడే తెలంగాణ ప్రభుత్వం నిబంధనలకు పూర్తి స్థాయిలో లోబడి వ్యవహరించలేకపోతున్నది. కమిషన్ నివేదికలు సిద్ధంగా ఉన్నాయన్న వాదన ఉండవచ్చు, కానీ వాటిని పార్లమెంటు స్థాయిలో చర్చించి చట్టంగా రూపొందించాల్సిన పని ఇంకా మిగిలే ఉన్నది. ఇంకొక ముఖ్యమైన అంశం, కోర్టుల జోక్యం. మహారాష్ట్రలో 2018, 2020లో జరిగిన ఎన్నికలను సుప్రీంకోర్టు 2021లో "వికాస్ కిషన్‌రావు గవాలి కేసు" ద్వారా రద్దు చేసింది. ప్రధాన కారణం %-% డెడికేటెడ్ కమిషన్ నివేదిక లేకపోవడం. అంతేకాదు, మునుపటి రిజర్వేషన్ సరిగా సమర్థించబడలేదని కోర్టు అభిప్రాయపడింది. ఈ దృష్టిలో చూస్తే, తెలంగాణలో బీసీ రిజర్వేషన్‌పై జీవో ఆధారంగా ఎలక్షన్ నోటిఫికేషన్‌కు వెళ్లడమూ అదే ప్రమాదాన్ని మళ్లీ పునరావృతం చేస్తుంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రెండు బిల్లులను కేంద్రానికి పంపింది %-% విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్ల కోసం ఒకటి, స్థానిక సంస్థల రిజర్వేషన్ల కోసం మరొకటి. అయితే ఇవి కేవలం పంపించడం ద్వారా పరిష్కారం కాదు. కేంద్రాన్ని ఒప్పించి పార్లమెంటులో చర్చ జరిపించి, ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో 9వ షెడ్యూల్లో చేర్పించాలనే బాధ్యతను ముఖ్యమంత్రి కలిగి ఉండాలి. అలాంటి శాశ్వత చర్యల వల్లే బీసీలకు న్యాయబద్ధమైన హక్కులు సిద్ధిస్తాయి. ఇక్కడ రాజకీయ ప్రకటనలు, ఆర్భాటాల కన్నా కీలకం %-% చట్టపరమైన విధానంలో బీసీల హక్కులను రక్షించడమే. ఎన్నికల సమయంలో జీవో జారీ చేసి బీసీల ఓటు బ్యాంకును ఆకర్షించాలన్న రాజకీయ ప్రయత్నాలు గతంలో ఎన్నో సార్లు విఫలమయ్యాయి. 2018 నుండి 2020 వరకూ మున్సిపల్, పంచాయతీ ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన జీవోలు చివరికి కోర్టులో నిలవకపోవడం అందుకు ఉదాహరణలు. అయితే అయినా కూడా ప్రభుత్వం మళ్లీ అదే మార్గాన్ని అనుసరించడం ఆచితూచి లేని నిర్ణయం. ఒకవేళ జీవో ఆధారంగా ఎన్నికలు జరిగినా, కోర్టుల సమీక్షకు లోనవవచ్చు. దానివల్ల ఎన్నికల చెల్లుబాటు, రిజర్వేషన్‌ల చట్టబద్ధత, నామినేషన్‌లు అన్నీ సవాలుకావొచ్చు. ఇది గందరగోళానికి దారితీస్తుంది. ఈ నేపథ్యంలో బీసీ ప్రజలు తాత్కాలిక ఉపాయాలపై కాదు, శాశ్వత చట్టబద్ధ పరిష్కారంపై ఆశలు పెట్టుకోవాలి.

న్యాయ పరిరక్షణ దిశగా పరిశీలిస్తే, 2007లో సుప్రీంకోర్టు "ఐఆర్ కోయెల్హో కేసు"లో, 9వ షెడ్యూల్లో చేర్చిన చట్టాలపై కూడా న్యాయ సమీక్ష చేసే అధికారం కోర్టులకు ఉందని పేర్కొంది. కాని ఇప్పటివరకు 9వ షెడ్యూల్లో చేర్చిన ఏ చట్టాన్నీ రద్దు చేయలేదు. అంతే కాదు, 2022లో జనహిత వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కూడా సుప్రీంకోర్టు రిజర్వేషన్లు రాజ్యాంగానికి వ్యతిరేకం కావని తేల్చలేదు. అందువల్ల చట్టబద్ధంగా ముందుకు వెళ్లాలన్నదే సరైన మార్గం. తాత్కాలిక జీవోలు, ఆర్డినెన్సులు, రాజకీయ ప్రకటనలు బీసీల న్యాయహక్కులను సమర్థించలేవు. వాటితో ఎన్నికలు గెలవొచ్చు, కానీ సామాజిక న్యాయాన్ని సాధించలేం. బీసీ ప్రజలు న్యాయబద్ధ రిజర్వేషన్ల సాధన కోసం రాజ్యాంగ పరిరక్షణ మార్గాన్ని పట్టుకోవాలి. ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడితో, శాసనోద్ధమ ప్రక్రియ ద్వారా, పార్లమెంటు చర్చల ద్వారా మాత్రమే శాశ్వత పరిష్కారం సాధ్యం. తెలంగాణ రాష్ట్రానికి, బీసీ సమాజానికి అదే సరైన మార్గం. ఆ మార్గంలో ముందడుగు వేయాలని ఈ వ్యాసం ఒక మార్గదర్శిగా నిలవాలన్నది ఆశ.

# గాలి నీరు ఆహారాలే ప్రాథమిక అవసరాలు



ప్రతి వ్యక్తికీ అత్యవసర ప్రాథమిక అవసరాలు మూడు. అవే గాలి, నీరు, ఆహారం. ఇవి లేకుండా జీవించడం దుర్లభం. ఆహారం లేకుండా కొన్ని రోజులు, నీరు లేకుండా కొన్ని రోజులు జీవించవచ్చునేమో కానీ గాలి లేకుండా జీవించలేం. శ్వాస మొదటి అత్యవసరమైనది. ఈ మూడు అందరికీ అవసరమైనవే కావున వాటి వినియోగంలో విజ్ఞత అవసరం. ఈ మూడింటిని నిర్లక్ష్యం చేస్తే సృష్టి ముందుకు పోదు. ఒకవేళ పోయినా సమస్యల వలయంలో చుట్టుకుని అతలాకుతలం అవుతుంది. ఈ మూడు ఎంత ప్రాముఖ్యమైనవో వాటి పనితీరు కూడా అంతే ఘనంగా ఉంటుంది. కావున విధిగ వీటి గూర్చి ఆలోచిస్తూ విజ్ఞతతో ప్రవర్తించాల్సి ఉంటుంది. ఎందుకంటే, అవి దొరకనప్పుడే వాటి విలువ తెలుస్తుంది. ఉచితంగా లభించే గాలి, అనారోగ్యంతో వైద్యశాలలో చేరినప్పుడే దానికి ధర చెల్లించాల్సి వస్తుంది. దాని విలువ అప్పుడు తెలుస్తుంది. అలాగే నీరు లభిస్తుంది కదా అంటూ వృథా చేస్తే భవిష్యత్తులో నీరును సైతం కొనాల్సి వస్తుంది. నీటి వినియోగంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో రేషన్ కార్డులపై నీటిని సరఫరా చేసే పరిస్థితి దాపురిస్తుంది. కావున నీటి వినియోగ విషయంలో ముందు చూపు అందరికీ తప్పనిసరి. ఇక ఆహార విషయములో...ప్రపంచ వ్యాప్తంగా కొంతమంది ప్రజలు మంచి ఆహారం లభించక ఖాళీ కడుపులతో అర్ధాకలితో అల్లాడిపోతున్నారు. వార్తల్లో ఈ విషయాలను గమనిస్తే పరిస్థితులు అర్థమవుతుంటాయి.



సరైన ఆహారం లభించక ఒంటిపై ఎముకల గూడు కనపడే దృశ్యాలను చూస్తూనే ఉన్నాం. ఒకవైపు కొందరు ఆహార లేమితో బాధపడుతుంటే... మరోవైపు ఆహార పదార్థాలను వదిలివేస్తూ నిర్లక్ష్యంతో మిగిలిస్తూ వృథా చేస్తున్న విషయాల్ని గమనించవచ్చు.
గొప్ప గొప్ప పట్టణాలలో వీకెండ్ రోజుల్లో పేరొందిన హోటళ్లల్లో ఆహార మిగులు వ్యర్థాలను వాహనాల లోడ్ ల ద్వారా బయటికి పంపిస్తారని ఎక్కడో చదివాను. చాలా విచారం. సరైన ఆహారం అందక ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలు అల్లాడిపోతుంటే ఈ విధంగా వేస్ట్ చేయడం బాధాకరం. ఈ మూడు అత్యవసరమైన వాటిని తగు అర్థం కలిగించే రీతుల్లో పొదుపుగా అవసరమయ్యే వరకే స్వీకరించాలి అంతే కానీ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ వ్యర్థం చేయటం ఏమాత్రం కరెక్ట్ కాదు. ఇక నీటి విషయంలో, వ్యవసాయం నీటిపైనే ఆధారపడి ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే నీరు మంచికి మారుపేరు, మేళ్లకు సూచన, నీటిని గొప్ప వరంగా భావిస్తుంటారు. ఎక్కడైనా నీరు పడిందంటే సంతోషాన్ని వ్యక్తం చేస్తుంటారు. తొలకరి వర్షాలు కురిసే సమయంలో రైతుల ఆనందాలకు అవధులు ఉండవు. నా చిన్నప్రాయంలో హైస్కూల్ చదువుల్లో ఒక గురువు గారు నీటి ప్రాముఖ్యత గూర్చి వివరించారు. కాలం ప్రకారం వర్షాలు కురిస్తే వ్యవసాయం సమృద్ధిగా రాణిస్తుందనీ, వ్యవసాయం సక్రమంగా కొనసాగితే ఆహార భద్రత లభిస్తుందనీ బోధించారు. ఒక దేశంలో ప్రతి వారం క్రమంగా ఖచ్చితంగా వర్షం పడుతుందట అందుకే సదురు దేశం సుభిక్షంగా ఉండేదని వివరించారు. దీనికి భిన్నంగా, సకాలంలో వర్షాలు కురవక, అతివృష్టి-అనావృష్టి లతో పరిస్థితులు మారిపోతుంటాయి. నీటి ఎద్దడి పరిస్థితికి ఉదాహరణ ఎడారి ప్రాంతాలే. నీటి ఎద్దడి గొప్ప విపత్తు, ఒక విధంగా శిక్షగా కూడా భావించాల్సి వస్తుంది. నీరు స్వచ్ఛతకు, శుభ్రతకు, పరిపూర్ణతకు మారు పేరు. అదే రీతుల్లో దాని ప్రాముఖ్యతను గుర్తిస్తూ విజ్ఞతతో నీటిని ఉపయోగించాల్సి ఉంది. లేకపోతే రాబోవు కాలంలో మంచినీటి కోసం ఇబ్బందులు, కొట్లాటలు తప్పవేమో మరి! నీటి వినియోగ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంతో ప్రవర్తిస్తే భవిష్యత్తులో మంచినీటి కోసం యుద్ధాలు సైతం జరగొచ్చని ఎక్కడో చదివాను. ఈ మేరకు ప్రాథమిక అవసరాలైన గాలి, నీరు, ఆహారాల విషయంలో ప్రతి ఒక్కరూ పెద్ద మనసుతో ఆలోచిస్తూ పద్ధతి ప్రకారం వాటిని వాడుకోవాలి. ఈ విషయంలో అందరూ ఆలోచించాలని మనవి. ఈ ప్రాథమిక అవసరాల వినియోగంలో విలక్షణంతో ప్రవర్తించాలి. మంచి నడవడి అలవర్చుకుంటూ, మంచి, చెడుల విచక్షణతో ముందుకు సాగాలి. మనం కరెక్టుగా మంచి పద్ధతితో ప్రవర్తిస్తే మన మనసుకు మనం తృప్తి కలిగించుకున్నట్లే అవుతుంది. మంచి నడవడి కలిగిన వ్యక్తులు ఖచ్చితంగా ఇతరులకు ఆదర్శం అవుతారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే - - -

మంచి నడవడి మానవత్వానికి వెలలేని మణి వంటిది.
మంచి నడవడి గలవారే పుణ్య పురుషులు
పురుషులందు పుణ్య పురుషులు వేరయా

అంటూ వేమన కవి చెప్పింది ఈలాంటి మంచి నడవడి, వ్యక్తిత్వం గల వారి గురించే కదా! మంచి నడవడి మనిషికి ఆవశ్యకం అప్పుడే అన్నీ శోభిల్లుతుంటాయి. మంచి నడవడితో క్రమశిక్షణతో జీవించడం వల్ల సమాజంలో గౌరవం లభిస్తుంది. గొప్ప వ్యక్తిత్వాన్ని ఇస్తుంది. మంచి నడవడితో అన్నింట్లో మంచే జరుగుతుంది. నిజంగా మంచివారు స్వార్థపరులుగా ఉండరు.
మంచి నడవడిని మించినది ప్రపంచంలో మరోది లేదని చెప్పవచ్చు. మంచి నడవడి గల వ్యక్తుల స్పర్శతో ప్రకృతి పులకరించిపోతుంది. తన విధులను వారి కోసమే కరెక్టుగా నిర్వహించేలా ప్రేరణ పొందుతుంది. అందుకే విలక్షణంగా ఉంటూ మంచిని కలిగి, మంచిని పెంచుతూ మంచిని పంచాలి. అప్పుడే పంచభూతాలు హర్షిస్తాయి. మంచి తోడ్పాటునిస్తాయి. తదుపరి పంచభూతాల గూర్చి వివరించే వ్యాసం రాసే ప్రయత్నం చేస్తాను. చివరగా, భగవంతుని వర ప్రసాదాలైన ప్రకృతి పరమైన గాలి, నీరు, ఆహారాలను విధిగా విజ్ఞతతో వినియోగించాలి. ఈ పోకడే భావి తరాలకు భరోసా కలిగిస్తుంది.


**డాక్టర్ ప్రభు దయాల్**
**మాజీ సెనేట్ మెంబర్ - కాకతీయ యూనివర్సిటీ**
**మాజీ ప్రధానాచార్యులు, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలం**
**మండల విద్యాశాఖ అధికారి - కొత్తగూడెం**


# పులుల సంరక్షణ: భారతదేశం సాధించిన అద్భుత ప్రగతి!



అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా, పులుల సంరక్షణలో మన దేశం సాధించిన అద్భుతమైన ప్రగతిని ప్రశంసించకుండా ఉండలేం. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈ దినోత్సవం, పులుల సంరక్షణ ప్రాముఖ్యతను మనందరికీ గుర్తు చేస్తుంది. 2010లో సెయింట్ పీటర్స్‌బర్గ్ టైగర్ సమ్మిట్‌లో సమావేశమైన 13 పులుల జనాభా దేశాలు, 2022 నాటికి ప్రపంచ పులుల జనాభాను రెట్టింపు చేయాలనే మహత్తర లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశాయి. 2025 ఇతివృత్తం "మానవులు, పులుల మధ్య సామరస్య సహజీవనం" అనేది, ఉమ్మడి పర్యావరణ వ్యవస్థలకు ప్రయోజనం చేకూర్చే సమగ్ర పరిరక్షణ ప్రయత్నాల ఆవశ్యకతను స్పష్టంగా నొక్కి చెబుతోంది. ఒకప్పుడు ఆసియా ఖండం అంతటా స్వేచ్ఛగా సంచరించిన పులులు, దురదృష్టవశాత్తు నేడు ఆవాసాల విధ్వంసం, అక్రమ వేట, మానవ-వన్యప్రాణుల మధ్య పెరుగుతున్న సంఘర్షణల కారణంగా గణనీయంగా తగ్గిపోయాయి. అయితే, ఈ క్లిష్టమైన పరిస్థితులలో, భారతదేశం ఒక ఆశాకిరణంగా, పులుల సంరక్షణకు ప్రపంచానికే ఒక మార్గదర్శిగా నిలుస్తోంది.

**పులుల సంఖ్యలో భారతదేశం ప్రపంచ రికార్డు!**

ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద అత్యంత సురక్షితమైన పులుల ఆవాసాలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. గత కొన్ని దశాబ్దాలుగా మన దేశం సాధించిన పురోగతి నిజంగా అద్భుతం, ఇది ప్రపంచవ్యాప్తంగా సంరక్షకులకు ఆదర్శంగా నిలుస్తుంది. 2006లో కేవలం 1,411 పులులు మాత్రమే అడవులలో నివసిస్తున్నాయని అంచనా వేయగా, ఈ సంఖ్య 2010లో 1,706కు, 2014లో 2,226కు (30.5% పెరుగుదల), 2018లో 2,967కు గణనీయంగా పెరిగింది. అద్భుతమైన రీతిలో 2023 సం. నాటికి ఏకంగా 3,682 పులులతో భారతదేశం ప్రపంచ పులుల జనాభాలో దాదాపు 75 శాతాన్ని తనదైందని ప్రకటించింది. ఇది కేవలం సంఖ్యల పెరుగుదల మాత్రమే కాదు, దేశం పులుల సంరక్షణకు ఎంత అంకితభావంతో, నిరంతరం శ్రమిస్తుందో తెలియజేస్తుంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు అటవీ ప్రాంతాలలో ట్రెక్కింగ్ చేస్తూ, అటవీ అధికారులు శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి ఈ



జనాభా గణనను చేపడతారు. ఈ సుదీర్ఘమైన, సవాళ్లతో కూడుకున్న పనికి మనం అభినందనలు తెలపాలి. ఈ గణనలో పులుల పాదముద్రలు, అత్యాధునిక కెమెరా ట్రాప్‌లు, డీఎన్ఏ విశ్లేషణ వంటి ఆధునిక పద్ధతులను సమర్థవంతంగా ఉపయోగిస్తారు, ఇది కచ్చితమైన అంచనాలకు దారితీస్తుంది. పులుల సంఖ్య పెరుగుదల మన పర్యావరణ వ్యవస్థల అద్భుతమైన ఆరోగ్యాన్ని సూచిస్తుంది. పులులు ఆహార గొలుసులో అత్యున్నత స్థానంలో ఉన్నందున అవి ఆరోగ్యకరమైన మరియు సమతుల్యమైన అటవీ పర్యావరణానికి సూచికలుగా పనిచేస్తాయి. వాటి సంఖ్య పెరగడం అంటే అడవులు పచ్చగా ఉన్నాయని, వాటి ఆహార వనరులు సమృద్ధిగా ఉన్నాయని, తద్వారా మొత్తం జీవవైవిధ్యం అభివృద్ధి చెందుతుందని అర్థం. ఇది పర్యావరణ సమతుల్యతకు, ప్రకృతికి ఎంతగానో దోహదపడుతుంది.

**ప్రాజెక్ట్ టైగర్- ఒక మహత్తర విజయం:**

పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన ఈ ఘనతకు ప్రధాన కారణం నిస్సందేహంగా ప్రాజెక్ట్ టైగర్. పర్యావరణ, అటవీ వాతావరణ మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కేంద్ర ప్రాయోజిత పథకం పులుల సంరక్షణ బాధ్యతను పంచుకుంటున్న రాష్ట్రాలకు నిరంతరం కేంద్ర సహాయాన్ని అందిస్తుంది. 1973లో ప్రారంభమైన ప్రాజెక్ట్ టైగర్ కింద, పులుల ఆవాసాలను పరిరక్షించడానికి ప్రత్యేకమైన టైగర్ రిజర్వ్‌లను ఏర్పాటు చేశారు. వీటిని భారత ప్రభుత్వ జాతీయ పులుల సంరక్షణ అథారిటీ సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఈ రిజర్వ్‌లు జాతీయ ఉద్యానవనం లేదా వన్యప్రాణుల అభయారణ్యం వంటి ఇప్పటికే ఉన్న రక్షిత ప్రాంతాలలో భాగమైన కీలకమైన ప్రాంతాలను కలిగి ఉంటాయి. ఇవి పులులకు అత్యంత అనుకూలమైన ఆవాసాలను అందిస్తాయి.
ప్రారంభంలో కేవలం 9 టైగర్ రిజర్వ్‌లతో మొదలై, మార్చి 2024 నాటికి ఈ సంఖ్య 55కు చేరగా, 2025 నాటికి ఏకంగా 58 టైగర్ రిజర్వ్‌లు ఉన్నట్లు సమాచారం. వీటిలో మాధవ్ టైగర్ రిజర్వ్ తాజాది. ఈ రిజర్వ్‌లు అంతరించిపోతున్న బెంగాల్ టైగర్‌ను దాని సహజ ఆవాసాలను రక్షించడానికి ప్రత్యేకంగా స్థాపించబడ్డాయి. ఇవి మన పులుల పరిధిలోని 18 రాష్ట్రాలలో విస్తరించి, మొత్తం 78,735.5966 చ.కి.మీ (దేశ భౌగోళిక విస్తీర్ణంలో దాదాపు 2.23%) విస్తీర్ణంలో పులులకు సురక్షితమైన ఆవాసాన్ని అందిస్తున్నాయి. ఈ టైగర్ రిజర్వ్‌లు కఠినమైన నిఘా, అధునాతన వేట నిరోధక చర్యలు, స్థానిక ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో పులులకు అభేద్యమైన రక్షణ కల్పిస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే, తెలంగాణలో అమ్రాబాద్ (2,611.39 చ.కి.మీ), కవాల్ (2,015.44 చ.కి.మీ) టైగర్ రిజర్వ్‌లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్ శ్రీశైలం (3,296.31 చ.కి.మీ) టైగర్ రిజర్వ్ ఉంది. ఈ రిజర్వ్‌లు కేవలం పులులను మాత్రమే కాకుండా వాటి జీవవైవిధ్యాన్ని కూడా కాపాడుతున్నాయి. వివిధ రకాల వృక్ష, జంతు జాతులకు సురక్షితమైన ఆశ్రయం కల్పిస్తున్నాయి.

**పర్యావరణ పర్యాటకం - సంరక్షణకు ఒక వంతెన:**

మన దేశంలోని పులుల సంరక్షణ కేంద్రాలలో పర్యావరణ పర్యాటకం ఒక ముఖ్యమైన నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోంది. పర్యావరణ అవగాహన లక్ష్యంతో బాధ్యతాయుతమైన పర్యాటక పద్ధతులను అవలంబిస్తూ జీవవైవిధ్య పరిరక్షణను ఇది సమన్వయం చేస్తుంది. రణతంబోర్, జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ వంటి ప్రసిద్ధ పులుల సంరక్షణ కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రకృతి ఔత్సాహికులను, వన్యప్రాణుల ప్రేమికులను విరివిగా ఆకర్షిస్తున్నాయి. పర్యావరణ పర్యాటకం నుండి వచ్చే ఆదాయం సంరక్షణ ప్రయత్నాలకు గణనీయంగా దోహదపడుతుంది. దేశ పర్యావరణ సమతుల్యతలో జీవుల ప్రాముఖ్యతను బలోపేతం చేస్తుంది.
పర్యాటకం టైగర్ రిజర్వ్‌లలో గొప్ప జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలో బాధ్యతను, భాగస్వామ్య నిబద్ధతను పెంపొందిస్తుంది. పర్యాటకులు పులులను వాటి సహజ ఆవాసాలలో ప్రత్యక్షంగా చూడటం ద్వారా వాటి సంరక్షణకు ఉన్న ఆవశ్యకతను మరింత లోతుగా అర్థం చేసుకుంటారు. ఇది ప్రజలలో వన్యప్రాణుల పట్ల అవగాహన, ప్రేమను గణనీయంగా పెంచుతుంది. సహజ ఆవాసాలకు కనీస అంతరాయం కలగకుండా, హాని కలిగించే పులుల జనాభాను కాపాడేందుకు కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయి.

**ఉక్కుపాదం మోపాలి:**

టైగర్ రిజర్వ్‌లకు వన్యప్రాణుల (రక్షణ) చట్టం 1972 ప్రకారం పటిష్టమైన చట్టపరమైన రక్షణ కల్పించబడింది. ఈ చట్టం అధికారులకు వేట, అక్రమ ఆక్రమణలు, రిజర్వ్‌ల వన్యప్రాణులు, పర్యావరణ వ్యవస్థను బెదిరించే ఇతర కార్యకలాపాలపై కఠినమైన చర్యలు తీసుకునే అధికారం ఇస్తుంది. ఈ చట్టం లోని సెక్షన్ 38 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు పులుల సంరక్షణ ప్రణాళికను రూపొందించే అమలు చేసే బాధ్యతను కలిగి ఉంటాయి. జీవవైవిధ్యాన్ని కాపాడే క్రమంలో పులులను సంరక్షించుకోవడం మన కనీస ధర్మం. వీటిని వేటాడే వారిపై ప్రభుత్వాలు మరింత కఠినంగా వ్యవహరించి ఉక్కుపాదాన్ని మోపాలి.
పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన ఈ ప్రగతి మనందరికీ గర్వకారణం. ఇది కేవలం పులుల సంఖ్యను పెంచడం మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అటవీ సంపదను పరిరక్షించడం, మానవ-వన్యప్రాణుల సహజీవనాన్ని ప్రోత్సహించడం వంటి విస్తృత లక్ష్యాలను కలిగి ఉంది. భవిష్యత్తులో కూడా ఈ సంరక్షణ ప్రయత్నాలను నిరంతరం కొనసాగించి మన జాతీయ జంతువును భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.


**జనక మోహన రావు దుంగ**
**8247045230**


భక్తి

## సర్వ శుభప్రదం శ్రావణం



ఏ మహిళ దోసిట శనగల మూటను పలకలించినా, పాదాలకు రాసుకున్న పసుపును పరామర్శించినా, శిరసు మీద అక్షతలను చూసి విశేషమేమిటని అడిగినా, ముంజేతి చేమంతి పూలతోరాన్ని ముచ్చటగా మాట్లాడించినా, అన్నిటికన్నా ముందుగా కొత్త పట్టుచీరల పెళపెళలను విన్నా, కొత్త బంగారు నగల తళతళలను కన్నా, తల పైకెత్తినప్పుడు... 'ఎప్పుడు కురుస్తానో నాకే తెలియదం'టూ నల్లని రూపంతో, ఫెళఫెళ గర్జన ధ్వనులతో కనిపిస్తున్న మేఘాలను చూసినా... 'ఇంకేముంది? ఇది శ్రావణం సుమా!' అని అర్థమైపోతుంది. ఇదంతా అత్యంత మనోహరం కదూ!
నేటినుంచి శ్రావణమాసం
మంగళగౌరీ వ్రతం ఎందుకంటే...

శ్రావణ మాసం వ్రతాల మాసం. విశేషమేమిటంటే... శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైన శ్రావణ మాసంలో మంగళగౌరికి కూడా సముచిత స్థానం ఉంటుంది. ఈ మాసంలో వచ్చే ప్రతి మంగళవారం ఆరాధించేది గౌరీ దేవినే. హిమవంతుని పుత్రిక అయిన శైలజ... వర్షంలో తడుస్తూ, ఎండలో ఎండుతూ, చలికి గడ్డకట్టుకుపోతూ ఉన్నా చలించకుండా తపస్సు చేసింది. దానితో ఆమె శరీరం గౌర వర్ణానికి (ఎండిపోయిన లేత పసుపుపచ్చ దర్భ గడ్డి రంగులోకి) మారింది. అందుకే ఆమె 'గౌరి' అయింది. శంకరుణ్ణి తన భర్తగా (పినాకపాణిం పతిమాప్తు మిచ్ఛతి) భావించి, చివరకు ఆ మంగళకరమైన లక్ష్యాన్ని సాధించింది కాబట్టి ఆమెను "మంగళ గౌరి' అని పిలుస్తాం. ఆ గౌరి తన కోరికను నెరవేర్చుకొని, కాబోయే భర్తను తన వద్దకు రప్పించుకొని, తన మాట వినేలా ఏ విధంగా చేసుకుందో... అటువంటి శక్తిని తనకు ఇవ్వాలని ప్రార్థించడానికి, ఆ శక్తిని పొందడానికి వివాహంలో ప్రతి వధువుతో గౌరీ పూజ చేయిస్తారు. అంటే మంగళగౌరీ వ్రతం అనేది భార్యాభర్తల మధ్య అన్యోన్యత సిద్ధించడం కోసం చేసేది. ఆ గౌరీదేవి శంకరుణ్ణి వివాహం చేసుకున్నాక పార్వతిగా లోక ప్రసిద్ధురాలయింది. విఘ్నాలను నివారించగల శక్తి ఉన్న గణపతి, సంతానాన్ని ప్రసాదించి, సర్ప దోషాన్ని పోగొట్టగలిగే శక్తి ఉన్న కుమార స్వామి ఆమె సంతానం. కాబట్టి... మంగళ గౌరీ వ్రతం ఆచరించడం అన్యోన్య దాంపత్యం కోసం, విఘ్ననాశనం కోసం, సంతాన ప్రాప్తికోసం,
శ్రావణమాసంలో మహిళలు అత్యంత శ్రద్ధాభక్తులతో చేసుకొనేది వరలక్ష్మీ వ్రతం. చిత్తడి చిత్తడిగా ఉండే వర్షాకాలంలో ఈ వ్రతాన్ని నిర్దేశించడానికి కారణం... వర్షానికి తడిసి భూమినుంచి వచ్చే పంటే గొప్ప ధనం అని చెప్పడానికే. అలాగే... మహా ధనవంతురాలికి, సంతానం లేక తపన పడుతున్న వారికి, అత్తమామలతో సఖ్యత లేని వారికి, అనారోగ్యంతో, ఇతర సమస్యలతో తల్లడిల్లుతున్నవారికి ధనం ఇస్తే ప్రయోజనం ఉంటుందా? అది చెరువుకు జలదానం చేసినట్టే కదా! కాబట్టి తాను సంపదకు సంకేతం అయినప్పటికీ... ఎవరైతే తనను పూజించి, తనకు ఏ లోపం ఉందో ఆ లోపం తీరడం కోసం దేన్ని వరంగా (వృణుతే ఇతి) కోరుతారో దాన్ని ఇస్తానంది శ్రీమహాలక్ష్మి. ఆ విధంగా తనను వరలక్ష్మిగా, తన పూజను వరలక్ష్మీ పూజగా స్థిరపరుచు కుంది. ఆమెతో పాటు మంగళగౌరిని కూడా ఈ నెలరోజులూ ఆరాధించాలనే నిర్దేశానికి కారణం... శివుని పత్ని అయిన గౌరికి, విష్ణు పత్ని అయిన తనకు, అలాగే శివకేశవులకు ఎలాంటి భేదం లేదని దృఢంగా ప్రకటించడానికే. మంగళ గౌరీ వ్రతం చేసినప్పుడు... బియ్యపు పిండి, బెల్లం కలిపిన కుందెను చేసి, దాని నిండా ఆవు నెయ్యి పోసి, పత్తితో చేసిన వత్తిని వేసి వెలిగించి... వ్రత కథ చదువుతారు. కథ పూర్తయ్యేసరికి ఆ ఆవు నెయ్యి ఆ వత్తి మంట ద్వారా నిదానంగా ఉడుకుతుంది. గర్భధారణలో ఏవైనా దోషాలుంటే తొలగించగలిగే శక్తి ఉన్న దివ్యౌషధంగా మారుతుంది. పూర్వం పసుపు కొమ్ముల్ని దంచి పసుపుగాను, దాంట్లో చిన్నాళమనే చిన్న రాతిని వేసి, దంచి, కలిపి కుంకుమగానూ ఆ తల్లి సమక్షంలో చేసుకొని... ముత్తయిదువులకు పంచుకొనే వారు. మహిళలందరూ కలిసి, అమ్మవారి పాటలు పాడుకుంటూ... అమ్మవారి సమక్షంలోనే కాటుక తయారు చేసుకొనేవారు.






# మోదీతో ఏం జరిగిందో ఆయనే చెప్పాలి.. ధన్‌ఖడ్ రాజీనామాపై ఖర్గే

**బెంగళూరు - నవభూమి:** ఆరోగ్య కారణాలతో ఉప రాష్ట్రపతి పదవికి జూలై 21న జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసినప్పటికీ ఆయన రాజీనామాకు కారణాలపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, జగదీప్ ధన్‌ఖడ్‌కూ మధ్య అంశమని అన్నారు. అసలైన కారణం ఏమిటనే దానిపై తనకు సమాచారం లేదని చెప్పారు.రైతులకు అనుకూలంగా మాట్లాడినందుకే ధన్‌ఖడ్ బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చిందా అని మీడియా అడిగిన ప్రశ్నకు ఖర్గే స్పందిస్తూ, ఆ విషయాలు తనకు తెలియవని, ఆయన ఎప్పుడూ ప్రభుత్వం పక్షానే ఉండేవారని, అసలు ఏమి జరిగిందనేది ఆయనే చెప్పాలని అన్నారు.రాజ్యసభ చైర్మన్‌గా జగదీప్ ధన్‌ఖడ్ తన హయాంలో ఎల్లప్పుడూ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవారని, కీలక అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలకు తరచు అనుమతి నిరాకరించేవారని ఖర్గే వ్యాఖ్యానించారు. రైతులు, పేదలు, అంతర్జాతీయ అంశాలు, విదేశాంగ విధానం వంటి పలు అంశాలపై ఏరోజూ రాజ్యసభ చైర్మన్‌గా ఆయన తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. దళిత మహిళలు, దళితులు, అట్టడుగు వర్గాలపై అకృత్యాలు, హిందూ-ముస్లిం ఘర్షణల ఘటనలు వంటి అంశాలపై నోటీసులు ఇచ్చి ప్రస్తావించేందుకు ప్రయత్నించినప్పుడు కూడా తమకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదన్నారు. ధన్‌ఖడ్ ఎందుకు రాజీనామా చేశారనేది ఆయనకు, మోదీకి మధ్య అంశమని, ఆ కారణం ఏమిటనేది చెప్పాల్సింది కూడా ఆయనేనని అన్నారు.

## రానిటిడిన్‌తో క్యాన్సర్ భయం



**న్యూఢిల్లీ - నవభూమి:** ఎసిడిటీ చికిత్సకు ఉపయోగించే ఔషధం రానిటిడిన్‌తో క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ ఔషధంలోని నైట్రోసోడైమెథైలమైన్(ఎన్‌డీఎంఏ) అనే ప్రమాదకరమైన క్యాన్సర్ కారకం(కార్సినోజెన్) ఉన్నట్లు తేలింది. దీంతో.. తమ పరిధిలో తయారయ్యే రానిటిడిన్‌లో ఎన్‌డీఎంఏ స్థాయిలను గమనించాలని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ(సీడీఎస్‌సీవో), అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఔషధ నియంత్రణ డైరెక్టర్ జనరల్లకు ఆదేశాలు జారీ చేసింది. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశి సూచనతో.. డ్రగ్స్, టెక్నికల్ అడ్వైజరీ బోర్డు(డీటీఏబీ) సిఫార్సుల ఆధారంగా రానిటిడిన్‌లో క్యాన్సర్ కారకాలున్నట్లు గుర్తించినట్లు పేర్కొంది.


## 63 జిల్లాల్లో 50% పైగా చిన్నారుల్లో ఎదుగుదల లోపం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపం ఆందోళనకరంగా ఉంది. 13 రాష్ట్రాలు, యూటీల్లోని 63 జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారుల్లో 50 శాతానికి పైగా ఎదుగుదల లోపంలో బాధపడుతున్నారని పార్లమెంట్‌లో సమర్పించిన పలు పత్రాల డేటా వెల్లడించింది. 199 జిల్లాల్లో ఇది 30 నుంచి 40 శాతం మధ్య ఉందని పేర్కొంది.

పిల్లలు చాలా కాలం పాటు తగిన పోషకాహారం తీసుకోనప్పుడు సంభవించే దీర్ఘకాలిక పోషకాహార లోపాన్నే ఎదుగుదల లోపం (స్టంటింగ్) అంటారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖకు చెందిన పోషన్ ట్రాకర్- 2025 జూన్ ఆధారిత డేటా ప్రకారం.. కొన్ని జిల్లాల్లో అత్యధిక సంఖ్య చిన్నారుల్లో ఎదుగుదల లోపం ఉంది.

## జీఎస్ఎల్వీ-ఎఫ్16 రిహార్సల్ విజయవంతం



**సూళ్లూరుపేట-నవభూమి:** ఇస్రో-నాసా సంయుక్తంగా చేపడుతున్న నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5:40 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం రాకెట్ రిహార్సల్‌ను శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. రాకెట్‌ను మొబైల్ సర్వీస్ టవర్ నుంచి ముందుకు తీసుకొచ్చి మళ్లీ వెనక్కి తీసుకెళ్లే ప్రయోగ ప్రక్రియను శాస్త్రవేత్తలు నిర్వహించారు.రాకెట్‌లోని అన్ని దశల పనితీరును పరిశీలించి తుది దశ తనిఖీలు చేశారు. ప్రయోగానికి సంబంధించి రాకెట్ సంసిద్ధత (ఎంఆర్ఆర్) సమావేశం సోమవారం షార్‌లో జరగనుంది. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (లాబ్) సమావేశమవుతుంది. ఆ తర్వాత కౌంట్‌డౌన్ సమయాన్ని శాస్త్రవేత్తలు అధికారికంగా ప్రకటిస్తారు. కౌంట్‌డౌన్ 24 గంటలు లేదా 25:30 గంటలకు ముందు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది నాసా-ఇస్రో ఉమ్మడి ప్రాజెక్టు కావడంతో అమెరికా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు రానున్నారు.

## మహిళా స్కీమ్ సొమ్ము తినేస్తున్న మగాళ్లు!



**ముంబై- నవభూమి:** మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'లడ్కీ బహిన్ యోజన' పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ స్కీమ్ కింద మహిళలు లబ్ధి పొందాల్సి ఉండగా.. దాదాపు 14 వేల మందికి పైగా పురుషులు మోసపూరితంగా డబ్బులు కాజేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను తప్పుదోవ పట్టించి, మహిళలుగా పేర్లను నమోదు చేసుకొని, 'లడ్కీ బహిన్ యోజన' కింద లబ్ధి పొందారు. 14,298 మంది పురుషులకు రూ.21.44 కోట్ల మేర అందినట్లు మహిళా, శిశు అభివృద్ధి శాఖ (డబ్ల్యూసీడీ) ఆడిట్‌లో వెల్లడైంది. పథకాన్ని ప్రారంభించిన దాదాపు 10 నెలల తర్వాత ఈ ఘరానా మోసం బయటపడడం గమనార్హం. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.

పేద మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు లడ్కీ బహిన్ స్కీమ్‌ను ప్రారంభించామన్నారు. తప్పుడు మార్గంలో లబ్ధి పొందిన పురుషుల నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. మరికొన్ని విధాలు గా ఈ పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆడిట్‌లో తేలింది. పెద్ద సంఖ్యలో అనర్హుల నమోదు కారణంగా రూ.1,640 కోట్ల నష్టం జరిగిందని డబ్ల్యూసీడీ అంచనా వేసింది. ఈ పథకాన్ని ఒక్కో కుటుంబంలో ఇద్దరికే పరిమితం చేయగా.. 7.97లక్షల మందికి పైగా మహిళలు తమ కుటుంబాల నుంచి మూడో సభ్యురాలిగా నమోదు చేసుకున్నారు. తద్వారా ప్రభుత్వానికి రూ.1,196కోట్ల నష్టం వాటిల్లింది. గరిష్ఠ వయసు పరిమితి 65 ఏళ్లు పెట్టగా.. 65 ఏళ్లు దాటిన 2.87 లక్షల మంది స్కీమ్ లబ్ధి పొందారు. దీని వల్ల రూ.431.7 కోట్ల నష్టం జరిగింది. స్కీమ్‌లో అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలనే డిమాండ్లు వస్తున్నాయి.

# చికెన్ వంటకాల్లో గబ్బిలాల మాంసం



మీరు ఎప్పుడైనా చిల్లీ చికెన్ తిన్నారా.. ఎంత బాగుంటుందో అంటారా.. కానీ, మీరేప్పుడైనా గబ్బిలాలతో తయారు చేసిన చిల్లీ చికెన్ తిన్నారా.. గబ్బిలాలతో తయారు చేసిన చిల్లీ చికెన్‌ను అమ్ముతున్న ఓ దారుణమైన సంఘటన తమిళనాడులో వెలుగులోకి వచ్చింది. సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని డానిష్‌పేట అటవీ ప్రాంతంలో గబ్బిలాలను చంపి ఆ తర్వాత వాటిని వండి చిల్లీ చికెన్‌గా అమ్ముతున్నట్లు ఆరోపణలు ఎదుర్కుంటున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పాపం ఇది నిజమైన చికెన్ అనుకుని అక్కడి స్థానిక ప్రజలు తింటున్నారని పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది.డానిష్ పేట పరిధిలోని తోప్పూర్ రామస్వామి కొండ ప్రాంతంలో తరచుగా తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపిస్తున్నాయని డానిష్‌పేట అటవీ కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో ఫారెస్ట్ రేంజర్ విమల్‌కుమార్ నేతృత్వంలోని అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహించారు.. నిజంగానే అక్కడ తుపాకీ కాల్పుల శబ్దాలు వారికి వినిపించాయి. దీంతో ఏంటని వారు అటవీ ప్రాంతాన్ని మొత్తం గాలించారు. ఈ క్రమంలోనే వారికి కమల్, సెల్వం అనే ఇద్దరు వ్యక్తులు కన్పించారు.

'కన్నప్ప' బాలేదని మోహన్ బాబుకి ఫోన్ చేసి చెప్పా..
పులిని చూసి నక్క వాతలు.. తమ్మారెడ్డి కీలక వ్యాఖ్యలు
వెలుగులోకి ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధారామం పీఠాధిపతి రాసలీలలు.. అనేక మందితో లైంగిక సంబంధాలు
రైతులకు బంపర్ ఆఫర్.. ఎరువులు కొంటే చాలు.. రూ.2 లక్షల వరకు.., అదనంగా రైతు బీమా కూడా..

వెంటనే అటవీ శాఖ అధికారులు వారి ఇద్దరిని పట్టుకుని తుపాకీ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత వారిని విచారించగా.. వారు ఎలాంటి విషయాలు చెప్పలేదు. కాకపోతే వారిద్దరూ ఓ హోటల్ నిర్వహిస్తూ చికెన్ అమ్ముతున్నారు. దీంతో వారు గబ్బిలాల మాంసంతోనే చికెన్ చేస్తున్నట్లు అనుమానించిన స్థానికులు అదే నిజమై ఉంటుందని పోలీసులకు చెప్పారు. ఇలా పెద్ద ఎత్తున ఆరోపణలు రాగా.. పోలీసులు వారిద్దరినీ అరెస్ట్ చేశారు.అయితే ప్రస్తుతం వారు నోరు మెదపడం లేదని.. తాము ఎలాంటి తప్పు చేయడం లేదని మాత్రమే చెబుతున్నారని పోలీసులు వివరించారు. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసిన తర్వాతే అసలు విషయాలు తెలుస్తాయని అంటున్నారు. మరోవైపు ఓమలూరు సమీపంలోని పన్నపట్టి పంచాయతీలోని వవ్వాల్‌తోప్పు ప్రాంతంలో ఒక చెట్టుపై లక్షలాది గబ్బిలాలు నివసిస్తున్నాయని.. వాటిని వేటాడటానికి కూడా వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆ గ్రామస్థులు చెబుతున్నారు. కానీ తాము గబ్బిలాలను దేవతలుగా పూజిస్తున్నందున వాటిని చంపడానికి అనుమతించలేదని.. అందుకే వారు అడవుల్లోకి వేటకు వెళ్లి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

దేవభూమిలో మృత్యుఘోష

గబ్బిలాలతో చిల్లీ చికెన్ అనే పదం ఇప్పుడు రాష్ట్రమే కాదు.. దేశాన్నే ఉలిక్కిపడేలా చేసింది. గబ్బిలాలతో డేంజరస్ వైరస్‌లు సోకుతాయని వైద్యులు చెబుతుంటారు. కానీ వీరు ఏకంగా ఈ గబ్బిలాలతోనే ఇలాంటి చిల్లీ చికెన్ లాంటి వంటకాలు తయారు చేయడంపై సర్వంత్రా విమర్శలు వస్తున్నాయి. దీనిపై లోతుగా విచారణ జరుగుతుందని పోలీసులు చెబుతున్నారు.

### మావోయిస్టుల కోసం వెతికితే బంకర్‌లో


# భారీగా నోట్ల కట్టలు..



జార్కండ్ అడవుల్లో మావోయిస్టుల కోసం గాలిస్తున్న పోలీసులకు కలలో కూడా ఊహించని స్థాయిలో డబ్బులు దొరికాయి. ముఖ్యంగా బంకర్ లాంటి ప్రదేశాన్ని గుర్తించి.. అక్కడ తవ్వకాలు జరపగా భారీగా నోట్ల కట్టలు బయట పడ్డాయి. వాటన్నిటినీ బయటకు తీసి లెక్కించగా.. మొత్తంగా రూ.35 లక్షలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే మందుగుండు, పేలుడు పదార్థాలు కొనుగోలు చేసేందుకు.. మావోయిస్టుల దాచుకున్న డబ్బు బయట పడగా పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మావోల ప్లాన్ బెడిసి కొట్టిందని వివరిస్తున్నారు.

ఇటీవలే ఓ ఫారెస్ట్ ఆఫీసర్ ఇంట్లో భారీగా నోట్ల కట్టలు, బంగారం బయటపడి సంచలనం సృష్టించింది. అయితే తాజాగా ఫారెస్టులోనే భారీగా నోట్ల కట్టలు దొరకగా.. పోలీసులు షాక్ అయ్యారు. ముఖ్యంగా మావోయిస్టుల కోసం వెతుక్కుంటూ వెళ్లగా.. బంకర్ లాంటి ఓ ప్రదేశం కనిపించింది. అనుమానం వచ్చిన పోలీసులు దాన్ని తవ్వి చూడగా.. అందులోని కవర్లలో పెద్ద ఎత్తున డబ్బులు కట్టలు కనిపించాయి. వాటిని పూర్తిగా బయటకు తీసిన పోలీసులు లెక్కించగా.. మొత్తంగా రూ. 35 లక్షల వరకు ఉన్నట్లు తెలిసింది.జార?ండ్‌లోని చాయిబాసా అడవుల్లోని సరాందా ప్రాంతంలో భద్రతా దళాలు మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేశారు. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని భూగర్భంలో దాచి ఉంచిన రూ. 35 లక్షల నగదును భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా జార్కండ్ జాగ్వార్, సీఆర్పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ విజయాన్ని సాధించాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టుల కోసం వెతుకుతూ వెళ్లగా తమకు బంకర్‌లాంటి ప్రదేశం కనిపించినట్లు చెప్పారు. అనుమానం వచ్చి తవ్వి చూడగా భారీగా నోట్ల కట్టలు కనిపించినట్లు వెల్లడించారు. అవన్నీ ప్లాస్టిక్ కవర్లలో ఉండగా.. నోట్ల కట్టలు మొత్తాన్ని న్యూస్ పేపర్‌తో చుట్టినట్లు ఉందని వివరించారు. మొత్తంగా రూ.34.99లక్షలు ఉన్నట్లు స్పష్టం చేశారు. అయితే ఈ డబ్బులను.. మావోయిస్టులు భద్రతా దళాలపై ల్యాండ్‌మైన్‌లు అమర్చడానికి అవసరమైన పేలుడు పదార్థాలను కొనుగోలు చేయడానికే దాచి ఉంటారని తాము భావిస్తున్నట్లు చెప్పారు. తమకు ఈ డబ్బు దొరకడం వల్ల పేలుడు పదార్థాల కొనుగోళ్లను గణనీయంగా అడ్డుకున్నట్లు స్పష్టం చేశారు.గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చాలానే చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మే నెలలో.. జార్కండ్-బీహార్ సరిహద్దులో మావోయిస్టులకు చెందిన రెండు లాకర్లు, భారీ ఎత్తున మందుగుండు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ లాకర్లను కూడా మావోయిస్టులు ప్రజల నుంచి బహిరంగంగా వసూలు చేసిన పన్ను (లెవీ) డబ్బును దాచడానికి ఉపయోగించినట్లు భావిస్తున్నారు. ఈ వరుస విజయాలు భద్రతా దళాలు మావోయిస్టుల ఆర్థిక మూలాలను దెబ్బతీయడంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాయని స్పష్టం చేస్తున్నాయి. చాయిబాసా అటవీ ప్రాంతంలో ఈ విజయం, మావోయిస్టుల ప్రాబల్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

# దుబాయ్‌లో గాల్లో వేలాడే నగరం..గాల్లో మేడలు



ఎవరైనా సాధ్యం కాని విషయాలు చెబుతున్నప్పుడు 'గాలిలో మేడలు కటొద్దు' అని అంటూ ఉంటారు. అంటే గాలిలో కట్టడాలు కట్టలేమని అర్థం. కానీ ఈ వార్త పూర్తిగా చదివితే మాత్రం.. ఈ సామెతను ఇక నుంచి ఉపయోగించడం మానేస్తారేమో. ఎందుకంటే ఇప్పుడు గాలిలోనే భారీ భవంతిని నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. భూమితో ఎలాంటి సంబంధం లేకుండా గాలిలోనే ఆ భారీ బిల్డింగ్ ఉండనుంది. ఒక భవనాన్ని నిర్మిస్తే.. అది ఒకే చోట కదలకుండా స్థిరంగా ఉంటుంది. కానీ ఇప్పుడు చెప్పబోయే బిల్డింగ్ మాత్రం.. ఒకచోట కుదురుగా ఉండదు. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తుంది. ఇళ్లు, ఆఫీసులు, షాపింగ్ మాల్స్ ఇలా భూమిపై ఉండే అన్ని సౌకర్యాలు.. ఆ టవర్‌లో ఉంటాయి. ఇంతకీ ఈ టవర్‌ను ఎక్కడ నిర్మిస్తారు. అసలు గాల్లో వేలాడే నగరం ఎలా ఉంటుంది. అది ఎంతవరకు సాధ్యం అవుతుంది. ఆ టవర్‌లోకి కరెంటు, నీళ్లు, గాలి ఎలా వస్తాయి. ఇంతకీ అలాంటి టవర్ నిర్మించడం సాధ్యం అవుతుందా అనే అన్ని ప్రశ్నలకు ఈ స్టోరీలో సమాధానాలు చూద్దాం.

దుబాయ్‌లో గాల్లో వేలాడే నగరం.. అంతరిక్షం నుంచి తలకిందులుగా బిల్డింగ్.. అసలేంటీ

**అనలెమ్మ టవర్?**

గాలిలో వేలాడే నగరం నిర్మిస్తారని మీరు ఎప్పుడైనా ఊహించారా. మనిషి అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని.. ఇప్పటివరకు ఎన్నోసార్లు అది రుజువు అయింది. టెక్నాలజీని సాయంతో నిర్మాణ రంగం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఆకాశాన్ని తాకే పెద్ద పెద్ద భవనాలను అలవోకగా కట్టేస్తున్నారు. ఎత్తైన కొండల్లో అద్భుతమైన బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. సముద్రంలో భారీ నిర్మాణాలను కూడా చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ బిల్డింగ్, టవర్ నిర్మించినా.. దానికి పునాది భూమి నుంచే మొదలయ్యేది. ఎంత పెద్ద బిల్డింగ్ అయినా.. భూమిలో పునాది లేకుండా నిర్మించడం కష్టం. కానీ ఇప్పుడు భూమితో సంబంధం లేకుండానే.. గాల్లోనే ఒక నగరం లాంటి పెద్ద భవనం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఏకంగా అంతరిక్షం నుంచే ఏర్పాటు చేసిన కేబుల్స్ సాయంతో ఆ భవనం గాలిలో వేలాడనుంది. ఇప్పటికే అంతరిక్షంలో మనుషులు నివసించేందుకు ప్రయోగాలు జరుగుతున్నాయి. అదే సమయంలో అంతరిక్షం, భూమిని కలుపుతూ.. ఈ భవనాన్ని నిర్మాణం చేయడం విశేషం.

**అసలేంటీ ఆకాశ భవనం?**

అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన క్లౌడ్స్ ఆర్కిటెక్చర్ ఆఫీస్ అనే ఒక ఆర్కిటెక్చరల్ సంస్థ.. సరికొత్త ఆలోచనతో యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అంతరిక్షంలో ఉండే ఒక గ్రహశకలం (ఆస్టరాయిడ్) నుంచి కిందికి వేలాడదీసినట్లు ఉండే ఒక స్కైస్క్రాపర్ నిర్మాణానికి సంబంధించిన నమూనాను ప్రతిపాదించింది. అంతేకాకుండా దానికి అనలెమ్మ టవర్ అని పేరు కూడా పెట్టింది.

**అనలెమ్మ టవర్ నిర్మాణం ఎలా?**

క్లౌడ్స్ ఆర్కిటెక్చర్ ఆఫీస్ వెల్లడించిన వినూత్న డిజైన్ ప్రకారం.. ఈ టవర్‌ను భూమికి 50 వేల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోని ఒక ఆస్టరాయిడ్ నుంచి అత్యంత దృఢమైన కేబుల్స్ సాయంతో వేలాడదీస్తారు. ఆ ఆస్టరాయిడ్ భూమి చుట్టూ ఉన్న కక్ష్యలో తిరుగుతూ ఉంటుంది. సాధారణంగా భవనాలకు భూమిపై పునాది ఉంటే.. వాటన్నింటికంటే కొత్తగా ఈ అనలెమ్మ టవర్ పునాదులు అంతరిక్షంలో ఉంటాయన్నమాట. ఇలాంటి నిర్మాణాలను యూనివర్సల్ ఆర్బిటల్ సపోర్ట్ సిస్టమ్ (యూఓఎస్ఎస్) అని పిలుస్తున్నారు. ఇది స్పేస్ ఎలివేటర్ సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుందని ఆ సంస్థ చెబుతోంది.

**అనలెమ్మ టవర్ ఎలా పనిచేస్తుంది?**

ఈ అనలెమ్మ టవర్ భూమిపై స్థిరంగా ఉండకుండా.. ప్రతీ క్షణం అంతరిక్షం నుంచి భూమిపైకి వేలాడుతూ ఉంటుంది. ఆ ఆస్టరాయిడ్ కక్ష్యలో ప్రయాణం చేస్తున్నపుడు.. ఆ టవర్ కూడా భూమిపై ఒక కదులుతూ ఉంటుంది. ఈ ఆస్టరాయిడ్ భూమి చుట్టూ నిత్యం ఒక 8 ఆకారంలో తిరుగుతుంది. ఈ మార్గాన్ని అనలెమ్మ అంటారు. ఇలా ఆ టవర్ 24 గంటల్లో భూమిపై న్యూయార్క్, దుబాయ్ , పనామా వంటి నగరాల మీదుగా ప్రయాణిస్తూ ఉంటుంది. ఈ అనలెమ్మ టవర్.. 8 ఆకారంలో తిరిగే మార్గంలో అత్యంత నెమ్మదిగా ప్రయాణించే ప్రదేశాలు న్యూయార్క్ నగరంతో పాటు ఉత్తర, దక్షిణ అర్ధగోళాల మధ్య ఉంటాయని చెబుతున్నారు. అలా నెమ్మదిగా కదిలే సమయంలో.. ఆ భవనంలో ఉన్నవారు భూమిపై ఉన్న ప్రాంతాలతో అనుసంధానం కావడానికి అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ ప్రయాణంలో ఆ టవర్‌లో ఉన్నవారికి భూమిపైన ఉన్న ప్రాంతాలు అద్భుతంగా కనిపిస్తాయి.

**అనలెమ్మ టవర్ నిర్మాణం ఎక్కడ?**

ఈ అనలెమ్మ టవర్‌ను దుబాయ్‌లో నిర్మించాలని క్లౌడ్స్ ఆర్కిటెక్చర్ ఆఫీస్ సంస్థ ప్రతిపాదించింది. ఇప్పటికే ఆకాశాన్నంటే ఎత్తైన భవనాలను నిర్మించడంలో దుబాయ్ ఆరితేరింది. అంతేకాకుండా.. న్యూయార్క్‌లో నిర్మించడానికి ఖర్చు ఎక్కువవుతుందని ఆ సంస్థ భావిస్తోంది. దుబాయ్‌తో పోలిస్తే న్యూయార్క్‌లో నిర్మాణ ఖర్చు 5 రెట్లు ఉంటుందని పేర్కొంది. ఇక ఈ అనలెమ్మ టవర్ అంతరిక్షంలో తేలియాడే బిల్డింగ్ కావడంతో.. ఎక్కడైనా నిర్మించి.. దాన్ని ఎక్కడికి కావాలంటే అక్కడికి తరలించవచ్చని ఆ సంస్థ వెల్లడించింది.

**అనలెమ్మ టవర్ ప్రత్యేకతలు**

ఒక నగరం, ఒక స్పేస్ క్రాఫ్ట్‌ను కలిపితే ఎలా ఉంటుందో.. ఈ అనలెమ్మ టవర్ కూడా అలాగే ఉంటుంది. ఈ టవర్ కింది ఫ్లోర్లలో ఇళ్లు, ఆఫీసులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉంటాయి. పై అంతస్తుల్లో రీసెర్చ్, టూరిజం, ఆధ్యాత్మిక కేంద్రాల కోసం ఉపయోగించుకోవచ్చు. ఈ అనలెమ్మ టవర్‌కు అవసరమైన కరెంటు సరఫరా అంతరిక్షంలోని సోలార్ ప్యానెల్స్ ద్వారా అందించనున్నారు. భూ వాతావరణం పైన ఉండే ఈ సోలార్ ప్యానెల్స్‌కు నిరంతరం సూర్యరశ్మి లభించడం వల్ల విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదు. ఇక వర్షపు నీరు, మేఘాల నుంచి సేకరించిన నీటితో ఆ టవర్‌లో కావాల్సిన అవసరాలకు వాడుకుంటారు. నీటిని ఫిల్టర్ చేసి, రీసైకిల్ చేసిన తర్వాత వినియోగిస్తారు. ఇక ఈ టవర్‌లో ఉండే లిఫ్ట్‌లకు కేబుల్స్ కాకుండా.. ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎలివేటర్లను ఉపయోగించనున్నారు.

## టీసీఎస్‌లో 12,000 ఉద్యోగాల కోత!




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోనే అతి పెద్ద ఐటీ సేవల ఎగుమతి సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టీసీఎస్).. భారీస్థాయిలో ఉద్యోగాల ఊచకోతకు సిద్ధమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తన సిబ్బందిని 2 శాతం మేర తగ్గించుకోనున్నట్టు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఆ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 2% అంటే.. 12,200 మందికి పైగానే (మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069)!! ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, కృత్రిమ మేధ కారణంగా సాంకేతిక పరిజ్ఞానాలు మారుతున్న నేపథ్యంలో వ్యాపార గిరాకీ తగ్గిపోతుండడంతో ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. "టీసీఎస్.. భవిష్యత్తు పరిణామాలకు సిద్ధంగా ఉండే సంస్థగా మారే ప్రయాణంలో ఉంది. ఆ ప్రయాణంలో భాగంగా.. సంస్థకు ఉపయోగపడని ఉద్యోగులను ఏడాది వ్యవధిలో తొలగిస్తాం. ఈ ప్రభావం మా అంతర్జాతీయ సిబ్బందిలో 2% మందిపై.. ముఖ్యంగా మధ్య స్థాయి, సీనియర్ గ్రేడ్ ఉద్యోగులపై పడుతుంది" అని ఆ సంస్థ తన ప్రకటనలో వివరించింది. టీసీఎస్ సేవలను పొందేవారికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా, తమ సేవలపై ఎలాంటి ప్రభావం పడకుండా.. ఉద్యోగాల కోతకు ప్రణాళికలు రచించినట్టు వెల్లడించింది.

ఉద్యోగాలు కోల్పోయే తమ సిబ్బందికి ఇది కష్టకాలమేనన్న సంగతి తమకు తెలుసునని.. వారి సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూనే కొత్త ఉద్యోగాలు వెతుక్కునేందుకు అన్ని రకాలుగా సాయం చేస్తామని టీసీఎస్ పేర్కొంది. ఈ డ్రైవ్‌లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయేవారికి వారి నోటీ సు కాలానికి సంబంధించిన జీతాలు చెల్లించడమే కాక.. కోత ప్యాకేజీ కింద మరికొంత అదనంగా ఇస్తామని తెలిపింది. వారికి బీమా ప్రయోజనాలను కూడా పొడిగించే అవకాశాలను పరిశీలిస్తామని.. 'ఔట్‌ప్లేసమెంట్ ఆపర్చునిటీస్ (అంటే కొత్త ఉద్యో గం పొందడానికి వీలుగా రెజ్యూమ్ తయారు చేసుకోవడంలో, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం, కౌన్సెలింగ్ వంటి సహాయాలు)' అందిస్తామని వెల్లడించింది. టీసీఎస్ సంస్థ ఇటీవలే తన 'ఎంప్లాయ్‌మెంట్ బెంచ్ పాలసీ'ని సవరిస్తూ తీసుకున్న నిర్ణయంపై కొందరు ఉద్యోగులు లీగల్ కంప్లైంట్లు దాఖలు చేసిన కొద్దిరోజులకే ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సవరించిన 'ఎంప్లాయ్‌మెంట్ బెంచ్ పాలసీ' ప్రకారం.. టీసీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు ఏడాదికి గరిష్ఠంగా 35 రోజులు మాత్రమే బెంచ్‌పై (ఏ ప్రాజెక్టులోనూ లేని సమయం) ఉండాలి. అలాగే.. ఏటా కనీసం 225 రోజుల 'బిల్లబుల్ డేస్ (అంటే డబ్బులు వచ్చే ప్రాజెక్టుపై) పనిచేయాలి. అలా లేనివారిపై చర్యలు తీసుకునే విధంగా కొత్త విధానం ఉంది. కాగా.. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేవలం ఖర్చులను తగ్గించుకోవడానికి తీసుకున్న నిర్ణయంగా కాక, సంస్థ వ్యూహాత్మక మార్పు (స్ట్రాటజిక్ షిఫ్ట్)గా చూడాలని నిపుణులు భావిస్తున్నారు. టీసీఎస్ సీఈవో కృతివాసన్ సైతం ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని వెల్లడించారు. ఏఐ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా పనిచేసే తీరు మారుతోందని.. ఈ నేపథ్యంలో తాము భవిష్యత్తుకు సిద్ధంగా, వేగంగా స్పందించగలిగేలా ఉండాలని ఆయన వివరించారు.

## మామ, అల్లుడి గొడవ.. ఆపడానికి వెళ్లిన కానిస్టేబుల్‌పై దారుణం..

**న్యూఢిల్లీ-నవభూమి:** మంచి చేయడానికి పోతే చెడు ఎదురు కావటం అంటే ఇదే. మామ, అల్లుడి మధ్య గొడవ ఆపడానికి వెళ్లిన ఓ కానిస్టేబుల్‌కు ఊహించని షాక్ తగిలింది. కానిస్టేబుల్ కత్తి దాడికి గుంయ్యాడు. ఈ సంఘటన కర్ణాటకలోని బెంగళూరులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చామరాజపేట్, వాల్మీకి నగర్‌కు చెందిన మహ్మద్ సఫివుల్లా కూతురికి అదే ప్రాంతానికి చెందిన తర్బజ్ పాషాకు కొన్నేళ్ల క్రితం పెళ్లయింది. అయితే, గొడవల కారణంగా ఎక్కువకాలం కలిసి ఉండలేకపోయారు.కొన్ని నెలల క్రితం విడాకులు తీసుకుని విడిపోయారు. ఈ నేపథ్యంలోనే మహ్మద్ సఫివుల్లా తన కూతురికి రెండో పెళ్లి చేయడానికి సిద్ధమయ్యాడు. ఈ విషయం పాషాకు తెలిసింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. మామ ఇంటి దగ్గరకు వచ్చి గొడవ పెట్టుకున్నాడు. మామ, అల్లుడి గొడవ చినికి చినికి గాలి వానలా మారింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకోసాగారు. దాడి సందర్భంగా పాషా ఓ బాటిల్‌తో మామ తల పగుల గొట్టాడు. అదే ప్రాంతంలో పాట్రోలింగ్‌లో ఉన్న పోలీసులకు గొడవ సమాచారం వెళ్లింది.కానిస్టేబుల్ సంతోష్ సంఘటనా స్థలానికి వెళ్లాడు. గొడవ ఆపే ప్రయత్నం చేశాడు. సైకోలా మారిన పాషా సంతోష్‌పై దాడికి దిగాడు. తన దగ్గర ఉన్న కత్తితో కానిస్టేబుల్‌ను పొడిచేశాడు. అనంతరం అక్కడినుంచి పారిపోయాడు.



## ఔషధ అక్షర దార

ప్రకృతిలో మనకు ఉపయోగపడేవి ఎన్నో ఉంటాయి. కానీ వాటి గురించి మనకు పెద్దగా తెలియదు. అలాంటి ఒక మొక్క 'అక్షర దార'. ఇది పలు అనారోగ్యాలకు ఔషధంగానే కాక మరెన్నో ప్రయోజనాలు అందిస్తుంది. ఆ మొక్క గురించి తెలుసుకుందాం..నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ 'అక్షర దార' మొక్క మనగలుగుతుంది. ఈ మొక్కకు 'స్ట్రెబ్లస్ ఆస్పర్' అని శాస్త్రీయ నామం ఉంది. ఈ మొక్కను శాండ్ పేపర్ ట్రీ అని కూడా అంటారు. ఇది భారతదేశంతో పాటు శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం, మలేషియా, కంబోడియా, ఫిలిప్పీన్స్.. పలు దేశాల్లో పెరుగుతుంది. ఈ మొక్క దట్టంగా 4-15 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. దీని ఆకులు అండాకారంలో ఉంటాయి. ఈ మొక్క పువ్వుల నుంచి అండాకారం కాయలు కాస్తాయి. అవి పండిన తరువాత పసుపు రంగులోకి మారతాయి. ఈ మొక్క ఆకులను, బెరడును సంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారు. పంటి నొప్పి, విరేచనాలు, పాముకాటు.. మొదలైన వాటికి విరుగుడుగా కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ వంటి ఇరవైకి పైగా బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నాయి. ఆ మొక్క బెరడు క్రిమిసంహారకంగా ఉపయోగపడుతుంది. అలాగే 'అక్షర దార'తో చీజ్ తయారీ కోసం పాలను గడ్డకట్టించే ప్రోటీజ్ ఉంటుంది. దీని ఆకులను పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. దీని వలన పాల దిగుబడి పెరుగుతుంది. అలాగే ఈ ఆకులు జంతువులలో రుమెన్ కిణ్వ ప్రక్రియను ప్రోత్సహిస్తాయి.



# మన ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అందుకున్న సౌదీ మహిళ.. ఈమె గురించి మీకు తెలుసా!

**భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అందుకున్న సౌదీ మహిళ.. ఈమె గురించి మీకు తెలుసా! నవూఫ్ అల్మరీ.. సౌదీ అరేబియాలో తొలి యోగాచార్యురాలు. యోగా దినోత్సవం నాడు పదివేల మందితో పెద్ద ఎత్తున ఉత్సవం నిర్వహించి రికార్డు సృష్టించారు. సౌదీ ప్రజలు స్వతహాగా ఫిట్‌నెస్ ప్రియులు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తారు. దీంతో తన పని సులభమైందని చెబుతారు నవూఫ్. 'యోగా మనసును శుద్ధి చేస్తుంది.**



నవూఫ్ అల్మరీ.. సౌదీ అరేబియాలో తొలి యోగాచార్యురాలు. యోగా దినోత్సవం నాడు పదివేల మందితో పెద్ద ఎత్తున ఉత్సవం నిర్వహించి రికార్డు సృష్టించారు. సౌదీ ప్రజలు స్వతహాగా ఫిట్‌నెస్ ప్రియులు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తారు. దీంతో తన పని సులభమైందని చెబుతారు నవూఫ్. 'యోగా మనసును శుద్ధి చేస్తుంది. హింసాత్మక ఆలోచనలను బుర్రలోంచి తొలగిస్తుంది. ఆధునిక సమాజానికి అవసరమైంది ఇదే' అని వివరిస్తారామె. తను చేపట్టిన యోగా ప్రచార ఉద్యమానికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 2018లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. నవూఫ్ దృష్టిలో మత విశ్వాసాలకు, దేశాల సరిహద్దులకు అతీతమైంది యోగా.


'సౌదీ తర్వాత భారతదేశమే నా మాతృభూమి. ఈ దేశం నాకు జ్ఞానాన్ని ప్రసాదించింది. నాలోని నన్ను తెలుసుకునే అవకాశం ఇచ్చింది' అని ఉద్వేగంగా చెబుతారు. సౌదీ ప్రభుత్వం తమ దేశంలో యోగా క్లాసులను అనుమతించడానికి ముందు చాలా కసరత్తు చేసింది. అనేక అధ్యయనాల తర్వాతే.. పచ్చజెండా ఊపింది. 'ఆయుర్వేద విజ్ఞానాన్ని సౌదీ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నది నా ఆలోచన. నా తదుపరి ప్రయత్నం ఆ వైపుగానే ఉంటుంది' అంటూ భవిష్యత్ ప్రణాళిక వివరిస్తారు నవూఫ్. తాజా భారత పర్యటనలో భాగంగా ఆమె కోణార్క్‌లోని సూర్య దేవాలయాన్ని సందర్శించారు. ఆ శిల్ప కళా సంపదను రాతితో మలిచిన కావ్యంగా అభివర్ణించారు.

## నీళ్ల బాటిళ్లు ఇలా శుభ్రం



పాఠశాలలకు, ఆఫీసులకు లేదా బయటకు వెళ్లేటప్పుడు వెంట మంచినీళ్ల బాటిల్‌ను తీసుకెళ్తాం. అందులో ఉండేది నీళ్లే కదా అని బాటిళ్లను తరచూ శుభ్రం చేయరు. దాంతో బ్యాక్టీరియా చేరి బాటిళ్లు వాసన వస్తాయి. కాబట్టి నీళ్ల బాటిళ్లను తరచూ సులువుగా ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం..బాటిల్‌లో రెండు టేబుల్ స్పూన్‌ల బేకింగ్ సోడా లేదా ఉప్పు వేసి, కొంచెం నీరు పోసి మూతపెట్టి బాగా కదపాలి. తరువాత బ్రష్‌తో బాటిల్‌ను రుద్ది శుభ్రం చేయాలి.కొంచెం నిమ్మరసాన్ని బాటిల్‌లో పోసి మూతపెట్టి బాగా కదిపి మంచి నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే దుర్వాసన దూరం అవుతుంది.ఒక టేబుల్ స్పూన్ వెనిగర్, కొంచెం నీరు పోసి పదిహేను నిమిషాల తరువాత బాటిల్‌ను బాగా కదిపి నీటితో శుభ్రం చేయాలి.ఒక టీ బ్యాగ్‌ను బాటిల్‌లో వేసి గోరువెచ్చని నీరు పోసి రాత్రంతా అలా వదిలేసి ఉదయాన్నే బ్రష్‌తో రుద్ది కడగాలి.అలాగే బాటిల్ మూతను శుభ్రం చేసే విషయంలోనూ శ్రద్ధ వహించాలి. మూతను సబ్బు నీటిలో బాగా కడగాలి.కొన్ని బాటిళ్లకు పాస్లిక్ సీల్ ఉంటాయి. ఆ సీల్‌ను తొలగించి శుభ్రం చేస్తే మంచి ఫలితముంటుంది.బాటిల్‌ను శుభ్రం చేసి తడి పూర్తిగా ఆరే వరకు మూత పెట్టకూడదు. అలాగే ఇంటికి వచ్చాక బాటిల్‌లో మిగిలిన నీటిని పారబోసి నీటితో శుభ్రం చేసి పూర్తిగా ఆరాకే మూత పెట్టాలి.

# ఆర్థిక మంత్రం.. అందరికీ ఒకేలా పారదు



మన భవిష్యత్తును నిర్ణయించేది మనం సంపాదించే డబ్బు కాదు.. మన పెట్టుబడులే! ఇన్వెస్ట్‌మెంట్ అనగానే.. లాభాలను ఊహించేస్తుంటారు. ఇందుకోసం ఆర్థికవేత్తలు సూచించిన ఫార్ములాలను పాటిస్తుంటారు. వయసు ఎంత ఉంటే అంత డెట్‌లో దాచాలనీ, వందలోంచి వయసు తీసేయగా వచ్చిన మొత్తం ఈక్విటీలో పెట్టాలనీ ఫిక్సయిపోతారు. మరికొందరేమో.. నికర ఆస్తిలో ఇంత మొత్తం పెట్టుబడిగా పక్కన పెట్టాలని భావిస్తారు. కానీ, పర్పస్ లేకుండా ఇన్వెస్ట్ చేసే డబ్బులు అవసరానికి అక్కరకు రాకుండా పోతాయని గుర్తెరగాలి. అన్నిటికీ మించి పేరుమోసిన ఆర్థికవేత్తలు సూచించిన విధానాలు కూడా సర్వజనీనం, సర్వకాలీనం కాదని గుర్తుంచుకోవాలి. ప్రమోద్, ప్రణీత్ పరిస్థితులు దీనిని తేటతెల్లం చేస్తాయి.ప్రమోద్‌ది ఎగువ మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఇద్దరికీ పెన్షన్ వస్తుంది. ఊళ్లో సొంతింట్లో ఉంటారు. అక్కడ పొలం చూసుకుంటూ.. శేష జీవితం హాయిగా గడుపుతున్నారు. తల్లిదండ్రుల బాధ్యత ప్రమోద్‌కు లేదు. నెలకు ఒకసారి ఫ్యామిలీతో ఊరికి వెళ్తాడు. రెండు రోజులు సరదాగా గడిపి తిరుగు ప్రయాణం అవుతాడు. అతగాడి నెల వేతనం రూ.80 వేలు. భార్య కూడా ఉద్యోగం చేస్తుంది. ఆమెకు నెలకు రూ.80 వేలు వస్తుంది. హైదరాబాద్‌లో ఫ్లాట్ కొంటానంటే.. పాతిక లక్షలు తల్లిదండ్రులు సర్దుబాటు చేశారు. మరో రూ.40 లక్షలు లోన్ తీసుకున్నాడు. భార్య, తన సేవింగ్స్‌తో రిజిస్ట్రేషన్, వుడ్‌వర్క్ చేయించాడు. ఇద్దరి జీతంలో పావువంతు ఈఎమ్ఐ చెల్లిస్తున్నాడు ప్రమోద్.ఇక ప్రణీత్ విషయానికి వద్దాం! అతనూ ప్రమోద్ పనిచేసే సంస్థలోనే ఉద్యోగి. జీతం నెలకు రూ.90 వేలు. భార్య చిన్న ఉద్యోగం చేస్తుంది. ఆమెకు రూ.30 వేల వరకు వస్తాయి. ప్రణీత్ తల్లిదండ్రులు కొడుకుతోపాటే ఉంటారు. వయసు పైబడటంతో ఇద్దరికీ చిన్నపాటి అనారోగ్య సమస్యలు ఉన్నాయి. పైగా అతని తండ్రి ప్రైవేట్ సంస్థలో గుమాస్తాగా పనిచేసి రిటైర్ అయ్యాడు. కుటుంబ బాధ్యతలు, పిల్లల చదువులకు అతని సంపాదన అంతంత మాత్రంగా సరిపోయేది. వెనక వేసిందేమీ లేదు. పైగా చెల్లెలు పెండ్లి బాధ్యత ప్రణీత్‌దే! ఉద్యోగం చేస్తున్న చెల్లి సంపాదనను ఆమె పేరిట జాగ్రత్త చేసేవాడు. ప్రణీత్ దంపతుల సంపాదన ఇంటి వ్యవహారాలు, ఇద్దరి పిల్లల చదువులకు సరిపోయేది! చిన్నాచితకా చీటీలు, పాలసీలు గట్రా మినహా పెద్దగా ఇన్వెస్ట్ చేసేందుకు కూడా అతని దగ్గర ఏం లేవు.ఈ ఇద్దరూ ఒకే వయసు వారు. సంపాదన విషయంలోనూ ఇద్దరిదీ ఒకే రేంజ్. కానీ, ప్రమోద్ తన జీతంలో పాతిక శాతం రకరకాల మార్గాల్లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. తండ్రి సపోర్ట్‌తో ఊళ్లో పొలంలో పామాయిల్ తోట వేశాడు. భార్య పేరిట గోల్డ్ స్కీమ్ కడుతున్నాడు. ఆడంబరాలకు పోకుండా, అదే సమయంలో కక్కుర్తి పడకుండా%ూ% పొదుపు, మదుపు చేస్తూనే జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు. ప్రమోద్ లీడ్ చేస్తున్న జీవితం ప్రణీత్‌కు సాధ్యం అవుతుందా! ఆర్థికవేత్తలు సూచించిన ఇన్వెస్ట్‌మెంట్ ఫార్ములాలు ఇద్దరికీ ఒకేలా వర్తించవు కదా!

# అందరి కోసం.. ఓ యంగ్ సైంటిస్ట్!



ఉస్మానియా క్యాంపస్ నుంచి ఆడియాలజీలో పీజీ చేసిందో అమ్మాయి.గురుగ్రామ్‌లోని మేదాంత హాస్పిటల్‌లో రీసెర్చ్ చేసే అవకాశమూ దక్కించుకుంది. ఆ అనుభవాన్ని నిరుపేదలసేవకు ఉపయోగిస్తున్నది. అంతేకాదు, డిస్‌ఫేజియా అనే వ్యాధి మీద పరిశోధనచేస్తూనే.. హైదరాబాద్‌లోనివైద్య విద్యార్థులకు తాను తెలుసుకున్న విషయాలను బోధిస్తున్నది. ఆ సేవలకు గానుఇటీవల ఢిల్లీ ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా యంగ్ సైంటిస్ట్ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ కర్పూరం గోవతి నిఖిల తన ప్రయాణాన్ని 'జిందగీ'తో పంచుకున్నదిలా

ఆడపిల్లలను గౌరవంగా చూసే వృత్తిలోనే స్థిరపడాలని చిన్నప్పటి నుంచీ ఉండేది. అంతటి గౌరవం వైద్యులకే దక్కుతుంది. డాక్టరు కనిపిస్తే జనం చేతులెత్తి మొక్కుతారు. మా తాతయ్య కూడా 'నువ్వు డాక్టర్ కావాలి. నేను నీకు తలుపు తీయాలి అని ఎప్పుడూ చెప్పేవారు. డాక్టర్ అయితే లేనివాళ్లకు సాయపడవచ్చనీ అనేవారు. అలా నా మనసులో వైద్యవృత్తి మీద గొప్ప భావన ఏర్పడింది. అయితే, ఎంబీబీఎస్ చదవడం కష్టమని నా తల్లిదండ్రుల అభిప్రాయం. నాకేమో మెడికల్ ఫీల్డ్‌కు రావాలని కోరిక. అందుకే, ఎలాగోలా ఇంట్లో వాళ్లను ఒప్పించి ఉస్మానియా యూనివర్సిటీలో ఆడియాలజీ కోర్సులో చేరాను.

అక్కడే పీజీ కూడా పూర్తి చేశాను. వెంటనే, మేదాంత హాస్పిటల్స్ నుంచి ఫోన్ వచ్చింది. మన దేశంలో ఎయిమ్స్ తర్వాత అంతపెద్ద దవాఖాన అదే. ఉద్యోగమే కాదు, రీసెర్చ్ చేసేందుకు కూడా ఎన్నో అవకాశాలు ఉంటాయి. కానీ అది ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో ఉంది. అంత దూరమంటే ఇంట్లో ఒప్పుకోరని భయం. అందుకే, ఢిల్లీ చూద్దామన్నట్టు అమ్మమ్మను తీసుకొని వెళ్లాను. అక్కడికి వెళ్లాక ఆ వాతావరణం నాకెంతో నచ్చింది. దాంతో, అమ్మానాన్నలను ఒప్పించి చేరిపోయాను.

**ఆరువేల మందికి సేవ..**

మేదాంత నా కెరీర్‌ను మలుపు తిప్పింది. రకరకాల సమస్యలతో పేషెంట్లు వచ్చేవారు. ముక్కులో నుంచి ఆహార పైపులు వేసుకున్న వాళ్లూ కనిపించేవారు. వాళ్లలో చాలామంది డిస్‌ఫేజియా అనే సమస్యతో బాధపడుతున్నారని అక్కడికి వెళ్లాకే తెలిసింది. డిస్‌ఫేజియా అంటే మింగడంలో ఇబ్బంది. నరాల సమస్యలు ఉన్నవాళ్లు,



హృద్రోగులు, క్యాన్సర్ పేషెంట్లు%ూ% ఇలా చాలా మంది ఈ సమస్యను ఎదుర్కొంటారు. ఇలాంటి ఇబ్బందినే తన చివరి దశలో తాతయ్య కూడా అనుభవించారు. పక్షవాతం వచ్చాక ఆహారాన్ని మింగలేకపోయేవారు. ఇలాగే పైపు వేయాల్సి వచ్చింది. మేదాంతలోనూ అలాంటి వాళ్లు కనిపించేసరికి సమస్య మూలాలు తెలుసుకోవాలనే ఆత్రుత పెరిగింది. సంబంధిత కోర్సు చేశాను. తాతయ్యలాంటి చాలా మందికి సేవ చేసే అవకాశం వచ్చింది.

ఆ బాధ్యతలకు న్యాయం చేస్తూనే.. డిస్‌ఫేజియాకు సంబంధించి 35 దాకా పరిశోధన పత్రాలు సమర్పించాను. అవన్నీ వివిధ వైద్య పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఈ రీసెర్చ్ చేసే క్రమంలో పరిచయాలూ పెరిగాయి.


వాటిని సమర్థంగా ఉపయోగించుకుని నలుగురికీ సాయం చేయాలనే ఆశయంతో గోవతి హెల్త్‌కేర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. కొవిడ్ సమయంలో ఎన్నో ఆసుపత్రులకు ఉచితంగా ఆక్సిజన్ సిలిండర్లు అందించాను.

నాన్న సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో రేషన్ డీలర్ కావడంతో, ఆ సర్కిల్ మొత్తంలోని డీలర్లకు కొవిడ్ కిట్స్ అందించాను. మిత్రుల సాయంతో వంద దాకా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించాను. గుండె, మోకాళ్ల చికిత్సలకు, ప్లాస్టిక్ సర్జరీలకు సాయం చేశాను. మా నాన్న దగ్గరికి వచ్చేవాళ్లంతా పేదలు కాబట్టి, వాళ్ల అవసరాలను బట్టి రకరకాల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తాను. మొత్తంగా నా ఫౌండేషన్ ద్వారా ఇప్పటికి ఆరువేల మందికి పైగా సేవలందించాను.

**అదే నా ఆశ**

సెలవులకు ఇంటికొచ్చిన ప్రతిసారీ నేను మేదాంతలో నేర్చుకున్న వివిధ అంశాలను హైదరాబాద్‌లోని మెడికల్ స్టూడెంట్స్‌కు బోధిస్తుంటాను. ఉస్మానియా కాలేజీ, హెలెన్ కెల్లర్, స్వీకార్ ఉపకార్, ఏవైజేఎన్ఐహెచ్‌హెచ్‌లాంటి ఇన్‌స్టిట్యూట్స్ ఇందులో ఉన్నాయి. డిస్‌ఫేజియా చికిత్సలో ఏ వైపు నుంచి ఏ అవసరం ఉన్నా ఫోన్‌లో అందుబాటులో ఉంటాను. నాదైన రంగంలో ప్రతిభ కనబరిచినందుకు యంగెస్ట్ రీసెర్చర్ ఇన్ డిస్‌ఫేజియాగా ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నాకు చోటు దక్కింది. ఢిల్లీకి చెందిన ఎన్జీవోలు ఇచ్చే భారత గౌరవ రత్న అవార్డు, యంగ్ సైంటిస్ట్ అవార్డు సహా చాలా పురస్కారాలు అందుకున్నాను.

## వర్షాకాలంలో మొక్కలు పదిలంగా



మనం ఇంటి చుట్టూ, బాల్కనీలో, మేడపైన రకరకాల మొక్కలు పెంచుకుంటూ ఉంటాం. పెద్ద పెద్ద చినుకులు పడినా, గాలి బలంగా వీచినా ఈ మొక్కలకు నష్టం కలుగవచ్చు. కాబట్టి వర్షాకాలంలో మొక్కల సంరక్షణకు సంబంధించి తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.నిరంతరం కురిసే వర్షాల వల్ల ఒక్కోసారి కాండం, ఆకులు, పువ్వులు కుళ్లిపోవడాన్ని చూస్తూ ఉంటాం. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. లేదంటే క్రిమికీటకాలు చేరి మొక్కను బలహీనపరుస్తాయి.గాలి బలంగా వీస్తే మొక్కలు, వాటి కొమ్మలు వంగిపోతుంటాయి. అలాకాకుండా మొక్కలకు సమీపంలో పొడవైన కర్ర లేదా చెక్కను ఆధారంగా నిలబెట్టాలి. సన్నని దారంతో దానికి మొక్కను జతచేయాలి.వర్షాకాలంలో తరచూ మొక్కలకు నీళ్లు పోయాల్సిన అవసరం ఉండదు. కుండీల్లో అయితే నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కుండీ అడుగున ఉండే రంధ్రం మూసుకుపోకుండా చూడాలి.

ఇంటి చుట్టూ, మేడ మీద తోట పెంచుతున్నట్లయితే మొక్కల మొదళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలి. వర్షపు నీరు ఎక్కడా ఆగకుండా ప్రవహించేలా ఏర్పాటు చేసుకోవాలి.

వర్షాలు కురవగానే మొక్కలకు చిగుర్లు వస్తుంటాయి. ఈ సమయంలో పండ్లు, కాయగూరల నుంచి వచ్చే వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారు చేసి మొక్కలకు అందించాలి. వాడేసిన కాఫీ, టీ పొడులను ఒకసారి మంచినీళ్లతో కడిగి మట్టిలో కలపవచ్చు. ఇలా చేయడం వల్ల మొక్క ఏపుగా పెరుగుతుంది.

ఆగకుండా కురిసే వర్షాల వల్ల మొక్కల మొదట్లో మట్టి పక్కకు జరుగుతుంది. దీంతో మొక్కల వేళ్లు బయటికి వచ్చేస్తుంటాయి. అలాంటప్పుడు వర్షం తగ్గగానే వేళ్లమీదికి మట్టిని జరపాలి. అలాగే తేలికపాటి ఎరువులను కూడా అందించాలి.

ఆకుకూరలు, పూలమొక్కలు ఎక్కువగా వర్షానికి ప్రభావితమవుతాయి. ఇంటి చుట్టూ లేదా మిద్దె తోటలో ఈ మొక్కలు ఎక్కువగా ఉన్నట్లయితే వాటిమీద వర్షం పడకుండా నెట్‌షీట్‌తో కూడిన రెయిన్ కవర్‌ను ఏర్పాటు చేయాలి. వర్షం తగ్గగానే రెయిన్ కవర్ తొలగిస్తే నెట్ షీట్ ద్వారా మొక్కలకు సూర్యరశ్మి అందుతుంది.

# మడమల్లో పగుళ్లా!



చలికాలం వస్తోందంటే కొంతమందికి అది ఒక పీడకలలాగే అనిపిస్తుంది. పాదాలు, మడమలు పగిలి రక్తం వెలికి రావడం, దాని తాలూకు నొప్పి, మంటలు కొందరికి నిజంగానే నరకాన్ని తలపిస్తాయి. నిజానికి ఈ సమస్యను చిన్నపాటి చిట్కా వైద్యాలతోనే అధిగమించవచ్చు. ముఖ్యంగా చలి కాలమంతా రోజుకు రెండు సార్లు మాయిశ్చరైజర్‌తో పాదాల్ని శుభ్రం చేసుకోవడం ఒక పద్ధతి. ఇలా చేయడం వల్ల పాదాలు ఎండిపోవడం గానీ, గరుకుగా మారడం గానీ ఉండదు. గోరు వెచ్చని నీళ్లల్లో కొంచెం తేనె వేసి, ఆ నీళ్లల్లో పాదాలు ఉంచితే పాదాలు పగుళ్లు పోయి మృదువుగా మారతాయి. ఆయుర్వేద శాస్త్రం, బ్యాక్టీరియా, సెప్టిక్ సమస్యల నుంచి మడమలు, పాదాల్ని కాపాడుకోవడానికి ఈ విధానాన్నే సూచిస్తుంది.తేనెలో మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడే గుణాలు కూడా ఉన్నాయి. వీటన్నింటితో పాటు, పాదాల పరిరక్షణలో ఆలివ్ ఆయిల్ పాత్ర కూడా కీలకలమే. పాదాలు పగుళ్లు బారిన చోట ఆలివ్ ఆయిల్‌తో మర్దనా చేస్తే ఆ భాగాల్లో రక్తప్రసరణ పెరుగుతుంది. చాలామంది స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్ మర్దనం చేసుకోవడంలోని ఉద్దేశం ఇదే. వీటితో పాటు చలికాలంలో పాదాలకు కాటన్ సాక్స్ వాడటం చాలా మేలు. ఇవి కాలుష్యాలనుంచి, దుమ్ము, ధూళినుంచి కాపాడతాయి. పాదాల్ని కాపాడటంలో హెర్బల్ క్రీములు బాగా ఉపయోగపడతాయి. ఈ క్రీమును గోరువెచ్చని నీళ్లతో కలిపి పాదాలు పగిలిన చోట పూయాలి. ఉదయం వేళల్లోనూ, నిద్ర కు ముందు ఇలా రోజుకు రెండు సార్లు ఈ క్రీమును వాడి తే మడమల, పాదాల బాధలు చాలా వరకు తగ్గిపోతాయి.

**కార్డియో ఎక్సర్‌సైజ్**

గుండె వేగం పెరిగేలా చేసే వ్యాయామాల వల్ల తక్కువ సమయంలో ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. ఇందుకోసం ఈ కార్డియో ఎక్సర్‌సైజెస్ బెస్ట్ ఛాయిస్. ట్రెడ్‌మిల్: ట్రెడ్‌మిల్ మీద పరిగెత్తగలిగేంత వేగం, గ్రేడ్ సెట్ చేసుకుని ఆగకుండా 20 ని.లు పరిగెత్తేకంటే మధ్యలో 3 ని.లపాటు వేగం తగ్గించి తిరిగి పెంచుతూ పరిగెత్తితే రెట్టింపు ఫలితం ఉంటుంది. సైడ్ జంప్: నిలబడ్డ చోటునుంచి కుడి, ఎడమ పక్కకు జంప్ చేసి తిరిగి యధాస్థానానికి రావాలి. ఇలా 20 సార్లు చేయాలి.స్పాట్ లెగ్ లిఫ్ట్: కాలు మడిచి పైకి లేపి తిరిగి దించేయాలి. అలా రెండో కాలితో కూడా చేయాలి. ఇలా వేగంగా 20 సార్లు చేసినప్పుడే ఫలితం ఉంటుంది.జంపింగ్ జాక్స్: రెండు కాళ్లు దూరంగా జరుపుతూ చేతులు కూడా పైకి లేపి ఎగరాలి. ఇలా జంపింగ్ జాక్స్ 25 చేయాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ మంగళవారం 29 । జులై । 2025




# సూచీలకు భారీ నష్టాలు.. 570 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్..




**ముంబై-నవభూమి:**విదేశీ మదుపర్లు అమ్మకాలకు పాల్పడుతుండడం, అంతర్జాతీయ మార్కెట్ల నష్టాలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపించాయి. గత శుక్రవారం విదేశీ మదుపర్లు 1976 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించడం నెగిటివ్‌గా మారింది. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ ఆలస్యం అవుతుండడం కూడా మదుపర్లను కలవరపెడుతోంది. అలాగే పలు కంపెనీలు వెలువరిస్తున్న త్రైమాసిక ఫలితాల నిరాశజనకంగా ఉండడంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి.
గత శుక్రవారం ముగింపు (81, 463)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఉదయం కాసేపు లాభనష్టాలతో దోబూచులాడింది. అయితే మధ్యాహ్నం తర్వాత మదుపర్లు అమ్మకాలకు దిగడంతో సెన్సెక్స్ కోలుకోలేదు. చివరకు సెన్సెక్స్ 572 పాయింట్ల నష్టంతో 80, 891 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే నడించింది. చివరకు 156 పాయింట్ల నష్టంతో 24, 680 వద్ద రోజును ముగించింది.

## మీ డబ్బును రెట్టింపు చేసే ఈజీ ఫార్ములా.. దీని గురించి తెలుసా మీకు




**న్యూఢిల్లీ-నవభూమి:**మీరు మీ డబ్బును పెంచుకోవాలని, రెట్టింపు చేసుకోవాలని ఆలోచిస్తున్నారా. అందుకు మీకోసం ఒక ఈజీ ట్రిక్ అందుబాటులో ఉంది. అదే రూల్ ఆఫ్ 72 ఈ ఫార్ములా మీ డబ్బు ఎంత సమయంలో రెట్టింపు అవుతుందో లెక్కలు లేకుండా క్షణాల్లో చెప్పేస్తుంది. అదే దీని స్పెషల్.

**రూల్ ఆఫ్ 72 అంటే ఏంటి?**
రూల్ ఆఫ్ 72 అనేది ఆర్థిక రంగంలో మనీ రెట్టింపు కావడానికి సులభంగా తెలుసుకునే పరిష్కార మార్గం. ఇది మీ పెట్టుబడిపై వచ్చే వడ్డీ రేటు ఆధారంగా డబ్బు రెట్టింపు కావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో అంచనా వేస్తుంది. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (%ఖీణ%), మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్ వంటి పథకాల్లో ఎక్కడ పెట్టుబడి పెట్టినా కూడా ఈ ఫార్ములా మీ డబ్బు ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.
ఉదాహరణకు మీరు ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ. 1 లక్ష పెట్టుబడి పెడితే అక్కడ మీకు సంవత్సరానికి 6% వడ్డీ వస్తుందని అనుకుందాం. దీని ప్రకారం లెక్కించే విధానంలో 72 ̥ 6 = 12 సంవత్సరాలు. అంటే మీ లక్ష రూపాయలు, 2 లక్షలుగా మారడానికి దాదాపు 12 సంవత్సరాలు పడుతుంది.

**ఇది ఎలా పని చేస్తుంది?**
ఈ ఫార్ములా కాంపౌండ్ వడ్డీ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది. కాంపౌండ్ వడ్డీలో మీరు పెట్టిన మొత్తంపై వచ్చే వడ్డీ మాత్రమే కాకుండా, ఆ వడ్డీపై కూడా మళ్లీ వడ్డీ యాడ్ అవుతుంది. ఇది మీ డబ్బును వేగంగా పెరిగేలా చేస్తుంది. రూల్ ఆఫ్ 72 ఈ పెరుగుదలను సులభంగా అంచనా వేయడానికి సహాయపడుతుంది.మరికొన్ని ఉదాహరణలు..మ్యూచువల్ ఫండ్ మీరు ఒక మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టారని భావిస్తే, అది సంవత్సరానికి సగటున 12% రాబడి ఇస్తుందని అనుకుందాం. లెక్కించే విధానం: 72 ̥ 12 = 6 సంవత్సరాలు. అంటే, మీ డబ్బు 6 సంవత్సరాల్లో రెట్టింపు అవుతుంది. అధిక రాబడి: మీ పెట్టుబడి సంవత్సరానికి 9% రాబడి ఇస్తే: 72 ̥ 9 = 8 సంవత్సరాలు. మీ డబ్బు 8 సంవత్సరాల్లో రెట్టింపు అవుతుంది.
ఈ ఫార్ములా ఎందుకు ఉపయోగకరం?
క్షణాల్లో మీ డబ్బు రెట్టింపు కావడానికి పట్టే సమయాన్ని తెలుసుకోవచ్చు బ్యాంక్ మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్ వంటి వివిధ పెట్టుబడి ఎంపికలను సరిపోల్చడానికి ఈ ఫార్ములా సహాయపడుతుంది.రూల్ ఆఫ్ 72, 6% నుంచి 10% మధ్య వడ్డీ రేట్లకు చాలా ఖచ్చితమైన ఫలితాలను ఇస్తుంది. చాలా ఎక్కువ (20% కంటే ఎక్కువ) వడ్డీ రేట్ల విషయంలో ఇది పూర్తిగా ఖచ్చితం కాకపోవచ్చు. కానీ దాదాపుగా అంచనాకు ఉపయోగపడుతుంది.

## బౌన్స్ బ్యాక్ అయితేనే..

**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. మార్కెట్లలో మళ్లీ బుల్ రన్ కొనసాగాలంటే ఇప్పటి స్థాయిలను అధిగమించాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా రాజకీయ పరిణామాలు మారుతుండటం, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవటం, వడ్డీ రేట్ల కోతలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవటం నెగటివ్ సెంటిమెంట్‌కు దారితీస్తోంది. నిఫ్టీ 50 డీఎంఏ, 25,000 దిగువకు రావటం కలవరపెడుతోంది.
డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: తాజా గరిష్ఠం రూ.1,379 నుంచి స్వల్ప దిద్దుబాటుకు లోనైన ఈ కౌంటర్ ప్రస్తుతం మెరుగ్గా చలిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ పెరుగుతోంది. పైగా ఫార్మా రంగ సూచీ బ్రేకౌట్ ఇచ్చింది. గత శుక్రవారం రూ.1,277 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,270/1,250 శ్రేణిలో ప్రవేశించి రూ,1350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,225 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్: ఈ షేరు నష్టాల మార్కెట్లోనూ మెరుగ్గా రాణించింది. గత శుక్రవారం రూ.1,921 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ,1,900 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. బై ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి. రూ.1,875 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.టొరెంట్ ఫార్మా: ఈ కౌంటర్ అత్యంత బలాన్ని ప్రదర్శిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ చాలా బాగున్నాయి. డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. పైగా జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. గత శుక్రవారం రూ.3,063 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,550/3,580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,550 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.ఎస్‌బీఐ లైఫ్: ఆరు నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. కీలకమైన నిరోధ స్థాయికి చేరుకుంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం రూ.1,832 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,770 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.సన్ ఫార్మా: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. ప్రస్తుతం అనిశ్చితి తగ్గింది. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,699 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,660/1,680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవాలి. అయితే రూ.1,640 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

## టెక్ వ్యూ 25000 వద్ద పునరుజ్జీవం తప్పనిసరి

**న్యూఢిల్లీ-నవభూమి:**నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద రికవరీ తో ప్రారంభమైనా 25,250 వద్ద విఫలమై చివరి రెండు రోజుల్లో బలమైన రియాక్షన్‌లోకి జారుకుంది. చివరికి వారం మొత్తానికి 130 పాయింట్ల నష్టంతో 24,830 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా 25,000 స్థాయిలో ఏర్పడిన కన్సాలిడేషన్‌లో విఫలమైంది. అలాగే మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా బలమైన కరెక్షన్ సాధించాయి. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. నిఫ్టీ గత నాలుగు వారాలుగా నిరంతర కరెక్షన్ ట్రెండ్‌లో ట్రేడవుతూ 850 పాయింట్ల మేరకు నష్టపోయింది. ప్రస్తుతం 25,000 కన్నా దిగువకు వచ్చినందువల్ల స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చు.
బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ఇంతకాలం మద్దతు స్థాయిగా ఉన్న 25,000 ఇప్పుడు నిరోధ స్థాయిగా మారింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ స్థాయిలో పునరుజ్జీవం సాధించి తీరాలి.

# స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు ఎంతుంది?




**ముంబై-నవభూమి:**స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్ల అంశంపై మరోసారి తెరపైకి వచ్చింది. పార్లమెంటులో మరోసారి ఈ అంశంపై ప్రశ్నలు తలెత్తాయి. 2024లో భారతీయుల స్విస్ బ్యాంక్ డిపాజిట్లు మూడు రెట్లు పెరిగి దాదాపు రూ.37,600 కోట్లకు చేరినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో భారతీయుల డిపాజిట్లు ఆ స్థాయికి చేరుకున్నాయా? ఇందులో నల్లధనం కూడా ఉందా? 2022 నుంచి ఇప్పటి వరకు విదేశాల నుంచి నల్లధనం ఎంత తిరిగి వచ్చింది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.స్విస్ నేషనల్ బ్యాంక్ గణాంకాల ప్రకారం 2024లో భారతీయుల డిపాజిట్లు పెరిగాయని ప్రభుత్వం తెలిపింది. ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ ద్వారా స్విట్జర్లాండ్ ప్రతి సంవత్సరం భారతీయులకు సంబంధించిన ఆర్థిక సమాచారాన్ని అందిస్తోందని వెల్లడించింది. బ్లాక్ మనీ యాక్ట్ 2015 ప్రకారం ఒకసారి ఇచ్చిన వెసులుబాటు ద్వారా రూ.4,164 కోట్ల విలువైన నల్లధనాన్ని వెల్లడించగా, దానిపై పన్ను, జరిమానా కింద రూ.2,476 కోట్లు వసూలు చేసినట్లు ప్రభుత్వం గణాంకాలు వెల్లడించింది.స్విస్ నేషనల్ బ్యాంక్ గణాంకాల ఆధారంగా కొన్ని మీడియా నివేదికలు వచ్చాయని, వాటిలో 2024లో స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డిపాజిట్లు పెరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు జావేద్ అలీ ఖాన్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. స్విస్ వివరాల ప్రకారం.. ఎస్ఎన్‌బీ గణాంకాలలో కస్టమర్ డిపాజిట్లు, ఇతర బాధ్యతలు, బ్యాంకుల నుంచి రావాల్సిన మొత్తాలు కూడా ఉన్నాయని మంత్రి వివరించారు. స్విస్ నేషనల్ బ్యాంక్ వార్షిక గణాంకాలను భారతీయులు స్విట్జర్లాండ్‌లో కలిగి ఉన్న డిపాజిట్లను విశ్లేషించడానికి ఉపయోగించకూడదని స్విస్ అధికారులు స్పష్టం చేశారని ఆయన గుర్తుచేశారు. ఈ మొత్తం నల్లధనంగా భావించడం సరికాదని పేర్కొన్నారు. 2018 నుంచి ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ ద్వారా స్విట్జర్లాండ్ ప్రతి సంవత్సరం భారతీయుల ఆర్థిక సమాచారాన్ని భారత్‌కు అందిస్తోందన్నారు.
మొదటిసారి ఈ డేటాను 2019, సెప్టెంబర్‌లో భారతదేశానికి అందించిందని, ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం కొనసాగుతున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. విదేశీ ఆదాయం, ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని 100 కంటే ఎక్కువ విదేశీ పన్ను పరిధి ప్రాంతాల నుంచి భారత్ పొందుతోందని, పన్ను ఎగవేతకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే, ఆదాయపు పన్ను శాఖ విచారణ, తనిఖీ, అసెస్‌మెంట్, పన్ను, జరిమానా వసూలు, అవసరమైతే క్రిమినల్ ప్రాసిక్యూషన్ వంటి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.
2022 నుంచి 2025 వరకు విదేశాల నుంచి ఎంత నల్లధనం తిరిగి వచ్చింది అనే ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. బ్లాక్ మనీ యాక్ట్, 2015 అమలు చేసిన తర్వాత 2015లో 3 నెలల పాటు ఇచ్చిన వెసులుబాటు ద్వారా రూ.4,164 కోట్ల విలువైన నల్లధనాన్ని వెల్లడించారని, దానిపై పన్ను, జరిమానా కింద రూ.2,476 కోట్లు వసూలు చేసినట్లు చెప్పారు. మార్చి 31, 2025 నాటికి నల్లధన చట్టం కింద 1,021 అసెస్‌మెంట్లు పూర్తయ్యాయన్నారు. వీటిలో పన్ను, జరిమానా కింద రూ.35,105 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో మొత్తం 163 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలు చేశారని, పన్ను కింద రూ.338 కోట్లు ఇప్పటికే వసూలు చేసినట్లు తెలిపారు.పన్ను డిమాండ్‌కు సంబంధించిన అన్ని అప్పీళ్లు హైకోర్టులు, సుప్రీంకోర్టులో పరిష్కారమైన తర్వాత మాత్రమే తుది నిర్ణయం జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. స్విస్ బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్ చేయడం అంటే నల్లధనం అని కాదని అర్థం చేసుకోవడం ముఖ్యమని తెలిపింది. డబ్బును ప్రకటించి, అవసరమైన పన్ను చెల్లించినట్లయితే, ఎవరైనా స్విట్జర్లాండ్‌లో ఖాతా తెరవడం చట్టవిరుద్ధం కాదని గుర్తు చేసింది. స్విస్ నేషనల్ బ్యాంక్ ప్రచురించే డేటాను భారతీయుల చట్టవిరుద్ధ డిపాజిట్లకు ప్రత్యక్ష ఆధారంగా పరిగణించలేమని ప్రభుత్వం పార్లమెంటులో స్పష్టం చేసింది.

# కొత్త పన్ను విధానంలోనూ..4 విధాలుగా పన్ను ఆదా





**ముంబై-నవభూమి:**ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ 2025లో పన్ను చెల్లింపుదారులకు భారీ శుభవార్త అందించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిబేట్ పరిమితిని రూ.12 లక్షలకు పెంచారు. కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారికి ఇది వర్తిస్తుంది. దీంతో ఈ ఏడాది 80 శాతానికి పైగా ట్యాక్స్ పేయర్లు న్యూ ట్యాక్స్ రెజిమ్‌లోకి మారిపోయారు. పాత పన్ను విధానంతో పోలిస్తే ఎక్కువ బెనిఫిట్స్ వస్తుండడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. మళ్లీ పన్ను మినహాయింపుల కోసం పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉండదు. చాలా ఈజీగా ఐటీ రిటర్నులు ఫైల్ చేయవచ్చు. కొత్త పన్ను విధానంలో ఎలాంటి మినహాయింపులు ఉండవనేది మొదటి నుంచి చెప్తున్న మాట. కానీ, ఇందులోనూ 4 రకాలుగా పన్ను ఆదా చేయవచ్చు. మరి అవి ఏంటో తెలుసుకుందాం.పాత పన్ను విధానంలో అందుబాటులో ఉన్న సెక్షన్ 80సీ పెట్టుబడులు, సెక్షన్ 80డీ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, హౌస్ రెంట్ అలవెన్స్ మినహాయింపులు కొత్త పన్ను విధానానికి వర్తించవు. అయితే, కొత్త విధానంలో తక్కువ అవకాశాలు ఉన్నప్పటికీ, పన్నులను తగ్గించడానికి ఇప్పటికీ చట్టబద్ధమైన వ్యూహాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని గుర్తించడం, ఉపయోగించడంలో తెలివిగా ప్లాన్ చేయడం కీలకం ఉంది.నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అనేది కొత్త పన్ను విధానంలో పన్ను ఆదా చేసేందుకు మంచి అవకాశం. పని చేసే కంపెనీ యాజమాన్యం ఉద్యోగి బేసిక్ శాలరీ నుంచి 14 శాతం ఎన్‌పీఎస్‌కి జమ చేసినట్లయితే సెక్షన్ 80%జజణ%(2) కింద మినహాయింపు వస్తుంది. చాలా మంది ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడం లేదు. ప్రాథమికంగా దీనిని రిటైర్మెంట్ పొందిన వారికోసం రూపొందించారు. ఆ తర్వాత అందరికీ వర్తింపజేస్తున్నారు.

**ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ పెంచడం**
ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఎన్‌పీఎస్‌కు కంపెనీ యాజమాన్యం పేమెంట్లు చేసేంది ఉద్యోగి శాలరీ ప్యాకేజీ నుంచేనని తెలిసిందే. చాలా కంపెనీలు నెలకు రూ.1800 కంట్రిబ్యూట్ చేస్తుంటాయి. అయితే, కేవలం మినిమం పేమెంటం మాత్రమే, కానీ ఎలాంటి లిమిట్ లేదని చాలా మందికి తెలియదు. మీ బేసిక్ శాలరీ రూ.15 వేలకు మించి ఉన్నప్పుడు మీరు రూ.1800 పైన చెల్లించేలా ఏర్పాటు చేసుకోవచ్చు. మీ శాలరీని రీస్ట్రక్చర్ చేయమని అడగవచ్చు. సాధారణంగా కంపెనీ యాజమాన్యం చెల్లించే మొత్తానికి ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది. దీంతో మీరు అదనంగా ఆదా చేసుకోవచ్చు. ఇది పాత పన్ను విధానంతో పాటు కొత్త పన్ను విధానంలోనూ ఉంటుంది.
తల్లిదండ్రులు, పిల్లల ఖాతాలతో ఇన్వెస్ట్ చేయడం ఈ విధానం సాంకేతికంగా చట్టబద్ధమైనది, కానీ నైతికంగా చర్చనీయాంశమైనదిగా పన్ను నిపుణులు చెబుతున్నారు. కానీ మీరు దీన్ని సరైన విధానంతో జాగ్రత్తగా అమలు చేస్తే, మీ పన్ను భారాన్ని తగ్గించడంలో ఇది ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు.సంపాదన లేని తల్లిదండ్రులకు మిగులు డబ్బును బహుమతిగా ఇచ్చి వారి ఖాతా ద్వారా పెట్టుబడి పెట్టడం సురక్షితమైన పద్ధతి. దానిని బహుమతిగా ప్రకటించడం వల్ల ఆ డబ్బులకు ట్యాక్స్ కట్టక్కర్లేదు.


**ఆర్బిట్రేజ్ ఫండ్స్..**
మీరు మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల ద్వారానూ ట్యాక్స్ తగ్గించుకోవచ్చు. డెట్ ఫండ్స్‌కి బదులుగా ఆర్బిట్రేజ్ ఫండ్స్ ఎంచుకుంటే వాటిని ఈక్విటీ పెట్టుబడులుగా పరిగణిస్తారు. దీంతో వాటిని రిడంప్షన్ చేసినప్పుడు మాత్రమే ట్యాక్స్ పడుతుంది. మీరు 12 నెలల తర్వాత రిడంప్షన్ చేస్తే కేవలం 12.5 శాతం మాత్రమే ట్యాక్స్ పడుతుంది. ముందే తీసుకుంటే 20 శాతం వరకు కట్టాల్సి వస్తుంది.

# మళ్లీ తగ్గిన బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరుకున్నాయంటే



**ముంబై-నవభూమి:** బంగారం, వెండి ప్రియులకు కాస్త ఊరట లభించింది. ఎందుకంటే నిన్నటితో పోల్చితే వీటి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో జులై 28, 2025న ఉదయం 6:20 గంటల సమయానికి, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గిపోయాయి.
24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.10 తగ్గి రూ.99,920కి చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,159 స్థాయికి చేరింది. అదే సమయంలో, వెండి ధర కిలోకు రూ.100 తగ్గి రూ.1,15,900కి చేరుకుంది. ఈ తగ్గుదల బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట కలిగిస్తుందని చెప్పవచ్చు.
ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు
హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,920గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,159గా ఉంది. వెండి ధర కిలోకు రూ.1,25,900కు చేరుకుంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,00,070, 22 క్యారెట్ల బంగారం రూ.91,740గా ఉంది, వెండి ధర కిలోకు రూ.1,15,900గా ఉంది.
ఈ నగరాల్లో కూడా..చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ.99,920, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,590, వెండి ధర రూ.1,25,900గా నమోదైంది. ముంబైలో కూడా ఇదే స్థాయిలో ధరలు ఉన్నాయి. అయితే వెండి ధర కిలోకు రూ.1,15,900గా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం రూ.99,920, 22 క్యారెట్ల బంగారం రూ.91,590, వెండి రూ.1,15,900గా కలదు. ఈ ధరలు ఆయా నగరాల్లోని స్థానిక జ్యువెలర్స్, మార్కెట్ డిమాండ్ ఆధారంగా మారుతుంటాయి.బంగారం, వెండి ధరల తగ్గుదలకు కారణాలు..బంగారం, వెండి ధరల తగ్గుదలకు అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడం భారతదేశంలోనూ ప్రభావం చూపింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచడం లేదా కొంత పెంచడం వల్ల డాలర్ విలువ బలపడింది. దీనివల్ల బంగారం ధరలు తగ్గాయి. ఆర్థిక అస్థిరత తగ్గడం వల్ల పెట్టుబడిదారులు బంగారం కంటే ఇతర ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారు,

## కారును విక్రయిస్తున్నారా.. మంచి ధర రావాలంటే ఇలా చేయండి



**న్యూఢిల్లీ-నవభూమి:** సొంత కారు గురించి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది పాతబడక తప్పదు. క్రమం తప్పకుండా కారును సర్వీసింగ్‌కు ఇస్తున్నా సరే ఒక్కోసారి కారుపై పడే గీతలు, సొట్టలు వంటివి మన దృష్టిని దాటిపోతాయి. ఇక కారు అమ్మాల్సిన సమయం వచ్చినప్పుడు ఇవన్నీ ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. ఆశించిన దాని కంటే తక్కువకే వెహికిల్‌ను విక్రయించాల్సి వస్తుంది. ఇలాంటి బెడద లేకుండా ఉండాలంటే ఏం చేయాలనే దానిపై నిపుణులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేస్తున్నారు. కారు మెయిన్‌టెనెన్స్ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దు. కారు కంపెనీ సూచించిన దాని ప్రకారం, క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించుకోవాలి. చిన్న చిన్న సొట్టలు, అద్దాలు పగలడం వంటి లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవాలి. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్స్ అన్నీ జాగ్రత్త చేసుకోవాలి. కారు అమ్మే సమయంలో ఇవి చాలా అక్కరకు వస్తాయి. మంచి ధరకు కారును విక్రయించేందుకు అవకాశం ఉంటుంది.
కారులో యాక్సెసరీలు బాగుంటే మంచి ధరకు వాహనాన్ని విక్రయించొచ్చు. అధునాతన ఫీచర్లు, టెక్నాలజీ ఉన్న కార్లపై కొనుగోలుదార్లు ఆసక్తి ప్రదర్శిస్తారు. కాస్త ఎక్కువ ధర చెల్లించైనా సరే వాటిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆధునిక ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్స్, బ్లూ టూత్ కనెక్టివిటీ, బ్యాకప్ సెన్సర్లు, కెమెరా, నావిగేషన్ సిస్టమ్స్ వంటివి ఉంటే కారును అధిక ధరకు విక్రయించవచ్చు.ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్. కార్లకూ ఇది వర్తిస్తుంది. కారు పాతది అయినప్పటికీ కాస్త ఆకర్షణీయంగా కనబడితే మంచి ధరకు విక్రయించే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి, కారుకు క్రమం తప్పకుండా వాషింగ్, వ్యాక్సింగ్ వంటివి చేయిస్తే పర్యావరణ ప్రభావం తగ్గుతుంది. చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
కారు రంగును బట్టి కూడా ధర నిర్ణయమవుతుంది. ఈ అంశం వ్యక్తిగత అభిరుచికి సంబంధించినదే అయినా తెలుపు, నలుపు, సిల్వర్ రంగులో ఉన్న కార్లు అధిక ధరలకు విక్రయమవుతాయని అనేక మంది చెబుతున్నారు. కాబట్టి, ఈ జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటిస్తే కార్లను మంచి ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు.

## దీర్ఘకాలిక ఇన్వెస్ట్‌మెంట్ కోసం చూస్తున్నారా.. మీకున్న టాప్ 10 ఆప్షన్స్ ఇవే


**న్యూఢిల్లీ-నవభూమి:**ఆర్థిక స్థిరత్వం కోసం స్మార్ట్‌గా పెట్టుబడులు పెట్టాలి. ఇలాంటి పెట్టుబడి సాధనాల కోసం వెతికే భారతీయుల ముందు పలు ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయి. ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ తీసుకునే ధైర్యం, చేతిలో ఉన్న డబ్బు తదితరాల ఆధారం వీటిలో పెట్టుబడులు పెడితే భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది. మరి నిపుణులు చెప్పే దాని ప్రకారం, భారత్‌లో టాప్ 10 పెట్టుబడి సాధనాలు ఏవో ఈ కథనంలో చూద్దాం.విశ్వసనీయ పెట్టుబడి సాధనాల్లో బంగారం ఎప్పుడూ ముందువరుసలోనే ఉంటుంది. నగలు, గోల్డ్ కాయిన్స్‌తో పాటు గోల్డ్ ఈటీఎఫ్స్, సోవరిన్ గోల్డ్ బాండ్స్ వంటి వాటిపై పెట్టుబడులతో మంచి రాబడి పక్కా. దీర్ఘకాలంలో బంగారం విలువ పెరిగేదే కానీ తరిగేది కాదని నిపుణులు చెబుతున్నారు.అటు బీమా, ఇటు పొదుపు పథకం లాభాలను ఏకకాలంలో అందించే అనేక పాలసీలను ఎల్ఐసీ అందిస్తోంది. పాలసీ మెచ్యూరిటీతో వచ్చే బెనిఫిట్స్‌తో పాటు విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఇవి ఆర్థిక రక్షణను ఇస్తాయి. వీటిపై పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు కూడా ఉంటుంది.మంచి రాబడులను పక్కాగా అందించే పెట్టుబడి సాధనాల్లో బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మించినది లేదు. రిస్క్‌ను ఇష్టపడని ఇన్వెస్టర్లు, సీనియర్ సిటిజన్లు వీటిల్లో డబ్బు మదుపు చేసి మంచి రాబడిని పొందొచ్చు.స్టాక్స్, బాండ్స్, ఇతర పెట్టుబడి సాధనాలు కలగలిసిన మ్యూచువల్ ఫండ్స్‌లో సహజంగానే రాబడులు ఇతర సాధనాలతో పోలిస్తే కాస్త అధికంగా ఉంటాయి. డెట్, ఈక్విటీ, హైబ్రీడ్ ఫండ్స్ వంటి అనేక ప్రత్యామ్నాయాలను ఇన్వెస్టర్లు తమ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా ఎంచుకోవచ్చు. ఇక ఎస్ఐపీ లాంటి వాటిల్లో క్రమం తప్పకుండా చేసే పెట్టుబడులు కూడా దాదాపుగా ఇదే ఫలితాన్ని ఇస్తాయి.ప్రభుత్వ గ్యారెంటీ ఉన్న ఆర్‌బీఐ బాండ్స్‌తో క్రమం తప్పకుండా ఆదాయాన్ని పొందొచ్చు. అయితే, వీటిల్లోని లాకిన్ పీరియడ్ కొందరికి ఇబ్బందిగా అనిపించే అవకాశం ఉంది.ఇక సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలను ఇష్టపడే వారికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ ఓ ఉత్తమమైన ప్రత్యామ్నాయం. రికరింగ్ డిపాజిట్, మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ వంటి రెండు ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి.రాబడిపై పన్ను వద్దనుకునే వారికి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఓ మంచి ఆప్షన్. ఇందులో పెట్టుబడులపై అధిక వడ్డీ లభిస్తుంది. అయితే, తొలి 15 ఏళ్లు పెట్టుబడుల ఉపసంహరణకు ఛాన్స్ ఉండదు. పన్ను బాధ లేకుండా సంపదను పెంచుకోవాలనుకునే వారికి ఇది మంచి ఆప్షన్.
రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు కూడా మంచి రాబడిని ఇస్తాయి. నివాస, పారిశ్రామిక అవసరాలకు డిమాండ్ దాదాపుగా ఉంటూనే ఉంటుంది కాబట్టి ఈ రంగంలో పెట్టుబడులు భవిష్యత్తుకు భద్రత కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు.తమ కూతుళ్ల భవిష్యత్తు కోసం పొదుపు చేయాలనుకునే వారికి ప్రభుత్వం ప్రారంభించిన సుకన్య సమృద్ధి యోజన మంచి ప్రత్యామ్నాయం. అయితే, ఇందులో బాలికల పేరిట పెట్టే పెట్టుబడులను వారికి 21 ఏళ్లు వచ్చే వరకూ వెనక్కు తీసుకునే ఛాన్స్ ఉండదు.రిటైర్మెంట్ తరువాత ఆర్థిక భద్రత కోసం నేషనల్ పెన్షన్ ఫండ్‌ను ఎంచుకోవచ్చు.

# కంపెనీ చరిత్రలోనే తొలిసారి ఇలా.. 1 షేరు కొంటే 2 షేర్లు



**న్యూఢిల్లీ-నవభూమి:**మిడ్ క్యాప్ కేటగిరి, మైనింగ్ రంగంలోని ప్రముఖ కంపెనీ అయిన బీఈఎంఎల్ లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకుగుడ్‌న్యూస్ చెప్పింది. జూలై 21వ తేదీన కంపెనీ బోర్డు డైరెక్టర్స్ సమావేశమై స్టాక్ స్ప్లిట్ చేపట్టేందుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. దీంతో 1 షేరు కొనుగోలు చేసిన వారికి 2 షేర్లు ఖాతాలోకి వస్తాయని తెలిపింది. ఈ స్టాక్ స్ప్లిట్ రికార్డు డేట్ త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపింది. మరోవైపు ఈ షేరు గత 52 వారాల్లోనే డబుల్ అయింది. ఈ స్టాక్ స్ప్లిట్ తర్వాత స్టాక్ ధర రూ. 4100 నుంచి సుమారు రూ. 2050లకి పడిపోనుంది. కంపెనీ చరిత్రలోనే మొట్ట మొదటిసారి స్టాక్ స్ప్లిట్ చేపడుతుండడం విశేషం.కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. జూలై 21వ తేదీన జరిగిన కంపెనీ డైరెక్టర్ల సమావేశంలో 1:2 రేషియోలో స్టాక్ స్ప్లిట్ చేసేందుకు ఆమోదం లభించింది. అంటే రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న ఒక ఈక్విటీ షేరుని రూ. 5 ఫేస్ వ్యాల్యూ ఉండేలా 2 ఈక్విటీ షేర్లుగా విభజించేందుకు కంపెనీ డైరెక్టర్స్ ఆమోదం తెలిపారు. అయితే ఈ స్టాక్ స్ప్లిట్ అర్హులైన వాటాదారుల్ని గుర్తించేందుకు అవసరమైన రికార్డు తేదీని త్వరలోనే బోర్డు నిర్ణయించనున్నట్లు కంపెనీ తెలిపింది.ఈ రోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్లో బీఈఎంఎల్ లిమిటెడ్ షేరు ధర ఈ వార్త రాసే సమయానికి 3.34 శాతం నష్టంతోరూ. 4010 వద్ద ట్రేడవుతోంది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ ధర రూ. 4874.80, కనిష్ఠ ధర రూ. 2350గా ఉంది. అంటే 52 వారాల్లోనే రెండింతలు అయింది. అయితే ఆ తర్వాత క్రమంగా పడిపోతోంది. గత వారం రోజుల్లో 5 శాతం నష్టపోగా గత నెల రోజుల్లో 7 శాతం పడిపోయింది. గత ఆరు నెలల్లో 24 శాతం లాభాన్ని అందించింది. గత ఐదేళ్లలో 548 శాతం లాభాన్ని అందించింది. లక్ష పెట్టుబడి పెట్టి 5 ఏళ్లు కొనసాగినట్లయితే ఇప్పుడు అది రూ.6.48 లక్షలు అవుతుంది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 17,290 కోట్ల వద్ద ఉంది.ఈ కథనం కేవలం సమాచారం కోసమే. ఎవరినీ పెట్టుబడులు పెట్టాలని ప్రోత్సహించేందుకు కాదు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టేందుకు ముందుగానే పూర్తి వివరాలు తెలుసుకోవాలి. సరైన అవగాహన లేకుండా ఇన్వెస్ట్ చేస్తే నష్టపోయే ప్రమాదం ఉంటుంది. నిపుణుల సలహా మేరకు సరైన స్టాక్ ఎంచుకోవాలి.

నవచిత్ర



# అనసూయ ఏకంగా 30 లక్షల మందిని బ్లాక్ చేసిందా!

అనసూయ భరద్వాజ్.. ఈ పేరు గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరు. అటు బుల్లితెరపై, ఇటు వెండితెరపై సంచలనాలు క్రియేట్ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ ఒక్కోసారి ఆసక్తికర కామెంట్స్ కూడా చేస్తూ వార్తలలో నిలుస్తూ ఉంటుంది. బుల్లితెరకు గ్లామర్ అద్దిన అతికొద్ది మందిలో అనసూయ ఒకరు కాగా, ఈ బ్యూటీ జబర్దస్త్ షోతో భారీ పాపులారిటీ సంపాదించింది. మాటలతో మజా చేస్తూనే అందంతో మాయ చేసి కుర్రకారుకి కంటిపై కునుకు లేకుండా చేసింది. నటిగా కూడా తనదైన ముద్ర వేసుకున్న అనసూయ భరద్వాజ్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచింది.'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప', 'పుష్ప 2' వంటి చిత్రాల్లో నటిగా మెప్పించిన అనసూయ స్పెషల్ సాంగ్స్, ఈవెంట్ పెర్ఫార్మెన్స్‌ల ద్వారా కూడా అభిమానులను అలరిస్తూ ఉంటుంది.. ఇటీవల టీవీ షోలతో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'కిర్రాక్ బాయ్స్ ఖిలాడీ గర్ల్స్' వంటి షోలలో టీమ్ లీడర్‌గా కనిపించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అనసూయ మాట్లాడుతూ, తనపై వచ్చే ట్రోల్స్, నెగెటివ్ కామెంట్స్‌పై స్పందించింది. ఎవరైనా అభ్యంతరకరంగా కామెంట్ చేస్తే వెంటనే బ్లాక్ చేస్తాను. ఇప్పటివరకు సుమారుగా 30 లక్షల మందిని బ్లాక్ చేసి ఉంటాను. నేను వాళ్లను ఇక భరించలేను అనుకున్నప్పుడు నా ప్రపంచం నుంచి తొలగించేస్తాను అని చెప్పుకొచ్చింది అనసూయ. అనసూయ చేసిన ఈ కామెంట్స్‌పై కూడా నెటిజన్లు సెటైర్స్ వేస్తున్నారు. అనసూయ చాలా మందిని బ్లాక్ చేశాను అని ఉంటే సరిపోయేది కానీ 30 లక్షల మందిని బ్లాక్ చేశానని చెప్పడం నమ్మశక్యంగా లేదని అంటున్నారు. రోజుకి పది నుండి వంద మందిని బ్లాక్ చేసిన కూడా మూడు మిలియన్ కాదంటూ సెటైర్స్ వేస్తున్నారు.



# వ్వావ్ తమన్నా..! మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా



మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా కెరీర్ జర్నీ, లవ్ స్టోరి గురించి తెలిసిందే. టాలీవుడ్ – కోలీవుడ్– బాలీవుడ్ లో ఈ భామ చాలా కాలంగా మూడు ముక్కలాట ఆడుతోంది. పెద్ద స్టార్ల సరసన అవకాశాలు దక్కకపోయినా, తెలివిగా లాంగ్ రన్ ని కొనసాగిస్తోంది. మరోవైపు సోషల్ మీడియాల్లోను తమన్నా స్పీడ్ ఏమాత్రం తగ్గడం లేదు. తాజాగా మనీష్ మల్హోత్రా డిజైనర్ లెహంగాలో ఈ బ్యూటీ తళుక్కున మెరిసింది. మిల్కీ బ్యూటీ అందాలకు వ్వావ్! అంటూ అభిమానులు థమ్సప్ ఇస్తున్నారు.మనీష్ జీ డిజైనర్ దుస్తుల్లో గ్లాం అవతార్ ఒక గొప్ప అనుభూతి అని మిల్కీ బ్యూటీ ఆనందం వ్యక్తం చేసింది. ఆ కోచర్ పార్టీ ప్రత్యేకమైనది... ఎంత అద్భుతమైన రాత్రి.. అంటూ డిజైనర్ మనీష్ మల్హోత్రాను ప్రశంసించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. తమన్నా భాటియా సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఓదెలా 2లో కనిపించింది. అశోక్ తేజ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హెబా పటేల్ కూడా మరో కథానాయిక. అజయ్ దేవ్‌గన్ రైడ్ 2లో నాషా అనే ప్రత్యేక పాటలో నర్తించింది. డేరింగ్ పార్టనర్స్ అనే అమెజాన్ ప్రైమ్ వెబ్ సిరీస్‌లో దయానా పెంటీతో కలిసి తమన్నా కనిపించనుంది. ఈ సిరీస్‌లో జావేద్ జాఫెరి – నకుల్ మెహతా తదితరులు నటించారు. ఈ సిరీస్ విడుదల తేదీని ఇంకా ప్రకటించలేదు. అజయ్ దేవగన్ – సంజయ్ దత్ లతో పాటు అడ్వెంచర్ థ్రిల్లర్ రేంజంలో తమన్నా కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రంలో అజయ్ దేవగన్ ఫారెస్ట్ రేంజర్ గా – సంజయ్ దత్ విలన్ గా కనిపించనున్నారు. జగన్ శక్తి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం 2026 లో విడుదల కానుంది.

# బ్రిటిష్ నటితో యంగ్ హీరో జోరు



లేగ కళ్లతో గుండె కోసేస్తోంది బ్రిటీష్ నటి– గాయని జరా ఖాన్. ఈ బ్యూటీ ఇటీవల వరుస సింగిల్స్ తో హృదయాలను గెలుచుకుంటోంది. స్వరకర్త తనిష్క్ బాగ్చి – గాయకుడు యాసర్ దేశాయ్‌లతో కలిసి 'జోగన్' అనే తన రెండవ సింగిల్‌తో ఇటీవల అభిమానులను అలరించారు. ట్రెడిషనల్ దేశీ బాణీ సంగీత ప్రియుల్ని అలరించింది. భారతదేశ ట్రెడిషనల్ సంగీతం అంటే చెవి కోసుకునే ఈ అమ్మడు ప్రస్తుతం టైగర్ ష్రాఫ్ తో తన మూడో సింగిల్ లో నటిస్తోంది. తాజాగా ఆన్ లొకేషన్ నుంచి కొన్ని ఫోటోలు వీడియోలను జారా షేర్ చేసింది. ఇవన్నీ ప్రస్తుతం ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. పర్ఫెక్ట్ ఫిట్ టోన్డ్ బాడీతో టైగర్ ష్రాఫ్ గుబులు పుట్టిస్తుండగా, జరా ఖాన్ అందచందాలు, డ్యాన్సుల్లో గ్రేస్ యువతరాన్ని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఒక రొమాంటిక్ గీతాన్ని తెరకెక్కించడంలో ఎన్ని కాంప్లికేషన్స్ ఉంటాయి? దీనికోసం ఎంతగా ప్రాక్టీస్ చేయాలో కూడా జరా ఖాన్ షేర్ చేసిన వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఆన్ లొకేషన్ వంద మంది ముందు కథానాయికతో రొమాన్స్ చేయాలంటే హీరోకి ఎంత కష్టమో కూడా అర్థమవుతోంది. . ఏమైందంటే తాజాగా జరా షేర్ చేసిన వీడియోలు, ఫోటోలకు అందమైన క్యాప్షన్ కూడా ఇచ్చింది. రెండేళ్ల సమయం పట్టిందని, ఈ మాయా పాటను రూపొందించడానికి అన్నివిధాలా ప్రయత్నించినందుకు మొత్తం బృందానికి జరా అభినందనలు తెలిపింది. జరా ఖాన్ తదుపరి బాలీవుడ్ చిత్రాల్లో నటించేందుకు ఆసక్తిగా ఉంది. వెబ్ సిరీస్ లలోను నటించే ఆఫర్లు అందుకుంటోంది.

# బిగ్ బాస్ 9.. 3 రోజుల్లోనే షాక్..!




బిగ్ బాస్ సీజన్ 9 మొదలవ్వకముందే ఈసారి బజ్ బాగుంది. ప్రతి సీజన్ మొదలైన తర్వాత షో గురించి అందరు మాట్లాడుకుంటారు. కానీ బిగ్ బాస్ సీజన్ 9 కి మాత్రం షో మొదలవడానికి నెల రోజుల ముందు నుంచే సోషల్ మీడియాలో హంగామా మొదలైంది. అఫ్కోర్స్ బిగ్ బాస్ 9 కోసం అందులో కంటెస్టెంట్స్ లిస్ట్ కోసం రివ్యూయర్స్ చేస్తున్న హడావిడి తెలిసిందే. ఒక్కొక్కరు వాళ్లకి ఇష్టం వచ్చినట్టుగా కంటెస్టెంట్స్ లిస్ట్ వేస్తున్నారు. ఫైనల్ కంటెస్టెంట్స్ ఎవరన్నది మాత్రం షో మొదలయ్యాక తెలుస్తుంది. ఐతే బిగ్ బాస్ సీజన్ 9 లో బిగ్ బాస్ టీం ఈసారి ఆడియన్స్ కు షాకుల మీద షాకులు ఇస్తారట. షో మొదలైన 3 రోజుల్లోనే ఎలిమినేషన్ అంటూ షాక్ ఇస్తారట. షోని మరింత రసవత్తరంగా మార్చేందుకు మొదటి 3 రోజుల నుంచే బిగ్ బాస్ ఆట మొదలు పెడతాడట. బిగ్ బాస్ ఎలిమినేషన్ ఎప్పుడైనా వారం తర్వాత ఉంటుంది.మొదటి ఎలిమినేషన్ హౌజ్ లో వెళ్లిన వాళ్ల జస్ట్ రెండు రోజుల బిహేవియర్ చూసి హౌస్ లో వాళ్లు అన్ ఫిట్ అని నామినేట్ చేస్తారు. అలా నామినేట్ అయిన వారి నుంచి బయట బిగ్ బాస్ లవర్స్ ఎవరిని సేఫ్ చేయాలి.. ఎవరిని ఎలిమినేట్ చేయాలన్నది చూస్తారు. కానీ ఈసారి బిగ్ బాస్ సీజన్ 9 లో ఫస్ట్ త్రీ డేస్ లోనే ఎలిమినేషన్ ఉంటుందని తెలుస్తుంది.బిగ్ బాస్ సీజన్ 9 విషయంలో టీం అంతా చాలా కష్టపడి కొత్త కొత్త టాస్క్ లు ప్రవేశ పెడుతున్నారట. సీజన్ 9 అంతకుముందు సీజన్లు అన్నిటి కన్నా ది బెస్ట్ అనిపించేలా ఉండాలని ప్రయత్నిస్తున్నారు. బిగ్ బాస్ సీజన్ 9 కి కింగ్ నాగార్జున హోస్టింగ్ కూడా అదిరిపోయేలా ఉంది. మరి సీజన్ 9 నిజంగానే మొదటి ఎలిమినేషన్ మూడు రోజుల్లో ఉంటుందా అన్నది చూడాలి. బిగ్ బాస్ సీజన్ 9 ని సెప్టెంబర్ మొదటి వారంలో మొదలు పెట్టే ఆలోచనలో ఉన్నారు బిగ్ బాస్ టీం.బిగ్ బాస్ సీజన్ 9 రణరంగం అంటూ కొత్త ప్రోమోతో నాగార్జున సర్ ప్రైజ్ చేశారు. షో మొదలు పెట్టకముందే ఈసారి ఆడియన్స్ లో క్యూరియాసిటీ కూడా మొదలైంది.

# మాయా బజార్ స్టైల్‌లో హరిహర వీరమల్లుని తీయాలనుకున్నారా?



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హరి హర వీరమల్లు'జులై 24న విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. వీఎఫ్ఎక్స్ విషయంలోనే పలు విమర్శలు అందుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సినిమా ఎంత కలెక్ట్ చేసింది, మూవీ హిట్టా ఫట్టా అన్నది పక్కన పెడితే ఈ సినిమా కథపై సోషల్ మీడియాలో పెద్ద చర్చే నడుస్తోంది. ముఖ్యంగా సనాతన ధర్మం అంశాన్ని ఎలా మిళితం చేశారు? అసలు కథలో ఇది మొదట నుంచే ఉందా? లేదా తర్వాత యాడ్ చేశారా? అనే ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఈ సినిమాను మొదట దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేయగా, ఐదున్నరేళ్ల క్రితం ప్రాజెక్ట్ ప్రారంభమైంది.కానీ మధ్యలో కొన్ని కారణాలతో క్రిష్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో, నిర్మాత ఏఎం రత్నం కుమారుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. దీంతో కథలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక సినిమా రెండు పార్టులుగా మలచబడింది.సినిమాలోని ప్రధాన అంశాల్లో ఒకటైన సనాతన ధర్మం కాన్సెప్ట్ గురించి దర్శకుడు జ్యోతికృష్ణ తాజాగా స్పందించారు. కోహినూర్ వజ్రంతో కథ మొదలవుతుంది. కానీ సెకెండాఫ్ మొత్తం సనాతన ధర్మం చుట్టూ తిరుగుతుంది. ఇది నా ఆలోచనే. క్రిష్ రాసిన కథలో ఈ పాయింట్ లేదు. నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చిన తర్వాతే రెండు పార్టులుగా చేయాలని నిర్ణయించాం అని తెలిపారు.అలాగే, పవన్ కళ్యాణ్ ఇటీవల సనాతన ధర్మంపై మాట్లాడుతున్న సందర్భంలో, ఈ అంశాన్ని కథలో చేర్చడం సహజంగా జరిగిందని చెప్పారు.క్రిష్ విజన్ ప్రకారం కోహినూర్ చుట్టూ తిరిగే కథతో మాయాబజార్ లాంటి సినిమా చేయాలనుకున్నారు. కానీ ఆ కథ తీయాలంటే నాలుగున్నర గంటల ఫుటేజ్, భారీ డేట్స్ కావాలి. అప్పటికే పవన్ గారు ఈ ప్రాజెక్ట్ కోసం చాలా కాలం వెయిట్ చేశారు. పాండమిక్, లాక్‌డౌన్, ఎలక్షన్ల కారణంగా ప్రాజెక్ట్ ఇంకా లేట్ అవుతుందని క్రిష్ చెప్పారు. తాను వెళ్లి మరో ప్రాజెక్ట్ పూర్తి చేసి వస్తానన్నారు అని జ్యోతికృష్ణ వివరించారు. పార్ట్–1 కోసం కథలో మార్పులు చేయాల్సి వచ్చిందని, కోహినూర్ వజ్రం చుట్టూ తిరిగే అసలు కథను పార్ట్–2లో చూపిస్తామన్నారు.క్రిష్ రాసిన కథ పార్ట్–2లో కొనసాగుతుంది. దాంతో పాటు సనాతన ధర్మం అంశం కూడా ఉంటుంది. రెండింటినీ మిళితం చేసి, పార్ట్–2లో మెరుగైన కథను అందించేందుకు ప్లాన్ చేస్తున్నాం," అని తెలిపారు.

# ఏంటి ఆమిర్ ఖాన్ ఇంటికి 25 మంది కలెక్టర్లతో పోలీసులు




భారతీయ చలన చిత్ర పరిశ్రమలో బిగ్గెస్ట్ స్టార్‌గా ఒకప్పుడు ఓ వెలుగు వెలిగాడు ఆమిర్ ఖాన్. లగాన్, రంగ్ దె బసంతి, 3 ఇడియట్స్, పీకే, దంగల్ లాంటి చిత్రాలతో ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తూ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అనిపించుకున్నాడు. 'దంగల్' సినిమా చైనాలో కూడా అదరగొట్టడంతో ఏకంగా రూ.2 వేల కోట్ల మైలురాయిని సైతం ఆమిర్ సాధించిన విషయం తెలిసిందే. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో బిగ్గెస్ట్ స్టార్‌గా ఒకప్పుడు ఓ వెలుగు వెలిగాడు ఆమిర్ ఖాన్. లగాన్, రంగ్ దె బసంతి, 3 ఇడియట్స్, పీకే, దంగల్ లాంటి చిత్రాలతో ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తూ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అనిపించుకున్నాడు. 'దంగల్' సినిమా చైనాలో కూడా అదరగొట్టడంతో ఏకంగా రూ.2 వేల కోట్ల మైలురాయిని సైతం ఆమిర్ సాధించిన విషయం తెలిసిందే. అంత సత్తా ఉన్న ఈ హీరో గత రెండు చిత్రాలతో దారుణమైన ఫలితాలందుకున్నాడు. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్', 'లాల్ సింగ్ చడ్డా' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి.ఆ తర్వాత వచ్చిన 'సితారే జమీన్ పర్' సినిమాకు టాక్ కొంచెం డివైడ్‌గా వచ్చినా.. బాక్సాఫీస్ దగ్గర బాగానే నిలబడింది.సినిమాల విషయం పక్కన పెడితే.. బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ ఇంటిని 25 మంది ఐపీఎస్ అధికారులు సందర్శించడం ఇప్పుడు సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముంబై బాంద్రాలోని ఆయన నివాసానికి వీరంతా బస్సులు, వ్యాన్లలో హఠాత్తుగా చేరుకోవడంతో ఆందోళన నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకోవాలనే ఉత్సుకతతో ఓ ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ ఆమిర్ ఖాన్ టీమ్‌ను సంప్రదించింది. అయితే వారి స్పందన అంత క్లారిటీగా లేదు. మేమూ ఇంకా ఆరా తీస్తున్నాం. అధికారిక సమాచారం తెలియాల్సి ఉంది అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో పరిణామాల వెనక నిజమైన ఉద్దేశ్యం ఏమిటో ఇంకా సస్పెన్స్‌గా ఉంది.

# కత్తికిందకు వెళ్లాలా? లేదా? అన్నది వాళ్ల చేతుల్లోనే!



లైపోసర్జీలు...కాస్మోటిక్ సర్జీలు సెలబ్రిటీలకు కొత్తేం కాదు. గ్లామర్ వరల్డ్ లో రాణించాలంటే? ఇలాంటి వాటిని తప్పనసరిగా భావిస్తుంటారు. వయసు తో సంబంధం లేకుండా...ఆడ మగ అనే తేడా లేకుండా అనవరంగా భావించిన వారంతా సర్జరీలలో తరూపాన్ని మార్చుకుంటారు. పోటీలో రాణించాలన్నా? కొత్త వారితో పోటీ పడాలన్నా? చాలా మంది సెలబ్రిటీలు సర్జరీలు తప్పని సరిగా భావిస్తుంటారు కొన్ని సందర్భాల్లో లైపో సర్జరీలు వికటించి మృత్యువాత పడిన వారు కూడా ఉన్నారు. తాజాగా ఈ అంశంపై బాలీవుడ్ నటి కోజోల్ తన అభిప్రాయాన్ని పంచుకుంది. సర్జరీలు అనేవి వారి వ్యక్తిగత విషయం. ఒకరిని జడ్జ్ చేసే చేయకూడదు. కాస్మోటిక్ సర్జరీలు కేవలం మహిళలు మాత్రమే చేయించుకోవడం లేదు. పురుషులు కూడా చేయించుకుంటున్నారు. కత్తికిందకు వెళ్లాలా? లేదా? అన్నది వారి వ్యక్తి గత ఇష్టం. వృద్ధాప్యం అనేది వయసుకు సంబంధించిన విషయం. కానీ వృద్ధాప్యానికి చేరుకుం టామా? లేదా? అన్నది కొంత వరకూ మన చేతుల్లోనే ఉంటుంది. కసరత్తులతో వృద్ధాప్యాన్ని కొంత కాలం వాయిదా వేయోచ్చు. యోగా, జిమ్, రన్నింగ్ లాంటివి ఎంతో బాగా పనికొస్తాయి. ఆరోగ్యానికి ఎంతో మంచివి . కొంత మంది చిన్న వయసులోనే చనిపోతారు. అలాంటి వారు వృద్ధాప్యానికి చేరుకోరు. అలాగని వారు అదృష్టవంతులని కాదు. అంటే వారికి వృద్ధాప్యాన్ని అనుభవించే అవకాశం లేకుండా పోయిందని అర్థం. నాకోసం జీవించడానికి ఇంకా చాలా అద్భుతమైన సంవత్సరాలు మిగిలి ఉన్నాయని భావిస్తున్నాను. కానీ జీవితం అన్నది నీటి బుడగల లాంటింది. ఈరోజు ఉన్న జీవితం రేపు ఉండక పోవచ్చు అన్నది అంతే వాస్తవం. మనిషిని మృత్యువు ఎలా కబళిస్తుందో తెలిదు. అది మన చేతుల్లో లేదు. కానీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అన్నది మన చేతుల్లోనే ఉందని బలంగా నమ్ముతాను. అందుకే ఆరోగ్యంగా ఉండేదుకు నా వంతు ప్రయత్నం ఎప్పుడూ విస్మరించను' అని అన్నారు.

# టీమిండియాలో భారీ మార్పులకు బీసీసీఐ సిద్ధమవుతోందా..



**మాంచెస్టర్–నవభూమి:** ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ తరువాత టీమిండియాలో భారీ మార్పులకు బీసీసీఐ సిద్ధమవుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రస్తుతం సేఫ్‌గానే ఉన్నప్పటికీ బౌలింగ్ విషయంపై బీసీసీఐ దృష్టి సారించే అవకాశం ఉంది. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, అసిస్టెంట్ కోచ్ దస్కాటే విషయంలో ఉత్కంఠ మొదలైంది. ఈ ఇద్దరినీ గంభీర్ సిఫారసు చేసిన విషయం తెలిసిందే. వీరిరువురూ ఈ టోర్నీలో ఆశించిన మేర ఫలితాలు రాబట్టలేకపోయారు. అయితే, టీమ్ సంధి దశలో ఉన్న సమయంలో హెడ్ కోచ్ విషయంలో ఎలాంటి మార్పులు చేయొద్దన్న అభిప్రాయంతో బీసీసీఐ ఉన్నట్టు జాతీయ మీడియా కథనాల్లో తేలింది.ఇటీవల డ్రాగా ముగిసిన నాలుగో టెస్టు మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్‌కు ఛాన్స్ ఇవ్వకపోవడం, అన్షుల్ కాంబోజ్ రంగంలోకి దించడం విమర్శలకు తావిచ్చాయి. ఈ నిర్ణయాలపై పరిశీలకులు, ఫ్యాన్స్ కూడా పెదవి విరిచారు.ఇక చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ఈస్ట్ జోన్ ప్రతినిధి శివ్ సుందర్ దాస్‌పై కూడా బీసీసీఐ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. కుల్దీప్ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్‌కు ప్లేయర్లకు మధ్య అభిప్రాయభేదాలు ఉన్నట్టు సమాచారం. అయితే, భారత్‌కు అండగా నిలిచే ఒక్క పేసర్‌ను కూడా తీర్చిదిద్దలేకపో యినందుకు మోర్కెల్‌పై బీసీసీఐ అసంతృప్తితో ఉందట. ఇంగ్లండ్‌తో టెస్టు అనంతరం బీసీసీఐ సమీక్షకు దిగినా ఆసియా కప్ తరువాతే భారీ మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

# భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ.. శిఖర్ ధావన్ సూటి సమాధానం



**మాంచెస్టర్–నవభూమి:** ఇంగ్లండ్ లో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ 2025 రెండో ఎడిషన్‌లో ఇండియా ఛాంపియన్స్ జట్టు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేదు. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగిన భారత జట్టు, టోర్నమెంట్ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో ఉంది. అయితే, ఈ లీగ్‌లో పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో మ్యాచ్ ఆడేందుకు ఇండియా ఛాంపియన్స్ నిరాకరించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిర్ణయంపై పాకిస్తాన్ ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే 2025 మ్యాచ్ రద్దు తర్వాత, పాకిస్తాన్ ఆటగాళ్లు ధావన్.. నిర్ణయాన్ని ప్రభావితం చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇండియా ఛాంపియన్స్ ఓపెనర్ శిఖర్ ధావన్‌కు ఓ పాకిస్తాన్ జర్నలిస్ట్ సెమీ–ఫైనల్‌లో పాక్‌తో మ్యాచ్ ఆడకుడదా అని ప్రశ్నించగా, ధావన్ సూటిగా సమాధానం ఇచ్చాడు. బాయ్ ఒత్తిడిలో నేను నా మాట మారుస్తానని అనుకుంటే, అది జరగదు. గతంలో నేను ఆడలేదు, ఇప్పుడూ కూడా ఆడనని పేర్కొన్నాడు.

నవక్రీడ

# స్టోక్స్‌కు నో



**మాంచెస్టర్–నవభూమి:** ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 138వ ఓవర్ ముగిశాక కెప్టెన్ స్టోక్స్ డ్రా కోసం ముందుకు వచ్చాడు. అయితే జడేజా, సుందర్ సెంచరీకి చేరువలో ఉండడంతో దీనికి అంగీకరించలేదు. దీంతో స్టోక్స్ అసంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. అటు డ్రెస్సింగ్ రూమ్ నుంచి కెప్టెన్ గిల్ చిరునవ్వుతో ఇదంతా గమనిస్తున్నా అతడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక మ్యాచ్‌ను త్వరగా పూర్తి చేసేందుకు స్టోక్స్ తమ ఫీల్డర్లను సర్కిల్ లోపలే ఉంచాడు. దీంతో ఆ తర్వాత ఐదు ఓవర్లలోనే వేగంగా బౌండరీలు రాబట్టి జడ్డూ, సుందర్ తమ శతకాలను పూర్తి చేసి ఆటను ముగించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 203 పరుగులు జోడించడం విశేషం.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**